PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 252 | విజయవాడ, మంగళవారం 15 ఏప్రిల్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 15 April 2025 | Rs

'మినీరత్న' హోదా దిశగా హిందుస్థాన్ షిప్‌యార్డు

- ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ ముందుకు..
- 3 ఫ్లీట్ సపోర్టు షిప్‌ల్లో జులైలో నేవీకి ఒకటి అందజేసేందుకు సిద్ధం
- మరో రూ.3 వేల కోట్ల సబ్‌మెరైన్ ఆర్డరు

2



దూబే, ధోనీ.. ధనా ధన్

- లక్నోపై చెన్నై ఘన విజయం

8

మళ్లీ 'అంబేద్కర్ విదేశీ విద్యాదీవెన'

దళితులకు అత్యున్నత విద్య అందించడమే లక్ష్యం • రెసిడెన్షియల్ స్కూళ్లు పెంపు

పొన్నెకల్లు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో అంబేద్కర్ విదేశీ విద్యా దీవెన పథకాన్ని త్వరలో పునరుద్ధరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నెకల్లులో సోమవారం జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకలు, పి-4 సాధికారిక సభలో ఆయన ప్రసంగించారు. తొలుత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దళిత విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య చదివేందుకు తాము గతంలో అంబేద్కర్ విదేశీ విద్యా దీవెన పథకాన్ని అమలు చేశామన్నారు. గత ప్రభుత్వం పేరు మార్చి ఈ పథకాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. తిరిగి ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్‌సి పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు మరిన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తామన్నారు.

అంబేద్కర్ అందరివారు

గత ప్రభుత్వం కక్షపూరితంగా అమరావతిని నాశనం చేశారని, ప్రజల ఆశీస్సులతో ప్రపంచంలోనే మేటి నగరంగా అమరావతిని తాము తీర్చిదిద్దుతామని చంద్రబాబు అన్నారు. రాజధానిలో రైతులకు, వ్యవసాయ కార్మికులకు న్యాయం చేస్తామని తెలిపారు. అంబేద్కర్ అందరి వాడని, ఆయన కూడా బరోడా రాజు ఇచ్చిన చేయూతతో ఉన్నత స్థాయికి వచ్చారని ఇదే స్ఫూర్తితో తాను పి-4 విధానం తీసుకొచ్చి పేదలను ఆదుకునేందుకు పది శాతం ధనికులు ముందుకు రావాలని పిలుపునిస్తే వారి నుంచి మంచి స్పందన వస్తోందన్నారు.

రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఎస్‌సి, ఎస్‌టిల సంక్షేమానికి రూ.20,221 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. ఎస్‌సి, ఎస్‌టిలను విద్యుత్ ఛార్జీల భారం నుంచి బయటపడేసేందుకు వారి ఇళ్లపై



సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు

సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,241 ఎస్‌సి సంక్షేమ హాస్టళ్లలో 2,35,600 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి రూ.1,331 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరిం చారు. రాష్ట్రంలో 21 లక్షల పేద ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలున్నాయని తెలిపారు. వారి కోసం 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నామన్నారు. ఎస్‌సిలు వారి ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకొని విద్యుత్‌ను ఉత్పత్తి చేసి 200 యూనిట్లు వాడుకుని మిగిలిన దానిని ప్రభుత్వానికి ఇస్తే యూనిట్‌కు రూ.2.09 చొప్పున ఇస్తామన్నారు. నెలకు వంద యూనిట్లు ఇస్తే రూ.209 ఎస్‌సిల ఖాతాల్లో జమవుతాయని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు ఇల్లు కట్టుకునేందుకు రూ.50 వేలు అదనంగా ఇస్తామన్నారు.

విద్యార్థులతో వర్చువల్‌గా మాట్లాడిన చంద్రబాబు

టిడిపి హయాంలో ప్రవేశపెట్టిన అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకం ద్వారా విదేశాల్లో ఉన్నత చదువులు అభ్యసించి నేడు మంచి ఉద్యోగం చేస్తున్న వారితో ప్రజావేదిక నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా మాట్లాడారు. ఆస్ట్రేలియాలో నెట్‌వర్క్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న కొరివి రత్నలత, కెనాడాలో ఇంజనీర్‌గా పనిచేస్తున్న అనిల్‌తో మాట్లాడుతూ 'మీరు కూడా కొంతమంది పేదలను దత్తత తీసుకుని వారిని ఉన్నత స్థాయికి తీసుకొచ్చేందుకు కృషి చేయాలి' అని కోరారు.

పి-4పై విమర్శలు తగవు

పి-4పై తెలియని వారు ఏదో మాట్లాడుతున్నారని చంద్రబాబు విమర్శించారు. ధనికులు పేదలను ఆదుకునేందుకు వీలుగా ఈ కార్యక్రమం అమలు చేస్తున్నామని, దీనిపై ఏదేదో మాట్లాడుతూ విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఇలా మాట్లాడేవారు వారి జీవితంలో ఒక్క కుటుంబాన్ని అయినా బాగు చేశారా? అని ఆయన ప్రశ్నించారు. అనంతరం ప్రజావేదిక సభలో బంగారు కుటుంబాలకు ఎంపికైన వారి సమస్యలు విన్నారు. కుటుంబాలను దత్తత తీసుకున్న మార్గదర్శులను సన్మానించారు. పొన్నెకల్లులో ప్రజల ఆదాయం పెరిగేందుకు కార్యాచరణ రూపొందిస్తామని, ఈ గ్రామంలో 369 పేద కుటుంబాలను దత్తత తీసుకునేందుకు 11 మంది ముందుకు వచ్చారని చంద్రబాబు తెలిపారు.

ప్రజలను తప్పుదోవ పట్టించడంతో నిష్ణాతులు

తిరుమలలోలేని పింక్ డైమండ్‌ను తన ఇంట్లో ఉందని వైసిపి నాయకులు అసత్య ప్రచారం చేశారని చంద్రబాబు విమర్శించారు. ఈ అంశంపై తాను కోర్టులో కేసు వస్తే అసలు పింక్ డైమండ్ లేనేలేదని వైసిపి ప్రభుత్వం కోర్టులో అఫిడవిట్ వేసిందన్నారు. వివేకా హత్య కేసు తనకు అంటగట్టాలని చూశారని, గొడ్డలితో వేసేసి గుండెపోటు అని చెప్పి, తర్వాత తాను చంపించినట్లు ప్రచారం చేసి ఓట్లు దండుకున్నారని విమర్శించారు. ఈ హత్య గురించి ప్రశ్నించిన చెల్లి, అడిగిన వారిపై తప్పుడు కేసులు పెట్టి వేధించారని, వివేకా హత్యలో సాక్ష్యాలు తారుమారు చేయడంతోపాటు సాక్షులను చంపేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఆరుగురు సాక్షులు చనిపోయారన్నారు. ఈ సభలో మంత్రి డోలా బాల వీరాంజనేయులు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ భార్గవ తేజ తదితరులు పాల్గొన్నారు.



సిపిఐ ప్రధాన కార్యాలయంలో సమావేశమైన నాయకులు

వామపక్ష ఐక్యతకు కృషి

సిపిఎం, సిపిఐ నేతలు

అజయ్ భవన్‌కు వెళ్లిన ఎంఎ బేబి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వామపక్ష ఐక్యతను బలోపేతం చేయాలని, దీనికోసం పట్టుదలగా కృషి చేయాలని సిపిఎం, సిపిఐ నేతలు నిర్ణయించారు. సిపిఎం నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎంఎ బేబి , సిపిఐ ప్రధాన కార్యాలయం (అజయ్ భవన్)కు సోమవారం వెళ్లారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు నీలోత్పల్‌బసు, అశోక్‌ధావలే, ఆర్ అరుణ్‌కుమార్ తదితరులతో కలిసి ఎంఎ బేబి సిపిఐ కార్యాలయానికి వెళ్లారు. సిపిఐ కార్యాలయం వద్ద సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజాతో పాటు, సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అనీరాజా, పల్లబ్ సేన్ గుప్తా, కన్హా ఝా తదితరులు సిపిఎం బృందానికి స్వాగతం పలికారు.

అనంతరం ఇరు పార్టీల నేతలు సమావేశమైనారు. వివిధ అంశాలపై ప్రాథమికంగా చర్చించారు. ఈ సమావేశంలో సిపిఐకు చెందిన పలు ప్రజా సంఘాల నేతలు కూడా పాల్గొన్నారు.

కృష్ణా జలాల వివాదంలో

ముంచుకొస్తున్న ముప్పు !

- బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ వేగవంతం
- సుప్రీం కోర్టులోనూ కేసులు
- ఇంకా న్యాయవాదులను నియమించని ఏపి

8



ప్రైవేటురంగంలో రిజర్వేషన్లతో

సామాజిక న్యాయం

- అంబేద్కర్‌కు నివాళిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- స్మృతి వనాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని నినాదాలు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించడం ద్వారానే బాబాసాహెబ్ డాక్టర్ బి.అర్.అంబేద్కర్ కలలుగన్న సామాజికన్యాయం జరుగుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఆయన స్ఫూర్తితో అంటరానితనం, సామాజిక అసమానతల నిర్మూలనకు, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల అమలు కోసం పెద్దఎత్తున పోరాటం నిర్వహిస్తామని తెలిపారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం స్మృతివనంలో విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్మృతివనాన్నిప్రభుత్వమే నిర్వహించాలని, ఆ మేరకు నిధులు కేటాయించాలని, పిపిపి పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని నినాదాలు చేశారు. నివాళి అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అంటరానితనం, వివక్షత అంతం కావాలని, సామాజిక న్యాయం జరగాలని, ప్రతి ఒక్కరికీ విద్య, ఉద్యోగం, ఉపాధి ఉంటేనే సామాజికాభివృద్ధి జరుగుతుందని అంబేద్కర్ ఆశించారని తెలిపారు. కానీ నేటి పాలకుల విధానాలు వాటికి వ్యతిరేకంగా ఉన్నాయని అన్నారు. పేదలకు పంచాల్సిన భూములను పెట్టుబడిదారులకు ఇస్తున్నారని, వాటిల్లో యువతకు ఉపాధి కల్పించడం లేదని, అభివృద్ధి చేయడం లేదని, పరిశ్రమలు పెట్టడం లేదని అన్నారు. ప్రభుత్వం నుండి పొందిన భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని అన్నారు. దీనివల్ల పెద్ద చదువులు చదువుకున్న వారు కూడా ఉపాధి కోసం ఎదురు చూస్తూ పేదరికంలో బతుకులీడుస్తున్నారని అన్నారు. ఇప్పటికీ మిగతా 7లో

ప్రేమ పెళ్లి చేసుకున్న యువతి

అనుమానాస్పద మృతి

- ఇది హత్య అంటూ మృతురాలి భర్త పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ప్రేమ వివాహం చేసుకున్న ఓ యువతి తన తల్లిదండ్రుల ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందారు. ప్రేమ వివాహాన్ని జీర్ణించుకోలేక తల్లిదండ్రులే ఆమెను హత్య చేసినట్టు యువతి భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిత్తూరు నగరంలోని బాలాజీ కాలనీలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు అందిన ఫిర్యాదు ప్రకారం... చిత్తూరు నగరంలోని బాలాజీ కాలనీలో ముంతాజ్, షౌకత్ అలీ కుటుంబం నివాసం ఉంటోంది. ఆర్ఎంపి డాక్టరైన అలీ.... చిత్తూరు రూరల్ మండలం తుమ్మెదపాలెంలో క్లినిక్ నిర్వహిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె యాస్మిన్ (26). ఎస్‌వి సెట్ కాలేజీలో ఎంబిఎ పూర్తి చేశారు. ఫిబ్రవరి 6న ఇంటి నుండి వెళ్లిపోయి యాస్మిన్ తన ఎంబిఎ క్లాస్‌మేటైన పూతలపట్టు మండలం పోర్టుకనుమ గ్రామానికి చెందిన సాయితేజను వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి యాస్మిన్, సాయితేజ కలిసి అదే గ్రామంలో ఉంటున్నారు. తల్లిదండ్రుల ఆహ్వానం మేరకు సోమవారం ఉదయం వారి ఇంటికి వెళ్లిన



యాస్మిన్ (ఫైల్)

ఆమె అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. షౌకత్ అలీ తన కుమార్తె యాస్మిన్‌ను బాలాజీ కాలనీలోని తన ఇంటికి తీసుకొచ్చి తమ పరువు తీసేశావంటూ నానా బూతులు తిట్టారు. యాస్మిన్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మతి చెంది ఉండడాన్ని మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో గుర్తించామంటూ ఆమె తల్లిదండ్రులు టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇది ముమ్మాటికీ హత్యేనని, చంపేసి ఆత్మహత్యగా తన అత్తమామలు చిత్రీకరిస్తున్నారని యాస్మిన్ భర్త సాయితేజ ఆరోపిస్తున్నారు.. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మృతిపై స్థానికులు కూడా అనుమానం వ్యక్తం చేశారు. యాస్మిన్‌ను ఆమె తండ్రి తన ద్విచక్ర వాహనంపై ఇంటికి తీసుకెళ్తున్నప్పుడు తాను అక్కడే ఉన్నానని, తాను తర్వాత వస్తానని తన భార్యతో చెప్పానని, ఆ తర్వాత ఈ ఘోరం జరిగిందని సాయితేజ వాపోయారు. ఇరుపక్షాల ఫిర్యాదులను పోలీసులు నమోదు చేసి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వడగాడ్పులు..వర్షాలు

- రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఒక వైపు తీవ్ర ఎండలు, వడగాడ్పులు బెంబేలెత్తిస్తుంటే మరోవైపు అకాల వర్షాలు అన్నదాతలను కడగండ్ల పాల్జేస్తున్నాయి. రాష్ట్రంలో నెలకొన్న ఈ భిన్న వాతావరణ పరిస్థితుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఈ మేరకు ఆ సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో వడగాడ్పులు, భారీ ఉష్ణోగ్రతలు నమోదవుతు న్నాయని, మరోవైపు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని, ఈ పరిస్థితుల్లో ప్రజలు ప్రధానంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న మూడు రోజులపాటు పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ నెల 15న మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, ప్రకాశం, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 47 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్లు తెలిపారు.



జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్‌గా అంజనీకుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలంగాణ నుంచి ఎపి కేడర్‌కు కేటాయించిన ఇద్దరు ఐపిఎస్ అధికారులకు ప్రభుత్వం పోస్టింగులు ఇచ్చింది. ఈ మేరకు జిఓఆర్‌టి నెంబరు 705ను సోమవారం విడుదల చేసింది. జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్‌గా అంజనీకుమార్‌ను నియమించారు. ఇప్పటి వరకు ఆ పదవిలో కొనసాగుతున్న హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్‌ను రిలీవ్ చేశారు. అభిలాష్‌బిస్తాను ఎపి రోడ్ సేఫ్టీ అథారిటీ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన సెలవులో ఉండటంతో సెలవు పూర్తికాగానే బాధ్యతలు స్వీకరించాలని జిఓలో పేర్కొన్నారు.

కారులో ఆడుకుంటుండగా డోర్లు లాక్

ఇద్దరు చిన్నారులు మృతి



ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఇంటి ఎదుట పార్క్ చేసిన కారు డోర్లు ఓపెన్ చేసి ఉండడంతో దానిలోకి ఎక్కి ఆడుకుంటుండగా.. డోర్లు లాక్ కావడంతో ఊపిరాడక ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఈ విషాద ఘటన తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం దామరగిద్దలో సోమవారం చోటుచేసుకుంది. చిన్నారుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... చేవెళ్ల మండలం పామేన గ్రామానికి చెందిన కావలి వెంకటేష్-జ్యోతి దంపతుల కుమార్తె తన్మయి శ్రీ (5), షాబాద్ మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన మహేందర్-ఉమారాణి దంపతుల కుమార్తె అభినయ శ్రీ (4) ఈ నెల 30న జరగనున్న తమ మామయ్య తెలుగు రాంబాబు పెళ్లి కోసం దామరిగిద్ద గ్రామానికి ముందుగానే వచ్చారు. ఈ ఇద్దరు అక్కాచెల్లెళ్లు సోమవారం ఇంటి ఎదుట పార్క్ చేసి ఉన్న కారులో ఆడుకుంటుండగా కారు డోర్ల ఆటోమెటిక్‌గా లాక్ పడిపోయింది. వారు కారులో ఇరుక్కుపోయిన విషయాన్ని ఎవరూ గమనించలేదు. చిన్నారులు కారులో నుంచి బయటకు వచ్చేందుకు చాలాసేపు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో ఊపిరాడక అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. పిల్లలు కనిపించడం లేదని తల్లిదండ్రులు వెతకడంతో కారులో విగతజీవులుగా కనిపించారు. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. చిన్నారుల మృతితో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. నిర్జీవంగా పడి ఉన్న చిన్నారులను చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

మెహుల్ చోక్సీ అరెస్ట్



న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను వేల కోట్ల రూపాయలకు మోసం చేసిన వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీని బెల్జియం పోలీసులు అరెస్ట్ చేశారు. చోక్సీని పట్టుకునేందుకు ఏడేళ్లుగా భారత దర్యాప్తు ఎజెన్సీలు ప్రయత్ని స్తున్నాయి. ఈ ఆర్థిక నేరగాడి కదలికలపై నిఘా పెడుతూ వచ్చిన అధికారులు ఎట్టకేలకు బెల్జియంలో అరెస్ట్ అయ్యేలా చేశారు. స్విట్జర్లాండ్‌కు పారిపోయేందుకు చోక్సీ ప్రణాళిక వేస్తున్న సమయంలో ఏప్రిల్ 12న బెల్జియం పోలీసులు పట్టుకున్నారు. గీతాంజలి గ్రూప్ యజమాని అయిన చోక్సీ తన మేనల్లుడు నీరవ్ మోడి, ఆయన సోదరుడు నిషాల్ మోడితో కలిసి పిఎన్‌బికి రూ.13,500వేల కోట్ల పైగా కన్నం పెట్టారు. మోసం బయటపడటానికి ముందు 2018లో భారత్‌ను విడిచి పారిపోయారు. చోక్సీ అరెస్ట్ భారత్‌కు పెద్ద విజయం అని కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి పేర్కొన్నారు. తమ ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగానే పేదల డబ్బును దొచుకున్న చోక్సిని అరెస్ట్ చేసిందన్నారు.

అమెరికాకు షాక్

- కీలక ఎగుమతులు నిలిపివేసిన చైనా

బీజింగ్ : టారీఫ్‌ల యుద్ధంలో అమెరికాకు చైనా గట్టి షాక్ ఇచ్చింది. అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలను అమెరికాకు ఎగుమతి చేయడాన్ని చైనా నిలిపివేసింది. ఈ మేరకు న్యూయార్క్ టైమ్స్ సోమవారం ఒక కథనం ప్రచురించింది. చైనా తీసుకున్న ఈ నిర్ణయంతో అమెరికాతో పాటు, అనేక పశ్చిమదేశాల్లో ఆయుధాలు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఏరోస్పేస్ ఇండస్ట్రీ, సెమీ కండక్టర్ల తయారీ కంపెనీలకు అనేక సమస్యలు ఎదురుకానున్నట్లు ఆ కథనంలో పేర్కొంది. రెండవసారి అధ్యక్షునిగా ఎన్నికైన తరువాత ట్రంప్ ప్రారంభించిన ఈ టారీఫ్‌ల యుద్ధంపై అమెరికాలోనే తీవ్ర వ్యతిరేకత, నిరసనలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చైనా తీసుకున్న తాజా నిర్ణయం మరింత ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. ఎగుమతులకు సంబంధించి నూతన నిబంధనలను చైనా రూపొందిస్తోంని, అప్పటి వరకు చైనా పోర్టుల నుండి వీటి ఎగుమతిని నిలిపివేసినట్లు చెబుతున్నారు. దాదాపు ప్రతీ వస్తువు తయారీలో కీలకమైన అయస్కాంతాల రవాణా స్థంభించడంతో తయారీ రంగంపై పెను ప్రభావం పడుతుందని సమాచారం.

చైనా నుండి దిగుమతులే ఆధారం

అమెరికాలోని రక్షణరంగంతో పాటు పలు ఇతర పరిశ్రమలకు చైనా నుండి జరుగుతుతన్న దిగుమతులే కీలక ఆధారం. అయితే, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదలు పెట్టిన టారిఫ్‌ల యుద్ధంతో చైనా ఈ నిర్ణయం తీసుకుంది. ప్రపంచంలోని అత్యంత అరుదైన ఖనిజాలు, లోహాల్లో దాదాపు 90శాతం చైనానే తయారు చేస్తుంది. వీటిలో 17 మూలకాలను రక్షణ, ఎలక్ట్రిక్ వెహికల్, ఇంధన, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల్లో వాడ తారు. దశాబ్దాలుగా చైనాపై ఆధారపడుతూ వచ్చిన కీలకమైన ఖనిజాలు, ఇతర సరఫరాలు నిలిచిపోవడంతో అమెరికన్ తయారీ రంగం అల్లకల్లోలమవుతుంది. న్యూయార్క్ టైమ్స్ ప్రచురించిన కథనం ప్రకారం ఈ తరహా లోహాలు, అయస్కాంతాల ఎగుమతికి చైనా ప్రత్యేక లైసెన్స్ విధానాన్ని రూపొందించనుంది. అయితే, ఆ విధానం పూర్తి స్థాయిలో అమలులోకి రావడానికి మరింత సమయం పట్టనుంది. ఎలక్ట్రిక్ కార్లు, డ్రోన్లు, రోబొట్లు, క్షిపణులు, అంతరిక్ష వాహక నౌకలు, గాసోలిన్‌తో నడిచే కార్లు తయారీలో చైనా నుండి దిగుమతయ్యే లోహాలు అత్యంత కీలకమైనవి. అదే విధంగా జెట్ ఇంజన్లు, లేజర్లు, కార్ హెడ్‌లైట్లు, కొన్ని స్పార్క్ ప్లగ్‌లు, కేపాసిటర్లు తయారీలో కూడా ఈ లోహాలు అవసరమవుతాయి.

గిరిజన విద్యా సంస్థల సొసైటీకి రూ.340 కోట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీకి ఆర్థికశాఖ రూ.340 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ మేరకు ఆర్థికశాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో క్వార్టర్‌కు రూ.85 కోట్ల చొప్పున నాలుగు క్వార్టర్లకు మొత్తం రూ.340 కోట్లుగా పేర్కొన్నారు. విద్యార్థులకు చెల్లించే డైట్ ఛార్జీలకు రూ.112.06 కోట్లు, ఉద్యోగుల జీత భత్యాల కోసం రూ.98.71 కోట్లు, కాంట్రాక్టు ఉద్యోగుల జీతాల కోసం రూ.6 కోట్లు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాల కోసం రూ.54.06 కోట్లుగా, భవనాల అద్దెలు, పన్నులకు రూ.87 లక్షలు, అద్దె వాహనాలకు రూ.13.17 లక్షలు, ఇతర ఖర్చులకు ఈ మొత్తం నిధులు విడుదల చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా నిధులను విభాగాధిపతులు సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు.

మొదటి దశలో భూముల వినియోగంపై శ్వేతపత్రం

- కాంగ్రెస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి మొదటి దశలో సమీకరించిన 34 వేల ఎకరాల్లో ఏ సంస్థలకు ఎంత భూమి కేటాయించారు, ఏ ప్రాతిపదికన భూములు ఇచ్చారు అనే వివరాలతో కూడిన శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. రాజధాని రెండో దశలో భూ సమీకరణలో భాగంగా 44 వేల ఎకరాల్లో తీసుకోనుండటంపై సోమవారం విడుదల చేసిన ప్రకటనలో అసంతృప్తి వ్యక్తం చేశారు. మొదటి దశలో 34 వేల ఎకరాల్లో సీడ్ కేపిటల్‌కు కేటాయించిన భూములు మినహాయిస్తే 20 వేల ఎకరాలు, ప్రభుత్వ భూములు మరో 15 వేల ఎకరాలు ఎవరికిచ్చారని ప్రశ్నించారు.

అద్భుత ప్రపంచం కడతానని అరచేతిలో వైకుంఠం చూపించడం, ఎఐ గ్రాఫిక్స్‌తో మాయ చేయడం, లేనిది ఉన్నట్లుగా నమ్మించడం ఒక్క చంద్రబాబుకే తెలిసిన విద్య అని విమర్శించారు. రాజధాని విస్తరణ పేరుతో విలువైన రైతుల భూములను మళ్ళీ తక్కువకే కాజేసి తన అనునయులకు కట్టబెట్టి, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూసే కుట్ర తప్ప మరోటి కాదన్నారు. సింగపూర్‌ను తలదన్నే ఆకాశ హర్మ్యాలు ఎక్కడ? అని ప్రశ్నించారు. తాజాగా మరో 44 వేల ఎకరాలు గుంజుకోవడం మరో 4 మండలాల రైతులను మోసం చేయడమేనని అన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

స్మృతివనం ప్రైవేటీకరణ అడ్డుకుంటాం

- వైసిపి ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సామాజిక న్యాయం కోసం పోరాడిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గుర్తుగా విజయవాడలో ఏర్పాటుచేసిన భారీ విగ్రహ ప్రాంగణాన్ని ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీన్ని అడ్డుకుంటామని వైసిపి ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయాల కోసం జగన్ పనిచేస్తున్నారని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ జీసస్‌కు, అంబేద్కర్‌కు మాత్రమే పుట్టినరోజు నిర్వహిస్తారని అన్నారు. బలహీనవర్గాల సంక్షేమం కోసం వైసిపి పనిచేస్తోందని అన్నారు. మాజీ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రభుత్వం అంబేద్కర్ విగ్రహంతో వ్యాపారం చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. మాజీ ఎంపి నందిగం సురేష్ మాట్లాడుతూ.. జగన్ పాలనలో ఎక్కడా రాజ్యాంగ ఉల్లంఘనలు జరగలేదని తెలిపారు. కూటమి పాలకులు అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడిచి దళితులు, బలహీనవర్గాల ఊచకోత కోస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ.. పిపిపి పద్ధతిలో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రైవేటుపరం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని తెలిపారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయ సాధన కోసం రాష్ట్రంలో మరలా జగన్ పాలన రావాల్సి ఉందని అన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, కైలే అనిల్‌కుమార్, వైసిపి ఎస్‌సి సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, షేక్ ఆసిఫ్, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'మినీరత్న' హోదా దిశగా షిప్‌యార్డు

- ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ ముందుకు..
- 3 ఫ్లీట్ సపోర్టు షిప్‌ల్లో జులైలో నేవీకి ఒకటి అందజేసేందుకు సిద్ధం
- మరో రూ.3 వేల కోట్ల సబ్‌మెరైన్ ఆర్డరు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో



హిందుస్థాన్ షిప్‌యార్డు (ఫైల్ ఫొటో)

హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్)కు త్వరలో మినీరత్న హోదా దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. అప్పుల్లేకుండా ప్రతి ఏటా రూ.100 కోట్ల మేర లాభాలు వస్తే ప్రభుత్వ రంగ సంస్థలకు మినీరత్న హోదా లభిస్తుంది. దేశంలో ముంబయి జిఆర్ఎస్, కోల్‌కతా, గోవా షిప్‌యార్డులకు ప్రస్తుతం ఆ హోదా ఉంది. స్వదేశీ పరిజ్ఞానంతో ఉందుకు సాగుతున్న హెచ్ఎస్ఎల్‌కు కూడా త్వరలో ఆ హోదా లభించే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. సుదీర్ఘకాలం పాటు నష్టాల్లో ఉన్న హెచ్ఎస్ఎల్ ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ మినీరత్న హోదా దక్కించుకోవడానికి శ్రమిస్తోంది. ఇందుకు ఉద్యోగులు, కార్మికులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. పుష్కలంగా వర్క్ ఆర్డర్లు ఉంటే పూర్వవైభవం సాధ్యపడుతుందని వారు చెబుతున్నారు. గతంలో ఐదు ఫ్లీట్ సపోర్టు షిప్పుల నిర్మాణ పనుల్లో మూడింటిని మాత్రమే షిప్‌యార్డుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. రెండింటిని ప్రయివేటు సంస్థ అయిన ఎల్అండ్‌టికి కట్టబెట్టింది. ఆ రెండు పనులు కూడా హెచ్ఎస్ఎల్‌కు ఇచ్చి ఉంటే మినీ రత్న హోదాను ఏడాది క్రితమే దాటేసేదని కార్మికులు, ఉద్యోగులు చెబుతున్నారు. తనకు వచ్చిన మూడు ఫ్లీట్ సపోర్టు షిప్పుల నిర్మాణ పనుల్లో ఒక షిప్ నిర్మాణ పనులు పూర్తి చేసి వచ్చే జులైలో నేవీకి అందజేసేందుకు హెచ్ఎస్ఎల్ సిద్ధమవుతోంది. షిప్‌యార్డులో అందుకు సంబంధించిన ట్రయల్స్ జరుగుతున్నాయి.

హిందుస్థాన్ షిప్‌యార్డులో ఏం జరుగుతోంది ?

హెచ్ఎస్ఎల్‌లో కార్గో, నేవీ నౌకలు, పోర్టు టగ్‌లు, కోస్ట్ గార్డ్ షిప్పులు, పాంటోన్స్, సబ్ మెరైన్ (జలాంతర్గామి)ల రిపేర్లు, రీఫిట్ పనులు జరుగుతున్నాయి. దేశ రక్షణ రంగానికి దశాబ్దాల తరబడి హెచ్ఎస్ఎల్ విశేష సేవలందిస్తోంది. 2020-21లో రూ.478 కోట్ల నుంచి ఒక్కసారిగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో హెచ్ఎస్ఎల్ టర్నోవర్ రూ.1413 కోట్లకు పెరగడంతో మినీరత్న హోదాపై ఆశలు చిగురిస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.1,586 కోట్లకు చేరింది. పన్నుకు ముందు లాభం (పిబిటి) రూ.295 కోట్లకు పెరిగింది.

దిగ్విజయంగా రిపేరు పనులు

మూడు ఫ్లీట్ సపోర్టు షిప్పుల నిర్మాణంతో పాటు సబ్ మెరైన్ సింధుకీర్తి రిపేర్ వర్క్ కూడా షిప్‌యార్డులో జరుగుతోంది. రూ.1000 కోట్ల వర్క్ ఆర్డర్ ఇది. మరో మూడు నెలల్లో పనులు పూర్తి చేసి ఇండియన్ నేవీకి దీన్ని అందించనున్నారు. మరో రూ.3 వేల కోట్లతో నేవీకి సంబంధించిన సబ్‌మెరైన్ పనులు కూడా నేవీ నుంచి రాబోతున్నాయి. ఈ క్రమంలో మినీరత్న హోదాకు సాధించే దిశగా హెచ్ఎస్ఎల్ సాగుతోంది.

క్వింటాలు మిర్చికి రూ.20 వేలు ఇవ్వాలని కోరుతూ

16నగుంటూరు మిర్చి యార్డు వద్ద ధర్నా

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మిర్చికి క్వింటాలుకు రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న గుంటూరు మిర్చి యార్డు వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు ఎపి రైతు సంఘం తెలిపింది. ఈ ధర్నాలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదంచేయాలని కోరింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మిర్చి పంటకు ధర లేక లక్షలాదిమంది రైతులు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు క్వింటాలుకు రూ.11,871లు కనీస ధరగా ప్రకటించినప్పటికీ ఆచరణలో అది కూడా ఎక్కడా అమలు కావడం లేదని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువ ధరకే మార్కెట్‌లో రైతులు అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం కింద రైతులను ఆదుకుంటామని, కనీస ధరకు కొనుగోలు చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెల రోజుల క్రితం ప్రకటన చేశాయని, కానీ, ఇప్పటి వరకు ఏ ఒక్కరైతు నుంచి ఒక్క క్వింటాలు మిర్చికూడా ప్రభుత్వం ప్రకటించిన ధరకు కొనుగోలు చేయలేదన్నారు. మిర్చి కొనుగోలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు నిర్దిష్టమైన ఆదేశాలు కానీ,గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయకుండా, రైతులను మాయమాటలతో మోసం చేస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస మద్దతు ధరగా క్వింటాలుకు రూ.11,871లు ప్రకటించినప్పటికీ గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చి క్వింటాలు రూ.8,9 వేలు కూడా ధర ఇస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఎపిరైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డిలు తెలిపారు. గుంటూరు మిర్చియార్డులో రైతులను మోసం చేస్తున్న మిర్చి వ్యాపారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్‌యార్డులో అమ్మిన రైతులకే కాకుండా బయట ప్రైవేట్ వ్యాపారులకు మిర్చి అమ్మిన రైతులకు కూడా మార్కెట్ ఇంటర్‌వెన్షన్ పథకం కింద ధరలో ఉన్న తేడా ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నామన్నారు.

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: ఎపిరైతు సంఘం

అకాలవర్షాలు, వడగండ్ల వానతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపిరైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈనెల 13న కురిసిన వర్షాలకు ఎన్‌టిఆర్, కృష్ణ, గుంటూరు , ప్రకాశం జిల్లాలో పంటలు దెబ్బతిన్నాయన్నారు. ముఖ్యంగా బర్లీ పొగాకు, వరి పంటలు కళ్ళాల్లోనే తడిచి ముద్దయ్యాయన్నారు. వడగండ్ల వానతో మామిడి,పంట నేలరాలిందనిచ మొక్క జొన్న పంట కూడా దెబ్బతిందన్నారు, ప్రకృతి వైపరీత్యం వల్ల నష్టపోయిన రైతులకు పంటల బీమా అమలు చేసి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఎపిరైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డిలు విజ్ఞప్తి చేశారు.

పెరగనున్న విద్యుత్ డిమాండ్

- అందుకునేందుకు సిద్ధంగా విద్యుత్ సంస్థలు
- సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. డిమాండ్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు విద్యుత్ సంస్థలు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉన్నాయని చెప్పారు. రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు విజయవాడలోని విద్యుత్ సౌధలో సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ సార్వభౌమ రాజ్యాంగ తత్వవేత్త అని అన్నారు. సమాజ పునర్నిర్మానం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయంగా ఉంటాయని పేర్కొన్నారు. విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయడంలో అంబేద్కర్ ఆలోచలను అమలు చేస్తామని చెప్పారు. ఈ ఏడాది మార్చి 28న రాష్ట్రంలో అత్యధికంగా 256.8 మిలియన్ యూనిట్లు (ఎంయు) వినియోగం నమోదైందని తెలిపారు. జనవరి నుంచి మార్చి వరకు వినియోగం 20,498 ఎంయుకు చేరిందన్నారు. గతేడాది ఇదే సమయానికి 20,475 ఎంయు వినియోగంచామన్నారు. రాబోయే నెలల్లో రోజువారీ వినియోగం 260 ఎంయులకు చేరే అవకాశం ఉందని, కావున విద్యుత్ సంస్థలు మరింత సంసిద్ధంగా ఉండాలని తెలిపారు. వివిధ రకాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో జెఎమ్‌డి కీర్తి చేకూరి, జెన్‌కో ఇన్‌ఛార్జి డైరెక్టర్ ఎం సుజయ్‌కుమార్, ఎపిఎస్ఇబి ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్పిద్దాం

- పిఆర్‌సి కమిటీ ఏర్పాటు చేయాలి
- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



సదస్సులో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు

ఎక్కువమంది పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ఉపాధ్యాయులందరూ కృషి చేసి ప్రభుత్వ బడిని కాపాడుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. తిరుపతి నగరంలో ఆధునీకరించిన యుటిఎఫ్ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం కచ్చపి కళా క్షేత్రంలో 'విద్యారంగ సంస్కరణలు - ఆర్థిక అంశాలు' పై ఐదు జిల్లాల (తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు, ప్రకాశం) ఉపాధ్యాయ చైతన్య సదస్సు యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం ప్రశ్నించేతత్వం లేకుండా చేస్తోందన్నారు. పాలక వర్గాల ప్రయోజనాల కోసమే విద్యా రంగంలో సంస్కరణలు తీసుకొచ్చారని విమర్శించారు. పాఠాలు బోధించనీయకుండా ఉపాధ్యాయులతో ఇతర పనులు చేయిస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో రూపొందించిన రాజ్యాంగ స్ఫూర్తితో రాజ్యాంగ లక్ష్యాల సాధన కోసం ఉపాధ్యాయ, ఉద్యోగులు సంఘటితంగా ముందుకు వెళ్లాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు (ఐవి) మాట్లాడుతూ ఐదు దశాబ్దాలకుపైగా పోరాడి సాధించుకున్న సౌకర్యాలను ఒక్కొక్కటిగా వదులుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని, చట్టసభలలో రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన ప్రతినిధులు రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇచ్చే పరిస్థితి ఏర్పడిందని, దీన్ని మార్చడం చదువుతోనే సాధ్యమవుతుందని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. 12 వ పిఆర్‌సి ఏర్పాటు చేసి వెంటనే రిపోర్టు తెప్పించుకుని అమలు చేయాలని కోరారు. .పెరిగిన ధరలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కరువు బత్యాన్ని విడుదల చేయాలని, పేరుకుపోయిన వేలకోట్ల రూపాయల బకాయిలు విడుదల చేయాలని కోరారు. విద్యారంగంలో వస్తున్న పరిణామాలను జాగ్రత్తగా పరిశీలించి విద్యా రంగానికి కీడు కలిగించే విధానాలను ఉపాధ్యాయులు చైతన్యంగా ఎదుర్కోవాలి అన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీ రాజా, ఎస్ ఎస్ నాయుడు, నవకోటేశ్వరరావు, జివి రమణ, జ్యోతి బసు, చక్రవర్తి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె ముత్యాల రెడ్డి జి జె రాజశేఖర్, ఎం సోమశేఖర్ నాయుడు, ఎన్ మణిగండన్, వి వి శేషులు, చలపతి శర్మ, అబ్దుల్ హై, హరి ప్రసాద్, జాబీర్, దండు రామచంద్రయ్య, నిర్మల, గీతమ్మ, కుమారస్వామి, మోహన్ బాబు, బండి మధుసూదన్ రెడ్డి, సిఐటి జిల్లా ప్రధాన కార్యదర్శి కందరపు మురళి, సిపిఎం జిల్లా కార్యదర్శి వి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



యాత్రికులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న అన్నాకొణిదెల

తిరుమలేశుని సేవలో 'అన్నా కొణిదల'

- నిత్యాన్నదానికి రూ.17 లక్షలు విరాళం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారిని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సతీమణి అన్నా కొణిదల దర్శించుకున్నారు. సోమవారం వేకువజామున వైకుంఠ క్యూ కాంప్లెక్స్ ద్వారా శ్రీవారి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో అన్నా కొణిదలకు వేద పండితులు వేదాశీర్వచనం అందించి, శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీవారి దర్శనానంతరం తరిగొండ వెంగమాంబ నిత్యాన్నదాన సత్రాన్ని ఆమె సందర్శించారు. తన కుమారుడు కొణిదల మార్క్ శంకర్ పేరిట రూ. 17 లక్షల విరాళాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులకు అందించారు. అనంతరం నిత్యాన్నదాన సత్రంలో శ్రీవారి యాత్రికులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. అనంతరం వారితో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.

ఉన్నత విద్యామండలిలో ఫైల్ స్టేటస్ సిస్టం

వెబ్‌సైట్ ఆవిష్కరించిన మాజీ ఐఎఎస్ చక్రపాణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉన్నత విద్యామండలిలో ఫైల్ సమాచారం ఏ స్థితిలో ఉందో తెలుసుకునేందుకు ఫైల్ ఇన్‌ఫర్మేషన్ స్టేటస్ సిస్టం వ్యవస్థను తీసుకొచ్చింది. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎపి ఉన్నత విద్యామండలి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె మధుమూర్తితో కలిసి మాజీ ఐఎఎస్ డి చక్రపాణి ఉన్నత విద్యామండలి కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిపాలనా పారదర్శకత, సమర్థత, సులభతరమైన డిజిటల్ పరిపాలనను అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ విధానం తీసుకొచ్చినట్లు చెప్పారు. 'ఖర్చు లేకుండా-ప్రయాణం లేకుండా, ఎపిఎస్‌హెచ్ఇ తక్షణ ప్రాప్యత' అనే నినాదంతో ఈ విధానాన్ని అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. ఈ డిజిటల్ వేదిక ద్వారా స్టేక్‌హోల్డర్లు తమ ఫైళ్ల స్థితిని, అభ్యర్థనలు, అప్లికేషన్లను ఉన్నత విద్యామండలిలో ఏ వ్యవస్థలో ఉన్నాయో తెలుసుకోవచ్చునని తెలిపారు. ఈ విధానం వల్ల కార్యాలయానికి వ్యక్తిగతంగా వెళ్లాల్సిన అవసరం లేకుండా సమయం, డబ్బు రెండూ ఆదా అవుతాయని వివరించారు. సమయం, ఖర్చు తగ్గింపు ఉంటుందని తెలిపారు. ఈ విధానం భద్రత విశ్వసనీయత ఉంటుందన్నారు. అధికారుల ప్రధాన పనుల్లో విఘాతం లేకుండా పరిపాలనలో వేగం పెరుగుతుందన్నారు. ఉన్నత విద్యామండలి, విద్యాసంస్థలు, విద్యార్థులు మధ్య పరస్పర వ్యవహారాలు మరింత పారదర్శకంగా, వేగంగా, చక్కగా జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ కె రామ్మోహన్‌రావు, కార్యదర్శి టివి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు. ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్ https://apsche.ap.gov.in/ ఒపెన్ చేయగానే 'ఫైల్ ఇన్మఫర్మేషన్ స్టేటస్ సిస్టం' బటన్ ఎంపిక చేయాలి. అనంతరం ఈమెయిల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకొని ఫైల్ ట్రాకింగ్ చెక్ చేసుకోవచ్చు.

అంతకుముందు జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఛైర్మన్ మధుమూర్తి మాట్లాడుతూ సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి విలువలకు అంబేద్కర్ తన జీవితాన్ని అంకితం చేశారని చెప్పారు. ఈ విలువలు సమాజంలో సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధికి బలంగా నిలుస్తాయని తెలిపారు. క్వాంటమ్ దినోత్సవం సందర్భంలో ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఛైర్మన్ ప్రారంభించి మాట్లాడుతూ క్వాంటమ్ విజ్ఞానం సమాజంలో విప్లవాత్మక మార్పులు తేవగల శక్తి ఉన్న కొత్తశాస్త్ర విభాగమని చెప్పారు.



దీక్షా శిబిరంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

అంబేద్కర్ స్ఫూర్తితో 'ఉక్కు' పరిరక్షణ పోరాటం : సిఐటియు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ స్ఫూర్తితో వైజాగ్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాటం సాగిస్తామని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1477వ రోజుకు చేరాయి. దీక్షలో పాల్గొన్న సిఐటియు జగదాంబ జోన్ కమిటీ నాయకులు, కార్యకర్తలు శిబిరంలోనే అంబేద్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు రాజు మాట్లాడుతూ.. అంబేద్కర్ ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి రచించిన భారత రాజ్యాంగాన్ని కాషాయీకరించే ప్రయత్నం మోడీ ప్రభుత్వం చేస్తోందన్నారు. రాజ్యాంగ మూల సూత్రాలైనటువంటి సమానత్వం, సౌభ్రాతృత్వం, లౌకికవాదాలను పూర్తిగా నీరుగారుస్తోందని తెలిపారు. రిజర్వేషన్లు అమలు జరిగే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తోందని అన్నారు. కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను పోరాటాలతో ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో ముఠా కార్మిక సంఘం నాయకులు ఎం.సుబ్బారావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.నర్సింగరావు, ఆంధ్రప్రదేశ్ మత్స్యకార, మత్స్యకార్మిక సంఘం నాయకులు కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దేశ గతిని మార్చిన అంబేద్కర్

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశ గతిని మార్చిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత పేర్కొన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో.. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి పూలమాలలు వేసి సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, హక్కుల సాధనకు కృషి చేసిన చిరస్మరణీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్, పులువురు డైరెక్టర్లు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు టిడిపి కార్యాలయంలో సోమవారం జరిగాయి. ముందుగా ఆయన చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ.. సమసమాజమే లక్ష్యంగా, సమానత్వం, అందరికీ స్వేచ్ఛ అందించాలని ప్రపంచం మెచ్చుకునే లిఖిత రాజ్యాంగాన్ని అంబేద్కర్ అందించారని చెప్పారు. పొలిట్‌బ్యూరో సభ్యులు టిడి జనార్ధన్ మాట్లాడుతూ.. ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి అంబేద్కర్ అని, ఆయన మార్గం మానవాళికి అనుసరణీయమని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు ఎంఎ షరీఫ్ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని తూట్లు పొడిచి మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు కొంతమంది కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు, మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, వందనా, పాతర్ల రమేష్, నాయకులు దేవతోటి నాగరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎవి రమణ, బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్, క్రిస్టియన్ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రేమ్ కుమార్, వల్లూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పశుఆరోగ్య సేవల యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంచార పశుఆరోగ్య సేవ, వాహన సేవల కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ (1962 సేవల కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడలో సోమవారం జరిగిన యూనియన్ మహాసభలో నూతన కార్యవర్గాన్ని (రాష్ట కమిటీ) ఎన్నిక జరిగింది. యూనియన్ గౌరవాధ్యక్షులుగా ఎవి నాగేశ్వరరావు, అధ్యక్షులుగా బి నరేష్ నాయక్ (కృష్ణా), ప్రధాన కార్యదర్శిగా ఎంఎన్‌వి శ్రీధర్ (ఎన్‌టిఆర్), కోశాధికారిగా జె వెంకటేశ్వర్లు (తిరుపతి), ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎం సురేష్ (విజయనగరం), ఉపాధ్యక్షులుగా జి రోహిత్ కుమార్ (శ్రీకాకుళం), మల్లిక (కాకినాడ), డివి సతీష్ (పశ్చిమ గోదావరి), షేక్ షరీఫ్ (పల్నాడు), కార్యదర్శులుగా ఎ హెమసుందర్ (తూర్పుగోదావరి, పెదపాటి సురేష్ (అంబేద్కర్ కోనసీమ), కె రవి (ఏలూరు), సి సంతోష్ కుమార్ రెడ్డి (కడప) ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఐ లక్ష్మీనారాయణ, ఆర్ నరేష్, టి దుర్గాప్రసాద్, కె రాజేష్, పి నాగేంద్రబాబు, బి రవికిరణ్, కె రమేష్, ఆర్ గోపాలరావు, సిహెచ్ చిట్టిబాబు, బి గోవిందనాయక్, ఎం సతీష్ కుమార్, టి జోహరి, మోహన్‌ను ఎన్నుకున్నారు.

రేషన్ డీలర్‌షిప్‌ల ఏకపక్ష రద్దు చెల్లదు

- హైకోర్టు కీలక తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

రేషన్ షాపుల డీలర్‌షిప్‌లను ఏకపక్షంగా రద్దు చేయడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. డీలర్‌షిప్‌ల రద్దు వల్ల డీలర్లు ప్రతికూల ప్రభావాలను ఎదుర్కొంటారని హెచ్చరించింది. ఆరోపణలు వస్తే తగిన విచారణ చేశాకే రద్దు విషయంలో నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ప్రభుత్వ ఉద్యోగిపై ఆరోపణలు వస్తే ఏ విధమైన విచారణ చేస్తారో, డీలర్‌షిప్‌లపై ఆరోపణల విషయంలో కూడా విచారణ జరగాలంది. డీలర్ల వాదనలు వినాలని, డీలర్‌తో పాటు ఒకవేళ సాక్షులు ఉంటే వారి వాంగ్మూలాలను కూడా నమోదు చేయాలని చెప్పింది. కార్డుదారులు లేదా ఇతరులు ఫిర్యాదు చేస్తే డీలర్ సమక్షంలో విచారణ చేయాలంది. ఆ వ్యక్తులకు క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశం కూడా ఇవ్వాలంది. చర్యలు తీసుకునేముందు కారణాలు పేర్కొనాలంది. విచారణ జరపకుండా తహశీల్దార్ ఇచ్చిన నివేదిక ఆధారంగా డీలర్షిప్ రద్దు చేస్తూ ఆర్‌డిఒ ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఆక్షేపించింది. తహశీల్దార్ తయారు చేసిన నివేదికను డీలరుకు అందజేయలేదని తప్పుపట్టింది. ఆర్‌డిఒ ఉత్తర్వులు సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా పేర్కొంటూ వాటిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. చిత్తూరు జిల్లా, మదనపల్లిలో ఎం అరుణకు చెందిన చౌక ధర దుకాణం డీలర్షిప్‌ను మదనపల్లి ఆర్‌డిఒ 2009 ఫిబ్రవరి 18న రద్దు చేశారు. దీనిని జాయింట్ కలెక్టర్ 2009 ఫిబ్రవరి 20న, జిల్లా కలెక్టర్ 2013 ఫిబ్రవరి 10న సమర్ధిస్తూ ఉత్తర్వులిచ్చారు. అదే ఏడాది అరుణ వాటిని హైకోర్టులో సవాల్ చేస్తే సింగిల్ జడ్జి డిస్మిస్ చేస్తూ.. 2024 జులై 16న తీర్పు చెప్పారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆమె దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను అనుమనితిస్తూ ద్విసభ్య ధర్మాసనం పైవిధంగా తీర్పు వెలువరించింది.

కోకో రైతుల చలో గుంటూరు వాయిదా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కోకో రైతులకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఈ నెల 15న నిర్వహించ తలపెట్టిన చలో గుంటూరు కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర కమిటీ ప్రకటించింది. సోమవారం ఏలూరు అన్నే భవనంలో సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. కోకో రైతులకు న్యాయం చేస్తామని ఈ నెల 12న ఆగిరిపల్లికి సిఎం వచ్చిన సందర్భంగా హామీ ఇచ్చిన నేపథ్యంలో 'చలో గుంటూరు'ను వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బోళ్ల వెంకట సుబ్బారావు, పానుగంటి అచ్యుతరామయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి గుదిబండి వీరారెడ్డి, ఉప్పల కాశీ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో ఘోర రోడ్డు ప్రమాదం

- ముగ్గురు మృతి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట (వైఎస్ఆర్ జిల్లా)

వైఎస్ఆర్ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం పరిధిలోని నడింపల్లి వద్ద కడప -చెన్నై ప్రధాన రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నంద్యాల జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ధర్మారెడ్డి (30), వినోద్ (35) మరో వ్యక్తి కలిసి స్కార్పియోలో తిరుపతి నుంచి నంద్యాలకు పయనమయ్యారు. ఒంటిమిట్ట మండలం నడింపల్లి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి ఎలక్ట్రికల్ బస్సును వేగంగా ఢీకొన్నారు. ఈ సంఘటనలో స్కార్పియో వాహనంలోని ముగ్గురూ అక్కడికక్కడే మృతిచెందారు. అదే సమయంలో ఎలక్ట్రిక్ బస్సు వెనుక వస్తున్న పోలీస్ పెట్రోలింగ్ వాహనం బస్సును తప్పించబోయి రోడ్డు పక్కనున్న ఓ చెట్టును ఢీకొట్టింది. వాహన డ్రైవర్‌తో పాటు కానిస్టేబుల్ రఘునాథరెడ్డికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని కడప రిమ్స్‌కు తరలించారు. ఒంటిమిట్ట సిఐ బాబు, ఎస్ఐ శివప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై విచారణ జరిపారు. స్కార్పియో వాహనం అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

క్షతగాత్రులను పట్టించుకోరా..?

- ప్రభుత్వ తీరుపై సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం ఆగ్రహం
- కెజిహెచ్‌లో బాధితుల పరామర్శ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, కోటవురట్ల విలేకరులు

అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన పేలుడులో గాయపడి విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిని ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం అన్నారు. కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిని ఆయనతో పాటు పార్టీ అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు సోమవారం పరామర్శించారు. క్షతగాత్రులకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లోకనాథం మాట్లాడుతూ.. క్షతగాత్రులు ఆస్పత్రిలో చేరిన తర్వాత వారిని పట్టించుకొనే నాథుడే కరువయ్యాడని, మంచినీరు, ఆహారం, ఇతర అవసరాలను ప్రభుత్వాధికారులు తీర్చకపోవడం శోచనీయమన్నారు. కట్టుకోవడానికి బట్టలు కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని క్షతగాత్రులు సిపిఎం బృందం వద్ద వాపోగా వారికి వెంటనే నాయకులు వస్త్రాలను అందజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు వారు పూర్తిగా కోలుకొనే వరకూ ప్రభుత్వమే అన్ని అవసరాలనూ చూసుకోవాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లాలో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వాటిని అరికట్టడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమౌతున్నారని విమర్శించారు. బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి భద్రతా లోపాలు ఉన్నచోట వెంటనే చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. మృతుల కుటుంబాలకు రెండు ఎకరాల భూమితో పాటు ఇల్లు లేని వారికి ఇల్లు మంజూరు చేసి వారి పిల్లలకు మెరుగైన విద్యను అందించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సొంత నియోజకవర్గంలో జరిగిన ప్రమాదంలో బాధిత కుటుంబాలకు హోం శాఖ మంత్రి అనిత భరోసా ఇవ్వలేకపోయారన్నారు. ఈ తరహా ప్రమాదాలు జరగకుండా జిల్లా వ్యాప్తంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు.



కెజిహెచ్‌లో క్షతగాత్రులకు దుస్తులు అందజేస్తున్న లోకనాథం, తదితరులు

బాణసంచా తయారీ కేంద్రంపై కేసు నమోదు

ఘటనకు సంబంధించి ఇద్దరు బాణసంచా తయారీ కేంద్ర నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్టు అనకాపల్లి జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా తెలిపారు. మందుగుండు సామగ్రిని ఇరపరాడ్డుల సాయంతో గ్రైండింగ్ చేస్తున్న సమయంలో స్పార్క్ రావడంతో ప్రమాదం సంభవించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని వెల్లడించారు. మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేసి సోమవారం వారి బంధువులకు అప్పగించారు. గాయపడిన ఎనిమిది మందిలో బాణాసంచా తయారీ కేంద్ర మేనేజర్ మడగల జానకిరామ్, జల్లూరి నాగరాజుల పరిస్థితి సోమవారానికీ విషమంగానే ఉంది. ప్రస్తుతం వారు విశాఖ మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

గాయపడిన క్షతగాత్రులకు రూ.లక్ష పరిహారం : అనిత

గాయపడిన వారికి ఎక్స్‌గ్రేషియో కింద రూ.లక్ష ఇవ్వనున్నట్టు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తన వంతుగా రూ. 50 వేలు ఇప్పటికే ప్రకటించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బాణసంచా తయారీ కేంద్రాలపై అధ్యయనం చేస్తున్నామని మీడియా సమావేశంలో ఆమె చెప్పారు.

ఖజానాకు మే గండం

- పథకాలకు భారీగా నిధుల అవసరం
- పలు రకాల ఖర్చులపై ఆంక్షలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఖజానాకు మే నెల గుదిబండగా మారనుంది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను కూడా ఈ నెలలోనే అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నిధుల సమీకరణ అంశం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో సుమారుగా 80 లక్షల మందికిపైగా విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. ఇందులో తల్లికి వందనం ద్వారా 70 లక్షల మందికి వరకు 15వేలు చొప్పున సాయం అందించాల్సి ఉంటుంది. అంటే ఈ పథకం కోసం రు. 10,500 కోట్ల వరకు నగదు కావాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక అన్నదాతా సుఖీభవ పథకం కింద ఒక్కో రైతుకు 20వేల చొప్పున మూడు విడతలుగా ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో విడతకు రెండు వేలు చొప్పున కేంద్రం ఆరు వేల కోట్లు, రాష్ట్రం 14 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అంటే తొలి విడతలో రాష్ట్రం నేరుగా 2,500 కోట్లు బఖర్చు చేయాల్సివుంటుంది. కేంద్ర జాబితాలో లేని రైతులకు పూర్తిస్థాయి మొత్తాన్ని రాష్ట్రమే భరించాల్సిఉంటుంది. దీంతో ఈ రెండు పథకాలకు కలిపి 13,180 కోట్ల వరకు నిధులు కావాల్సి ఉంటుందని అంచనా! ఇవి గాక ప్రతినెల ఇప్పటికే అమలు చేస్తున్న పథకాలు, అవుతున్న ఖర్చులకు కూడా నిధులు సర్దుబాటు చేయాల్సిఉండటంతో అధికారయంత్రాంగం పలు మార్గాలను వెతుకుతోంది. దీనిలో భాగంగా ఇప్పటికే అత్యవసరం మినహా, ఇతర సాధారణ ఖర్చులపై ఆంక్షలు విధించింది,. సాధ్యమైనంత వరకు భారీ వ్యయాలను తగ్గించి, నిధులను నిలువ చేయాలని భావిస్తున్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

- ముస్లిము జెఎసి డిమాండ్

ప్రజాశక్తి - యంత్రాంగం

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో బిల్లు అమలు చేయబోయని టిడిపి కూటమి ప్రభుత్వం తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తూ నంద్యాల, నెల్లూరు, పల్నాడు జిల్లాల్లో నిరసనలు తెలిపారు. నల్లబ్యాడ్జీలు, నల్ల చొక్కాలు ధరించి భారీ ర్యాలీ నిర్వహించారు. నంద్యాల జిల్లా కేంద్రంలో గాంధీ చౌక్ నుంచి తహాశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. అనేక లొసుగులతో ఉన్న వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్రం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ముస్లిము జెఎసి గౌరవాధ్యక్షులు మహమ్మద్ అబుల్, అబ్దుల్ సయ్యద్ మాట్లాడుతూ.. ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం రద్దు చేసేంత వరకూ పోరాటాలు కొనసాగిస్తామన్నారు. వక్ఫ్ బోర్డులో 11 మందిలో ఏడుగురు ముస్లిమేతరులను చొప్పించినప్పుడు ఇక ముస్లిముల మాటకు విలువ ఏముంటుందని ప్రశ్నించారు. వక్ఫ్ ట్రిబ్యునల్‌ను నిర్వీర్యం చేసి, ప్రభుత్వ మాట వినే కలెక్టర్‌కు, ఏ ఆస్తి ఎవరిదని నిర్ణయాధికారం ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. భారత రాజ్యాంగం ఇచ్చిన మౌలిక హక్కులకు విరుద్ధంగా ఉన్న ఈ వక్ఫ్ సవరణ చట్టాన్ని బేషరతుగా ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం, సిపిఐ, ఎస్‌డిపిఐ నాయకులు మద్దతు తెలిపి ర్యాలీలో పాల్గొన్నారు. నంద్యాల తహశీల్దార్ ప్రియదర్శినికి వినతిపత్రం అందజేశారు. నంద్యాల ముస్లిము జెఎసి కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అంతకుముందు ముస్లిము జెఎసి నాయకులు అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నెల్లూరులో నిరసన ప్రదర్శన చేపట్టారు. నగరంలోని జెండా వీధిలోని హామీల మసీదు సెంటర్ నుంచి చిన్న బజారు, బార్కాస్ సెంటర్ మీదుగా గాంధీ బొమ్మ వరకు నల్ల బ్యాడ్జీలు, నల్ల చొక్కాలు ధరించి ముస్లిములు భారీ ర్యాలీ నిర్వహించారు. వక్ఫ్‌బోర్డ్ సభ్యులుగా ముస్లిములే ఉండాలంటూ నినదించారు. ముస్లిం మైనారిటీలను మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందని పలువురు ముస్లిములు విమర్శించారు. కేంద్ర ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టానికి సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించిన మద్దతును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బిల్లు ఆగిపోయేలా కేంద్రంతో సంప్రదింపులు జరపాలని ముస్లిము మైనార్టీ నాయకులు కోరారు. పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలో ముస్లిములు ర్యాలీ నిర్వహించారు. స్థానిక శివయ్య స్తూపం వద్ద మనోహరంగా ఏర్పడి నిరసన తెలిపారు.



నంద్యాలలో గాంధీ చౌక్ నుంచి తహాశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ



వైభవంగా శ్రీకోదండరాముడి చక్రస్నానం

- ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన సోమవారం ఆలయ సమీపంలోని పుష్కరిణిలో చక్రస్నానం జరిగింది. విశేష సంఖ్యలో యాత్రికులు పాల్గొని స్నానాలు చేశారు. ఆలయంలో ఉదయం నాలుగు గంటలకు సుప్రభాతం, ఆలయ శుద్ధి, ఆరాధన నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు రాముడు, సీత, లక్ష్మణ ఉత్సవ విగ్రహాలను తిరుచ్చిలో సుదర్శన చక్రత్తాళ్వార్ పల్లకిలో ఊరేగించి పుష్కరిణికి తీసుకొచ్చారు. ఉదయం 9.30 గంటలకు స్నపనతిరుమంజనం నిర్వహించారు. సీతారామ లక్ష్మణ సరసన చక్రత్తాళ్వార్లు పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంతో అభిషేకాలు చేశారు. అనంతరం చక్రస్నానం నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు ధ్వజావరోహణంతో శ్రీకోదండరామస్వామివారి బ్రహోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో 10వ రోజు మంగళవారం సాయంత్రం ఆరు నుండి రాత్రి 9.00 గంటల వరకు పుష్పయాగం నిర్వహించనున్నారు.

సంపాదకీయం


'ఉపాధి'కి ఉరి

గ్రామాల్లో పేదలకు ఏడాదిలో కనీసం వంద రోజులు పని కల్పించే ఉద్దేశంతో యుపిఎ-1 హయాంలో తీసుకొచ్చింది. మహాత్మా గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ చట్టం (ఎం.ఎన్.ఆర్.ఇ.జి.ఎ-నరెగా). అటువంటి బృహత్తర చట్టం అమలులో లెక్కకు మించిన లోపాలను ఎత్తిచూపింది పార్లమెంటరీ స్థాయి సంఘం. చట్టం హామీ ఇచ్చిన ప్రయోజనాలు కార్మికులకు దక్కడం లేదని గుర్తించింది. నరెగాపై సమగ్ర సమీక్ష కోసం జాతీయ స్థాయిలో స్వతంత్రతతో కూడిన పారదర్శక సర్వే నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కార్మికుల సంతృప్తి, వేతనాల్లో జాప్యం, భాగస్వామ్యం పోకడలు, ఆర్థిక అవకతవకల దృష్టి కోణంలో సర్వే చేయాలని సూచించింది. చట్టం అమల్లో ఎదురవుతున్న సవాళ్లనూ పరిశీలించాలంది. కార్మికుల పనిదినాలు వంద నుంచి 150 రోజులకు, దినసరి వేతనం 400 రూపాయలకు పెంచాలని తెలిపింది. కాంగ్రెస్ ఎంపి సప్తగిరి శంకర్ ఉల్కా నేతృత్వంలో గ్రామీణాభివృద్ధిపై పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ మోడీ పదేళ్ల జమానాలో ఉపాధి హామీపై మచ్చుకు పరిశీలించి ఇచ్చిన రిపోర్టు ఇది. నరెగాను మోడీ ప్రభుత్వం ఒక క్రమ పద్ధతిలో నిర్వీర్యం చేస్తోందని నివేదికతో స్పష్టమైంది. ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచే బిజెపి కుయుక్తులపై ఇంతకాలం వెల్లడవుతున్న ఆందోళనలను ఆ రిపోర్టు నిర్ధారించింది.

ఆది నుంచీ నరెగాపై మోడీ ప్రభుత్వానిది మొసలి కన్నీరేనని దాని చేష్టలే తెలుపుతాయి. బడ్జెట్ కేటాయింపుల నుంచి అమలు వరకు ప్రతిదీ చట్టాన్ని దెబ్బతీసేదిగానే ఉన్నాయి. బడ్జెట్ ప్రతిపాదనలనే తీసుకుంటే దశాబ్ద కాలంలో ఏనాడూ డిమాండ్‌కనుగుణంగా లేవు. ఏవో కొన్ని నిధులను చూపించడం, వాటితోనే కాలక్షేపం చేయడం, చివరాఖరులో ఎంతో కొంత విదిలించడం పరిపాటిగా మారింది. కరోనా సమయంలో మాత్రమే ఖర్చు రూ.లక్ష కోట్లు దాటింది. పట్టణాలకు వలసలు వెళ్లిన లక్షలాది కార్మికులు తమ ఊళ్లకు వెనక్కి వచ్చిన సందర్భంలోని ఆ ఖర్చు సైతం నాటి డిమాండ్‌తో పోల్చితే చాలా చాలా తక్కువ. అదేంటంటే, బడ్జెట్‌లో నిధులు చూపించాల్సిన అవసరం లేదని, డిమాండ్ పెరిగితే ఆటోమేటిగ్గా నిధులు పెంచుతామన్న మోడీ సర్కారు మాట ఒట్టి బూటకం. సకాలంలో నిధులివ్వని కారణంగా పనులు నిలిచిపోయిన ఉదంతాలెన్నో. రాష్ట్రాలకు నిధుల విడుదలలో కేంద్రం తీవ్ర జాప్యం చేస్తోందని పార్లమెంట్ సాక్షిగా నిరూపణ అయింది. 2025 మార్చి చివరినాటికి కేంద్రం రాష్ట్రాలకు అక్షరాలా 26 వేల కోట్ల రూపాయలు బకాయి పడింది. వాటిలో కూలీల వేతనాలు రూ.15 వేల కోట్లు. 2024-25లో ఉపాధి హామీకి ప్రతిపాదించింది రూ.86 వేల కోట్లు కాగా అంత పెద్ద మొత్తంలో నెలల పర్యంతం నిధులివ్వకుండా జాప్యం చేసి పేదలను ఉద్ధరిస్తామనడం వంచన కాదా?

ఉపాధి హామీ ప్రధాన లక్ష్యం గ్రామీణ పేదలకు ఉపాధి కల్పన. ఆ లక్ష్యాన్ని మోడీ సర్కారు క్రమంగా పక్కదారి పట్టించే ఎన్నో చర్యలు చేపట్టింది. బిజెపి, ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాలు వాటిని పుణికిపుచ్చుకుంటున్నాయి. వ్యవసాయానికి అనుసంధానం పాట పాడుతున్నాయి. ఖర్చు లేని ప్రకృతి వ్యవసాయానికి, సేంద్రీయ వ్యవసాయానికి లింక్ పెడుతున్నాయి. నరెగా పనుల్లో భారీ యంత్రాల వినియోగం చట్ట విరుద్ధం. అపరిమితమైన మెటీరియల్ కాంపొనెంట్ సైతం చట్ట విరుద్ధం. అవన్నీ యధేచ్ఛగా సాగిపోతున్నాయి. పని లేని రోజుల్లో పని కల్పన కోసం గ్రామాల్లో జాబ్ కార్డుల జారీ సక్రమంగా లేదు. జాబ్ కార్డు పొందిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్న నిబంధన అమలు కావట్లేదు. వేతనాల జాప్యానికి పరిహారం విషయంలోనూ తప్పించుకొనే ఉదంతాలే ఎక్కువ. ఇటీవలి కాలంలో లక్షలాది జాబ్‌కార్డులు రద్దు చేస్తున్నారు. ఆర్థిక అవకతవకలు సరేసరి. ఈ చర్యలన్నీ ఉపాధి హామీ లక్ష్యాన్ని పలచన చేసేవి. ఉపాధి లేని కార్మికులకు అన్యాయం చేసేవి. కార్మికుల్లో వందకు వంద రోజులూ పని దొరికే వారిని, దినసరి వేతనం రూ.300 దొరికే వారిని వేళ్లపై లెక్కించొచ్చు. పట్టణాల్లో, గ్రామాల్లో భారీ యంత్రాల విచ్చలవిడి వినియోగం, ఆర్థిక మాంద్యం, వ్యవసాయ సంక్షోభం వలన పనుల కోసం డిమాండ్ పెరుగుతోంది. కరువొస్తే తీవ్రత ఇంకా ఎక్కువ. అందుకే ఏడాదిలో 200 రోజుల పని, దినసరి కూలి 600 కావాలన్న డిమాండ్ బలంగా ముందుకొస్తోంది. అర్బన్‌లోనూ ఉపాధి హామీ కావాలన్న ఆకాంక్ష వెల్లడవుతోంది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదికతోనైనా మోడీ ప్రభుత్వానికి కనువిప్పు కావాలి. గతంలో వేసిన అమర్‌జిత్ సిన్హా కమిటీ నివేదికకు మల్లే చెత్తబుట్ట దాఖలు చేస్తే ప్రజలు క్షమించరు.

మహనీయుల మాట



ఏ అభిప్రాయాన్ని అయినా తిరస్కరించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. కానీ దాని వ్యక్తీకరణను నిరోధించే హక్కు ఎవరికీ లేదు.

- పెరియార్ ఇ.వి. రామస్వామి,
నాస్తికవాది, సంఘసంస్కర్త.

ట్రంప్ సుంకాల దూకుడు



ట్రంప్ చేపట్టిన చర్యలతో మన కళ్ళు తెరుచుకోవాలి. అసమానతలను తగ్గించడం, సంక్షేమానికి పెద్ద పీట వేయడం, దేశీయ మార్కెట్‌ను విస్తరింపజేయడం, ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలవడం ఇండియా వంటి మూడవ ప్రపంచ దేశాలకు ముందున్న ప్రత్యామ్నాయం. అప్పుడే ట్రంప్ దూకుడు నుండి తట్టుకోవడం సాధ్యం.



ప్రభాత్ పట్నాయక్

మనం తీసుకునే మేథోపరమైన వైఖరి సరైనది అయితే సరిపోదు. అటువంటి వైఖరి తీసుకోవడానికి సరైన కారణాలు కూడా చూపాలి. ఇప్పుడు ట్రంప్ చాలా దూకుడుగా ఎడా పెడా సుంకాలు విధించడాన్ని దాదాపు ప్రపంచం అంతా ఖండిస్తోంది. ఈ ఖండన సరైనదే అయినా చాలా మంది పొరపాటు కారణాలతో ట్రంప్ విధానాన్ని ఖండిస్తున్నారు. అంతర్జాతీయ వాణిజ్యంపై ఎటువంటి ఆంక్షలూ ఉండకూడదన్న దృక్పథం నుండి ట్రంప్‌ను ఖండిస్తున్నవారు అత్యధికంగా ఉన్నారు. అటువంటి స్వేచ్ఛావాణిజ్య సూత్రానికి విరుద్ధంగా ట్రంప్ చాలా మూర్ఖంగా, అసహ్యంగా వ్యవహరిస్తున్నాడని వారంతా అతడిని తిట్టిపోస్తున్నారు. ఒక విధంగా ట్రంప్ విమర్శకుల్లో చాలా ఎక్కువమంది డేవిడ్ రికార్డో కాలం నుండీ మనకు వారసత్వంగా అందించిన స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతాన్ని వంటపట్టించుకుని ఆ ప్రాతిపదికన ట్రంప్‌ను విమర్శిస్తున్నారు. ఈ వాదన మాత్రం పూర్తిగా తప్పు.

స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతం 'సే' ప్రతిపాదించిన సూత్రం మీద ఆధారపడి రూపొందింది. ఆ సూత్రం ప్రకారం పెట్టుబడిదారీ వ్యవస్థలో ఎప్పుడూ డిమాండ్‌కి కొరత ఉండదు. అంటే ఎంత విలువగల సరుకు మార్కెట్లోకి వస్తుందో అంత కొనుగోలు శక్తి, సరుకుల అవసరం వినియోగదారుల వద్ద ఉంటాయి అని ఆ సూత్రం చెప్తుంది. ఇది బొత్తిగా అర్థం లేని సూత్రం అని చెప్పడానికి పెద్ద వివరణ ఏమీ అవసరం లేదు. పెట్టుబడిదారీ మార్కెట్‌లో మొత్తంగా చూసుకున్నప్పుడు సరుకుల సరఫరా కన్నా వాటి వినిమయం ఎప్పుడూ తక్కువగానే ఉంటుంది. అందుకే పెట్టుబడిదారుల నడుమ తీవ్రమైన పోటీ నెలకొని వుంటుంది. స్వేచ్ఛా వ్యాపారం గాని, సుంకాల విధింపు ద్వారా దానిని నియంత్రించడం కాని మార్కెట్‌లో ఎక్కువ భాగం కొన్ని దేశాలు మాత్రం చేజిక్కించుకోడానికే అమలౌతాయి. కొన్ని దేశాలకు ఎక్కువ మార్కెట్ వాటా దక్కడం అంటే మరికొన్ని దేశాలకు దక్కవలసిన వాటా దక్కకుండా పోవడం అన్నమాట. స్వేచ్ఛా వ్యాపారం అనేది అన్ని దేశాలకూ ఒకే మోతాదులో లాభదాయకంగా ఉండదు. తన దేశానికి ఇబ్బందిగా ఉన్నప్పుడు స్వేచ్ఛా వ్యాపార సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాడంటూ ట్రంప్‌ను విమర్శించడం అంటే తప్పుడు కారణాల ప్రాతిపదికన విమర్శించడమే అవుతుంది.

అభ్యుదయకర స్వభావంగల కొందరు మేథావులు ట్రంప్ విధానాన్ని వేరే కారణాలను చూపి విమర్శిస్తున్నారు. ఒకపక్క మూడవ ప్రపంచ దేశాలన్నీ స్వేచ్ఛా వాణిజ్యాన్ని అనుసరించేలా ఒత్తిడి చేస్తూ మరోపక్క బలమైన పెట్టుబడిదారీ దేశంగా ఉన్న అమెరికా తన వరకూ మాత్రం అధిక సుంకాలను విధించడం అనేది ఒక సామ్రాజ్యవాద ఆధిపత్య లక్షణం అని వారు విమర్శిస్తున్నారు. ఇలా అమెరికా విధించే అధిక సుంకాల వలన మూడవ ప్రపంచ దేశాల నుండి అమెరికాకు ఎగుమతులు తగ్గిపోతాయని, అప్పుడు ఆ దేశాలలో నిరుద్యోగం పెరుగుతుందని, అమెరికాలో నిరుద్యోగాన్ని తగ్గించడం కోసం మూడవ ప్రపంచ దేశాలకు ఆ నిరుద్యోగాన్ని ట్రంప్ ఎగుమతి చేస్తున్నాడని వారు విమర్శిస్తున్నారు. తక్షణ పరిస్థితుల్లో ఈ వాదన వర్తించేదే అయినా ఇది సామ్రాజ్యవాదపు ప్రధాన ధోరణిని సూచించడం లేదు. వలస విధానం చివరి దశలో వలస దేశాల మీద స్వేచ్ఛా వాణిజ్య విధానాన్ని సామ్రాజ్యవాదులు రుద్దారు. అయితే అప్పుడు ప్రధాన సామ్రాజ్యవాద దేశంగా ఉన్న బ్రిటన్ కూడా స్వేచ్ఛా వాణిజ్య విధానాన్ని అమలు చేసింది. ఇండియా, చైనా వంటి దేశాలలోకి తన పారిశ్రామిక ఉత్పత్తులను విరజిమ్మింది. దానివలన ఇండియాలో, చైనాలో ఉన్న చేతివృత్తులు, చిన్న ఉత్పత్తిదారులు చితికిపోయారు.

మొదటి ప్రపంచ యుద్ధానికి, రెండో ప్రపంచ యుద్ధానికి మధ్య కాలంలో మహా మాంద్యం తలెత్తిన నేపథ్యంలో లాటిన్ అమెరికా దేశాల్లో ఒక కొత్త రాజకీయ వెల్లువ పెల్లుబికింది. అక్కడి దేశాల్లో కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అవన్నీ తమ దేశాలను విదేశీ సరుకుల తాకిడి నుండి రక్షించుకోడానికి విదేశీ సరుకుల మీద అధిక సుంకాలను విధించి తమ తమ దేశాలలో పరిశ్రమలు బలపడడానికి తోడ్పడ్డాయి. అయిష్టంగానైనా, భారతదేశంలో కూడా అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం విదేశీ సరుకుల దిగుమతులపై అదనపు సుంకాలను విధించింది. దేశంలో అప్పుడప్పుడే తలెత్తుతున్న పరిశ్రమలకు రక్షణ కావాలన్న వాదనను చూపించి ఆ అదనపు సుంకాలను విధించింది. ఆ క్రమంలో దేశీయంగా పెట్టుబడిదారీ వర్గం కొంత నిలదొక్కుకోడానికి అవకాశం వచ్చింది. అందుచేత సామ్రాజ్యవాదం అన్ని సందర్భాలలోనూ తయ దేశీయ మార్కెట్‌ను రక్షించుకోవడమే ప్రధానంగా ఎంచుకుందని చెప్పలేం. అలాగే వలస దేశాలపై, లేదా మూడవ ప్రపంచ దేశాలపై స్వేచ్ఛా వాణిజ్య విధానాన్ని అన్ని కాలాల్లోనూ బలవంతంగా రుద్దిందని కూడా చెప్పలేం. సామ్రాజ్యవాదం అనుసరించిన వాణిజ్య విధానం ఆ యా కాలాల్లోని నిర్దిష్ట పరిస్థితులను బట్టి ఉండేది. ఇటీవల కాలంలో మూడవ ప్రపంచ దేశాల్లో తమ ఫ్యాక్టరీలను పెట్టడానికి బహుళజాతి కంపెనీలు సుముఖత చూపించాయి. దానికి కారణం ఇక్కడ ఉన్న చౌక కార్మిక శక్తిని కొల్లగొట్టి తమ లాభాలను బాగా పెంచుకోవాలన్న వాళ్ళ లక్ష్యమే. దాని వలన మూడవ ప్రపంచ దేశాల్లో అదనంగా ఉపాధి కల్పన జరిగిందే తప్ప సంపన్న దేశాల నుండి నిరుద్యోగం ఇక్కడికేమీ ఎగుమతి కాలేదు కదా? ఈ కాలంలో స్వేచ్ఛా వాణిజ్యం అమలులో ఉంది. స్వేచ్ఛా వాణిజ్యం అమలైతే మన దేశానికి పెట్టుబడులు వస్తాయని, దాని వలన అదనంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రచారం చేయడం ద్వారా ఇండియా వంటి దేశాలలో నయా ఉదారవాద విధానాలను ఆమోదింపజేశారు. ఇప్పుడు ట్రంప్ స్వేచ్ఛా వాణిజ్యానికి అడ్డుకట్ట వేయడానికి పూనుకున్నాడు.

ట్రంప్ ఇప్పుడు చేపడుతున్న రక్షణాత్మక చర్యలు మూడవ ప్రపంచ దేశాల నుండి, ముఖ్యంగా చైనా నుండి ఉపాధి అవకాశాలను తన దేశానికి లాక్కుందామన్న లక్ష్యంతో మాత్రమే చేపడుతున్నవి కావు. ఇప్పుడు చైనాతో అమెరికా వాణిజ్య లోటు చాలా హెచ్చు స్థాయిలో ఉంది. దాని వలన అమెరికా ప్రపంచంలోకెల్లా అత్యధిక రుణగ్రస్త దేశంగా నిలిచింది. ఇప్పుడు చైనా నుండి దిగుమతులను అధిక సుంకాల ద్వారా నిరోధిస్తే దాని ఫలితంగా వాణిజ్య లోటు తగ్గుతుందని ట్రంప్ ఆశ పడుతున్నాడు.

అయితే ఇక్కడ ఒక వైరుధ్యాన్ని సాధారణంగా పట్టించుకోవడం లేదు. సామ్రాజ్యవాద దేశాల కూటమికి నాయకత్వ స్థానంలో ఉండే దేశం సాధారణంగా తక్కిన దేశాలతో వాణిజ్య లోటును కొనసాగించడం పరిపాటి. ఆ యా దేశాల ఆకాంక్షలను సర్దుబాటు చేయడానికి వాటి నుండి అధికంగా దిగుమతులను అనుమతించడం, దాని వలన తన వాణిజ్య లోటు పెరగడం జరుగుతుంది. మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వ కాలంలో సామ్రాజ్యవాద శిబిరానికి నాయకత్వ స్థానంలో బ్రిటన్ ఉండేది. అప్పుడు తక్కిన యూరోపియన్ దేశాలతోను, అమెరికాతోను బ్రిటన్‌కు వాణిజ్య లోటు నిరంతరం కొనసాగేది. ఆ దేశాల కోర్కెలను నెరవేర్చడం ద్వారా బ్రిటన్ తన నాయకత్వ స్థానాన్ని పదిలం చేసుకునేది.

అయితే ఈ వాణిజ్య లోటు కారణంగా బ్రిటన్ ఏనాడూ రుణగ్రస్త దేశంగా అయిపోలేదు. పైగా ఇతర దేశాలకు రుణాలను ఇచ్చే దేశంగా, పెట్టుబడులను ఇతర దేశాలలో పెట్టే దేశంగా ఉండేది. ముఖ్యంగా ఏ యే దేశాల నుండి తనకు ఎక్కువగా సరుకులు వచ్చేవో, ఆ దేశాలలోనే ఎక్కువ పెట్టుబడులు పెడుతూ వుండేది. దీనికి కారణం బ్రిటన్ తన వలస దేశాలన్నింటి నుండి వాటి వాటి ఎగుమతుల ఆదాయాలను తాను చేజిక్కించుకునేది. తన సరుకులను ఆ దేశాలకు పంపి వాటి కారణంగా అక్కడి స్థానిక చేతివృత్తులు చితికిపోయేలా చేసేది. అప్పుడు బ్రిటన్ వలస విధానం ఉనికిలో ఉన్నప్పుడు నాయకత్వం చెలాయించడానికి. ఇప్పుడు అటువంటి వలస విధానం లేని కాలంలో అమెరికా నాయకత్వం చెలాయించడానికి ఒక మౌలికమైన తేడా ఉంది. మూడవ ప్రపంచ దేశాల ఎగుమతుల ఆదాయాలను కొల్లగొట్టడానికి కాని, ఆ దేశాలలోని పరిశ్రమలను చితికిపోయే విధంగా ఆ దేశాలకు ఎగుమతులు చేయడం కాని ఇప్పుడు అమెరికాకు సాధ్యం కాదు.

ప్రస్తుతం వలసలు లేని సామ్రాజ్యవాదం నడుస్తోంది. పెట్టుబడిదారీ-పూర్వపు ఉత్పత్తి విధానం అంతరిస్తున్నకొద్దీ స్థానిక వృత్తులను నాశనం చేసి తన సరుకుల ద్వారా అక్కడి మార్కెట్‌ను ఆక్రమించుకునే అవకాశాలు తగ్గిపోతాయి. ఒకవేళ కొన్ని వలస దేశాలు ఉన్నా, వాటి ఆర్థిక వ్యవస్థలు ఎదుగూ బొదుగూ లేకుండా పడివుండడంతో అక్కడినుండి ఎగుమతుల ఆదాయాన్ని మరింత ఎక్కువగా కొల్లగొట్టే అవకాశాలూ అంతరించిపోతాయి. అందుచేత గతంలో బ్రిటన్ సామ్రాజ్యవాదం నాయకత్వం చెలాయించినప్పుడు ఉన్న సానుకూల అంశాలు ఇప్పుడు లేవు.

ట్రంప్ ఇప్పుడు మొదలుబెట్టిన సుంకాల యుద్ధాన్ని చూసి అతడికి పిచ్చి పట్టిందనో, లేదా అతడికి తక్కిన ప్రపంచం అంటే విపరీతమైన ద్వేషం అనో వ్యాఖ్యానించేవారున్నారు. కాని అతడి చర్యలకు మూలం పెట్టుబడిదారీ విధానంలో పాతుకుని వున్న వైరుధ్యాలలో ఉంది. పెట్టుబడిదారీ విదానం ముదురుతున్న కొద్దీ ఈ వైరుధ్యాలు ముందుకొస్తాయి. వాటిని విస్మరించి, కేవలం ట్రంప్ పిచ్చితనానికి ప్రాధాన్యతనివ్వడం అంటే అది పైపై పరిశీలన మాత్రమే అవుతుంది. ఇప్పుడు ట్రంప్ విధించిన అధిక సుంకాల మంత్రం పని చేసి ఒకవైపు అమెరికాలో ఉద్యోగావకాశాలు పెరగడం, మరోవైపు అమెరికా వాణిజ్యలోటు తగ్గడం-రెండూ జరగాలంటే తక్కిన దేశాలు తమ వంతు సుంకాలను పెంచి ప్రతీకార చర్యలకు దిగకూడదు. తక్కిన దేశాలు కూడా ప్రతీకార చర్యగా అమెరికన్ సరుకుల దిగుమతులపై అధిక సుంకాలను విధిస్తే అప్పుడు ట్రంప్ మంత్రం పని చేయకపోగా పెట్టుబడిదారీ ప్రపంచం యావత్తూ చిక్కుల్లో పడుతుంది.

అన్ని దేశాల్లోనూ దిగుమతి సుంకాలు పెరిగితే అప్పుడు ఆ సరుకుల ధరలు పెరుగుతాయి. దానికి అనుగుణంగా జీతాలు పెరగవు. అప్పుడు కొనుగోలు శక్తి పడిపోయి వినిమయం మరింత తగ్గిపోతుంది. దాని వలన సరుకుల డిమాండ్ ఇంకా తగ్గుతుంది. అది మరింత నిరుద్యోగానికి దారి తీస్తుంది. పోనీ, ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం ద్వారా ఉపాధి అవకాశాలను కాపాడదామా అంటే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి నిబంధనలు అందుకు అంగీకరించవు. పోనీ సంపన్నుల మీద అదనపు పన్నులు వేద్దామా అంటే అందుకూ అంగీకరించవు. పెట్టుబడిదారీ వ్యవస్థలోని మౌలిక వైరుధ్యం ఈ పరిస్థితికి కారణం తప్ప ట్రంప్ పిచ్చితనం కాదు.

మరి ఇప్పుడు ట్రంప్ చేపడుతున్న చర్యలకు ఏ విధంగా ప్రతిస్పందించాలి? ఇప్పుడు ట్రంప్ చేపడుతున్న అధిక సుంకాలు అమెరికా నుండి మూడవ ప్రపంచ దేశాలకు ఉత్పత్తి కార్యకలాపాల విస్తరణ రాబోయే కాలంలో జరగదని స్పష్టం చేస్తున్నాయి. సంపన్న దేశాల నుండి పెట్టుబడులు వస్తాయనే కదా మూడవ ప్రపంచ దేశాలు నయా ఉదారవాద విధానపు షరతులకన్నింటికీ తలవొగ్గింది? ఇక ఇప్పుడు అటువంటి పెట్టుబడులు వచ్చే అవకాశాలు లేవు అన్నది స్పష్టం అయిపోయాక ఇక మన దేశం చేయవలసింది ఒక్కటే. అది నయా ఉదారవాద పంథాను విడిచిపెట్టడమే. అందులో మొదటి చర్యగా మన దేశీయ ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవడం, దేశీయ మార్కెట్‌ను విస్తరింపజేయడం జరగాలి. కేవలం రక్షణాత్మక చర్యలు మాత్రమే సరిపోవు. వాటితోబాటు ప్రభుత్వ వ్యయాన్ని పెంచి వ్యవసాయ రంగాన్ని, చిన్న ఉత్పత్తుల రంగాన్ని ప్రోత్సహించాలి. అందుకవసరమైన పెట్టుబడిని సమీకరించడానికి సంపన్నుల మీద అదనపు పన్నులు విధించాలి. అప్పుడు దేశీయంగా ప్రజల ఆదాయాలు పెరిగి మార్కెట్ విస్తరిస్తుంది. ప్రజలకు సంక్షేమమూ అందుతుంది.

ఇటువంటి చర్యలు చేపట్టినప్పుడు మన దేశం నుండి ఫైనాన్సు పెట్టుబడి బైటకు తరలిపోయే అవకాశం ఉంటుంది. దానిని అదుపు చేయడానికి పెట్టుబడుల కదలికలపై నియంత్రణలను విధించాలి. ట్రంప్ చేపట్టిన చర్యలతో మన కళ్ళు తెరుచుకోవాలి. అసమానతలను తగ్గించడం, సంక్షేమానికి పెద్ద పీట వేయడం, దేశీయ మార్కెట్‌ను విస్తరింపజేయడం, ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలవడం ఇండియా వంటి మూడవ ప్రపంచ దేశాలకు ముందున్న ప్రత్యామ్నాయం. అప్పుడే ట్రంప్ దూకుడు నుండి తట్టుకోవడం సాధ్యం.

(స్వేచ్ఛానుసరణ)

గేయం

అనకాపల్లి కన్నీటి పాట

పల్లవి:
అనకాపల్లి రా..ఆంధ్రా
శివకాశి రా!-అక్కడ
ఆకలి కట్టిన సంచులే
బాణా సంచాలు రా! **'అనకా'**
చరణం: దట్టించిన మందు
గుండు
ఆడి నుదుటి సెమట రా
ముట్టించిన మన కళ్ళకు
మూన్నాళ్ళ ముచట రా
బొగ్గు, సురాకారమూ
గంధకాల గాలి పీల్చి
ఆడి ఊపిరితిత్తులే
కాకర పువ్వొత్తులు రా!
"అనకా"
భూమ్మీద గిర గిరా
తిరుగుతున్న సెక్రము
అది ఆగిపోతే.. ఆరిపోతే
ఆడి బతుకు దు:ఖమూ..
విష్ణుమూర్తి సెక్రాన్నీ
ఆడే తిప్పాడురా..
ఆడి సృష్టి లక్ష్మి బాంబురా
ఆడి బతుకు తెల్ల కార్డు రా!
"అనకా"
సిచ్చు బుడ్డిమూత రా-ఆడి
పెదవి ఉమ్మిపూతరా
గాలిలోకి ఇరజిమ్మిన
దాని సత్తువాడి శ్వాసరా..
పేలుడు సామానుల
తయారీ వృత్తిరా..
ఆడి సావూ, బతుకుల మధ్య
సన్నటి ఒత్తి రా! **"అనకా"**
పేలిపోయినప్పుడు
కాలిపోయినప్పుడు
ఆలి కూడా ఆడి తోనే
కూలిపోయినప్పుడు
ఒంటరి బిడ్డల
అంతులేని గోడులకు
ఎక్సుగ్రేషియాలు
ఎంతవరకు తోడు రా!?
"అనకా"

(బాధిత కుటుంబాలకు ఈ వేదనా గీతం అంకితం. పెద్దలు గోరంటి వెంకన్న బాణీలో.. గల్లీ చిన్నది.. పాడొచ్చు. వెంకన్నకు ప్రేమతో కృతజ్ఞత.)

- నల్లి ధర్మారావు,
సెల్ : 76609 67313

జనవాక్యం

ఎన్నాళ్లీ మూఢనమ్మకాలు?

ప్రపంచవ్యాప్తంగా ఆధునిక విజ్ఞానం ఎంతో ముందుకు పోతోంది. సైన్సుకు తిరుగులేదు అన్నంతగా ప్రపంచ మానవుడు ఇతర గ్రహాలలో కాపురం పెట్టేందుకు ఉరకలు వేస్తున్నాడు. దేవుడు కల్పితం, స్వర్గనరకాలు లేవు, మహిమలు మంత్రాలు, చేతబడులు అసలే లేవు. అని రుజువులతో హేతువాదులు సవాలు చేస్తున్నారు. జ్యోతిష్యం వాస్తు బూటకమని, నమ్మి మోసపోవద్దని ఎన్నిమార్లు ఛాలెంజ్ చేసినా ఇంకా అమాయకులు మోసపోతూనే ఉన్నారు. బాబాలందరూ మోసగాళ్లు, వారిని నమ్మి జీవితాలు పాడు చేసుకోవద్దు అని నిత్యం చెప్తూనే ఉన్నాం. అయినా చదువుకున్నారని అనుకున్నవారే ఈరోజు బాబాలను పోషిస్తున్నారు. నాలుగు సంవత్సరాల క్రితం మదనపల్లిలో బాగా చదువుకున్న తలిదండ్రులు, వారి ఇద్దరు కుమార్తెలను సుత్తితో కొట్టి మరీ చంపారు. ఈ సంఘటనకు ఒక బాబా ప్రేరణ వున్నదని ఆ రోజు పత్రికలు రాశాయి. ఆ తల్లిదండ్రుల ఫోన్ తీస్తే ఆ బాబా ఎవడన్నది మొత్తం బయటపడేది. ఆరేడు సంవత్సరాల క్రితం కేంద్రం మూఢనమ్మకాల నిర్మూలన కోసం అన్ని రాష్ట్రాలను సలహాలు ఇవ్వండని కోరింది. ఏమైందో తెలియదు. కానీ ఈ రోజు కేంద్ర ప్రభుత్వమే మూఢనమ్మకాలను పెంచి పోషిస్తున్నది. ప్రజలలో ప్రశ్నించేతత్వం పెంచాలని రాసుకున్న రాజ్యాంగ సూత్రాలను నాయకులు గాలికి వదిలారు. ఒక బిజెపి పార్లమెంటు సభ్యుడు సంస్కృతం మాట్లడితే షుగర్ జబ్బు పోతుందని బుద్ధిలేని ప్రకటన ఇస్తాడు. ఇంకొక యూపీ బిజెపి మంత్రి ఆవు వెనుక భాగంలో చరిస్తే బీపీ తగ్గిపోతుందని ప్రకటిస్తాడు. ఇంకేం! షుగర్, బీపీ ఇంత సులభంగా తగ్గి పోగొట్టిస్తున్న వీరిద్దరికి నోబెల్ బహుమతి ఇవ్వవచ్చు. ప్లేట్లు వాయిస్తే కరోనా పోతుందన్న మోడీజీకి కూడా ఇంకొక నోబెల్ ఇవ్వవచ్చేమో! ఆ కమిటీ పరిశీలించాలి. ఆవుకు సంస్కృతం నేర్పుతానన్న నిత్యానంద దేశం వదలి పారిపోయాడు. ఈమధ్య అడ్డుఅదుపు లేకుండా వశీకరణ మంత్రాలు యూట్యూబ్ చానళ్లలో వస్తున్నాయి. అదుపు చెయ్యాల్సిన ప్రభుత్వం ఆ పని చెయ్యటంలేదు. ఆవు మూత్రం తాగితే సర్వ రోగాలు పోతాయని కూడా బిజెపి వారు ప్రచారం చేస్తున్నారు. అష్టో నవగ్రహ వాచ్ పెట్టుకుంటే సమస్యలు తీరతాయని, ఒక వాచ్ రెండు వేలు, రెండు వాచ్‌లు మూడు వేలు అని టీవీలలో ప్రచారం చేస్తూ, జనం జేబులు కొడుతున్నా కూడా పట్టించుకునేవారు లేరు. మూఢ నమ్మకాల నిర్మూలన తోనే సమాజం అభివృద్ధి చెందుతుంది. అందుకోసం అందరూ కృషి చెయ్యాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps @gmail.com

సమస్య

చెరకు రైతులకు చేదు అనుభవం!



చెరకుకు మద్దతు ధర పొరుగు రాష్ట్రాల్లో రూ.4 వేలు ఇస్తున్నా, ఇక్కడ రూ.3151 ప్రకటించినా ఇది కూడా సకాలంలో అందక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు చెరుకు దిగుబడి తగ్గిపోయి రైతాంగానికి రావాల్సిన ధర రావడం లేదు. ప్రభుత్వాలు కొత్త వంగడాలు ఇవ్వలేదు. మన రాష్ట్రంలోని ప్రభుత్వాలు గత 15 ఏళ్ల నుండి సహకార చక్కెర ఫ్యాక్టరీలను నిర్వీర్యం చేయడం, ఉన్న ఫ్యాక్టరీని, ఇక్కడ రైతాంగాన్ని పట్టించుకోకుండా గాలికొదిలేసింది. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ మీద సుమారు 11 మండలాల ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ మూతబడితే చెరకు రైతులు, కార్మికులు రోడ్డున పడతారు.



వి.వి.శ్రీనివాసరావు

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో రెండు సంవత్సరాల క్రితం వరకు దాదాపు 30 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పండిన 5.50 లక్షల టన్నుల చెరకును పంచదార ఉత్పత్తికి తరలించే పరిస్థితి వుండేది. అలాంటిది నేడు 1 లక్ష టన్నులకు రైతాంగం దిగిపోయారంటే ప్రభుత్వాలు ఎంత దుర్మార్గంగా వ్యవహరించాయో అర్థమౌతోంది.

గోవాడ సహకార చక్కెర ఫ్యాక్టరీ గత 6 దశాబ్దాలుగా నడుస్తుండడం, మిషనరీ పాతది కావడంతో దిగుబడి తగ్గడం, ఆధునీకరణకు నిధులు లేక పంచదారకు మార్కెట్ సౌకర్యం కల్పించకపోవడం, గత పాలక వర్గాల అవినీతికి పాల్పడడంతో నేడు అత్యంత దయనీయ స్థితిలో ఈ ఫ్యాక్టరీ నడుస్తోంది. 2025 జనవరి 20వ తేదీన చెరకు క్రషింగ్ ప్రారంభించినా నిధుల లేమితో యంత్రాలను సరిగా శుద్ధి చేయకపోవడంతో ప్రారంభం నుండి ఇప్పటికి 40 సార్లు చెరకు గానుగాట ఆగిపోయి రైతులు, కార్మికులకు అగ్నిపరీక్ష పెట్టింది. దీంతో ఫ్యాక్టరీకి చెరకు తీసుకువచ్చిన రైతాంగం విసిగి, వేసారి భారీ ఆందోళన నిర్వహించి ప్రభుత్వానికి, అధికారులకు పెద్ద హెచ్చరిక ఇచ్చారు. రాష్ట్రంలో మిగిలిన ఏకైక సహకార గోవాడ షుగర్ ఫ్యాక్టరీ దయనీయ పరిస్థితి, అక్కడ రైతాంగం పడుతున్న ఇబ్బందులను గమనించి...సిపిఎం రక్షణ యాత్రలో భాగంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు...ఇటీవల గోవాడ చక్కెర ఫ్యాక్టరీని సందర్శించి అక్కడ రైతాంగం, కార్మికుల స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ ఫ్యాక్టరీ ఆధునీకరణకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని, చెరకు రైతాంగానికి, పని చేస్తున్న కార్మికులకు బకాయిలు చెల్లించాలని సిపిఎం, రైతు, కార్మిక సంఘాలు మార్చి 21న మహా ధర్నాను, భారీ రాస్తారోకోను నిర్వహించాయి. పది రోజుల్లో బకాయిలు చెల్లించడానికి, ఆధునీకరణకు ప్రభుత్వానికి విన్నవించడానికి ఫ్యాక్టరీ యాజమాన్యం హామీనిచ్చింది!

గోవాడ చక్కెర ఫ్యాక్టరీ రాష్ట్రంలో ఎన్నో అవార్డులను అందుకుంది. ఈ సహకార ఫ్యాక్టరీ 25 వేల మంది రైతులు, కౌలు రైతుల సభ్యత్వంతో రైతాంగానికి విత్తనాలు, ఎరువులు, పంచదార వంటి సబ్సిడీలు ఇచ్చేది. అలాంటి షుగర్ ఫ్యాక్టరీ పాలకుల వైఫల్యం వల్ల నేడు లక్ష టన్నుల క్రషింగుకు పడిపోయింది. వచ్చే ఏడాది ఈ మాత్రం పరిస్థితి కూడా వుండదు. అనకాపల్లి బిజెపి ఎం.పీ., సి ఎం. రమేష్ కేంద్ర ప్రభుత్వం నుండి రూ.200 కోట్లు తెస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 10 నెలలైనా సీజన్‌లో ఫ్యాక్టరీ అనేక ఇబ్బందులను ఎదర్కొంటున్నా కనీసం ఒక్కసారి కూడా అటువైపు చూడలేదు. కూటమి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కొత్త పరిశ్రమలు పెట్టి అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్న ముఖ్యమంత్రి ఉన్న ఒక్క సహకార గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరించి ఉన్న ఉపాధిని కాపాడడం లేదు. కార్మికులకు నెలా నెలా జీతాలు రాక అప్పులు చేసి బతుకుతున్నారు. రైతులకు గత ఏడాది బకాయిలను నేటికీ చెల్లించలేదు. స్థానిక ఎమ్మెల్యేలు దీన్ని పూర్తి సామర్థ్యంతో నడుపుతానని ఎన్నికల్లో ఇచ్చిన హామీ నీటి మూటగానే నిలిచిపోయింది. పైగా ఇక్కడ చెరకు బదులు డిస్టలరీ యూనిట్‌గా ఈ ఫ్యాక్టరీని మార్చుతానని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. ఒకవైపు చెరకు పరిశ్రమను ఆధునీకరించి ఈ ప్రాంత రైతాంగాన్ని, ప్రజల్ని ఆదుకోకుండా వచ్చే ఏడాదికి చెరకు పంట వేయాలో లేదో, పంట వేసినా ఫ్యాక్టరీ నడుస్తుందో లేదోనని చెరకు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫ్యాక్టరీని మూసేస్తే ఫ్యాక్టరీ ఆస్తులను, భూములను ఎలా సొంతం చేసుకోవాలనే ఆలోచనతో ఇక్కడ ప్రజాప్రతినిధులకు ఉన్నట్టు ప్రజానీకం భావిస్తున్నారు!

మరోవైపు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాలు చెరకు రైతులకు ప్రోత్సాహకాలు, గిట్టుబాటు ధర కల్పించి పంచదార ఉత్పత్తిలోను, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలోను మంచి ఫలితాలను సాధిస్తున్నాయి. చెరకుకు మద్దతు ధర పొరుగు రాష్ట్రాల్లో రూ.4 వేలు ఇస్తున్నా, ఇక్కడ రూ.3151 ప్రకటించినా ఇది కూడా సకాలంలో అందక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు చెరకు దిగుబడి తగ్గిపోయి రైతాంగానికి రావాల్సిన ధర రావడం లేదు. ప్రభుత్వాలు కొత్త వంగడాలు ఇవ్వలేదు. మన రాష్ట్రంలోని ప్రభుత్వాలు గత 15 ఏళ్ల నుండి సహకార చక్కెర ఫ్యాక్టరీలను నిర్వీర్యం చేయడం, ఉన్న ఫ్యాక్టరీని, ఇక్కడ రైతాంగాన్ని పట్టించుకోకుండా గాలికొదిలేసింది. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ మీద సుమారు 11 మండలాల ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ మూతబడితే చెరకు రైతులు, కార్మికులు రోడ్డున పడతారు. గోవాడ చక్కెర ఫ్యాక్టరీని కాపాడుకోవడం కోసం రైతులు, కార్మికులు, ప్రజలు ఐక్యంగా కదిలి మరో పోరాటానికి దిగడం మినహా మరో మార్గం లేదు.

/వ్యాసకర్త సెల్: 9490098799 /

ఎఫ్‌డిలపై బిఒఐ వడ్డీ రేట్ల కోత

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బిఒఐ) ఫిక్సడ్ డిపాజిట్లపై వడ్డీరేట్లను తగ్గించింది. ఇప్పటికే 400 రోజుల ఎఫ్‌డి స్కీమ్‌ను వెనక్కి తీసుకున్న బిఒఐ తాజాగా మిగితా ఎఫ్‌డిలపై వడ్డీ రేట్ల తగ్గింపును ప్రకటించింది. ఇది 15 ఏప్రిల్ నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. ఫిక్సడ్ డిపాజిట్లపై 25 బేసిస్ పాయింట్లు (పావు శాతం) వరకు వడ్డీ రేటును తగ్గించినట్లు బిఒఐ వెల్లడించింది. దీంతో 91-179 రోజుల ఎఫ్‌డిపై వడ్డీ 25 బేసిస్ పాయింట్లు తగ్గి 4.25 శాతానికి చేర్చింది. 180 రోజుల నుంచి ఏడాది కాలపరిమితి ఎఫ్‌డిపై 5.75 శాతానికి, 1-2 ఏళ్ల ఎఫ్‌డిలపై వడ్డీని 6.75 శాతంగా నిర్ణయించింది.

ఎస్‌బిఐ రుణాలు చౌక

- వడ్డీ రేట్ల తగ్గింపు



ముంబయి : దేశంలోనే అతిపెద్ద దిగ్గజ విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) తన రుణ గ్రహీతలకు ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించింది. సవరించిన రేట్లు ఏప్రిల్ 15 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇటీవల ఆర్‌బిఐ రెపో రేటును పావు శాతం తగ్గించిన నేపథ్యంలో దిగ్గజ బ్యాంక్ ఆ ప్రతిఫలాలను ఖాతాదారులకు బదిలీ చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే రెపో లింక్డ్ లెండింగ్ రేటు (ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్), ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ ఆధారిత లెండింగ్ రేట్‌ను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. రెపో లింక్డ్ రేటు 8.25 శాతానికి చేర్చగా.. ఇబిఎల్‌ఆర్‌ను 8.65 శాతానికి పరిమితం చేసింది. దీంతో ఇప్పటికే రుణాలు తీసుకున్న వారితో పాటు, కొత్తగా రుణాలు తీసుకునే వారికీ ప్రయోజనం చేకూరనుంది.

ఏప్రిల్ 21న ఒప్పో కె13 5జి విడుదల



న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ ఒప్పో ఏప్రిల్ 21న తన ఒప్పో కె13 5జిని విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. 6.67 అంగుళాల అమెలెడ్ ఎఫ్‌హెచ్‌డి ప్లస్ డిస్‌ప్లే కలిగిన ఈ ఫోన్‌ను 7000 ఎంఎహెచ్ బ్యాటరీ, 80 వాట్ సూపర్‌వుక్ చార్జర్‌తో ఆవిష్కరించనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. ఇందులో స్నాప్‌డ్రాగన్ 6 జెన్4 ప్రాసెసర్‌ను ఉపయోగిస్తున్నట్లు తెలిపింది.

మయన్మార్‌లో మళ్లీ భూకంపం

- 4.5 తీవ్రతతో భూప్రకంపనలు



నేపిటావ్ : మయన్మార్‌లో మార్చి 28వ తేదీన వరుస భూప్రకంపనలు సంభవించి వేలాది మంది మరణించిన . ఈ ఘటనను పూర్తిగా మరువకముందే మరోసారి మయన్మార్‌లో భూకంపం సంభవించింది. సోమవారం 4.5 తీవ్రతతో భూప్రకంపనలు సంభవించాయని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్‌సిఎస్) వెల్లడించింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. మయన్మార్‌లో సోమవారం తెల్లవారుజామున ఒకటిన్నర గంటల సమయంలో భూకంపం సంభవించింది. వెడల్పు : 19.78, పొడవు : 95.49, పది కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించిందని ఎన్‌సిఎస్ ఎక్స్ పోస్టులో పేర్కొంది.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం

- బ్యాంకు ఉద్యోగుల ధర్నాలో నాగేశ్వరరావు



బ్యాంక్ ఉద్యోగుల ధర్నాలో పాల్గొన్న ఎవి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-విజయవాడ

తమ సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ యూనియన్ బ్యాంక్‌లో పనిచేస్తున్న తాత్కాలిక, క్యాజువల్ ఉద్యోగులు అల్ ఇండియా యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపు మేరకు విజయవాడ ధర్నా చౌక్‌లో సోమవారం ధర్నా చేశారు. ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ అజయ్‌కుమార్, బ్యాంక్ ఉద్యోగులు, ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళ లర్పించారు. కార్యక్రమానుద్దేశించి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బ్యాంక్ ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి సిఐటియు అండగా నిలుస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ఉద్యోగులను భర్తీ చేయకుండా, ఖాతాదారులకు బ్యాంకు సేవలను దూరం చేస్తోందని విమర్శించారు. గత పది సంవత్సరాలుగా హౌస్ కీపర్స్ నియామకాలు జరగనందున ఉన్న ఉద్యోగులపై అదనపు పని భారం పడుతోందన్నారు. 2020 ఏప్రిల్ 1న యూనియన్ బ్యాంక్‌లో కార్పొరేషన్ బ్యాంక్, ఆంధ్రా బ్యాంక్ విలీనమైన తర్వాత దేశ వ్యాప్తంగా 2021 డిసెంబర్ ఒకటి నాటికి 9184 శాఖలకు గాను కేవలం 4895 హౌస్ కీపర్స్ మాత్రమే పని చేస్తున్నారని, 4289 హౌస్ కీపర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వీటితో పాటు వేలాది ఆఫీస్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ ఖాళీలలో తాత్కాలిక, క్యాజువల్ ఉద్యోగులు నియమించుకుని వారికి అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారని తెలిపారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ... యూనియన్ బ్యాంక్‌లో ఏళ్ల తరబడి పని చేస్తున్న తాత్కాలిక, క్యాజువల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావడం లేదని, విధిలేని పరిస్థితుల్లో వారందరూ ఉద్యమ బాట పట్టాల్సి వచ్చిందన్నారు. వీరి సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోకపోతే సంఘటితంగా ఉద్యమించాల్సి వస్తోందని హెచ్చరించారు. నేటికీ ఉద్యోగులు వివిధ రూపాల్లో నిరసనలు వ్యక్తం చేస్తున్నారన్నారు. తాత్కాలిక, క్యాజువల్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనం, బోనస్ ఇవ్వాలని బ్యాంకు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ జాయింట్ సెక్రటరీ సిహెచ్ కళాధర్, రైల్వే కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి నరసింహులు ఈ ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విజయవాడ జోన్ పరిధిలోని టెంపరరీ ఉద్యోగులతో పాటు వారి కుటుంబసభ్యులు, యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

యెమెన్‌లో అమెరికా వైమానిక దాడులు

- ఆరుగురు మృతి

సానా : యెమెన్ రెబెల్స్ నియంత్రణలో వున్న రాజధాని సానాపై అమెరికా జరిపిన వైమానిక దాడుల్లో ఆరుగురు మరణించగా, 26మంది గాయపడ్డారు. ఆదివారం రాత్రి ఈ దాడులు జరిగాయి. ఇదిలా వుండగా అమెరికాకు చెందిన ఎంక్యు రీపర్ డ్రోన్‌ను తాము కూల్చివేశామని హౌతి రెబెల్స్ తెలిపారు. నెల రోజుల క్రితం అమెరికా ఈ తరహాలో దాడులు ఆరంభించినప్పటి నుండి ఇప్పటివరకు 120మందికి పైగా మరణించారని హౌతి ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. రెండు వారాల్లో రెబెల్స్ జరిపిన నాల్గవ దాడి ఇది. స్థానికంగా తయారుచేసిన క్షిపణితోనే తాము ఆ డ్రోన్‌ను లక్ష్యంగా చేసుకున్నామని హౌతిలు తెలిపారు. ఇదిలావుండగా అమెరికా వైమానిక దాడులతో తలెత్తిన మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక యంత్రాలు నీటిని జల్లుతున్న దృశ్యాలను హౌతిలకు చెందిన ఉపగ్రహ వార్తా చానెల్ ప్రసారం చేసింది. ఆ ప్రాంతమంతా చెల్లా చెదురుగా శిధిలాలు పడి వున్నాయి. సానాలోని బని మటర్ ప్రాంతంలో గల సిరామిక్స్ ఫ్యాక్టరీపై దాడి జరిగిందని ఆ వర్గాలు తెలిపాయి. కాగా అమెరికా మిలటరీ సెంట్రల్ కమాండ్ మాత్రం ఈ దాడుల గురించి ప్రకటించలేదు. తాము దాడులు జరిపే లక్ష్యాలేమిటన్న సమాచారం కూడా అమెరికా సైన్యం ఇవ్వడం లేదు. ఇప్పటివరకు 200కి పైగా దాడులు జరిగాయని వైట్‌హౌస్ తెలిపింది.

అమెరికా సుంకాలతో

భారత ఆర్థిక వ్యవస్థకు ప్రమాదం



సదస్సులో మాట్లాడుతున్న పద్మ, వేదికపై డాక్టర్ బి.గంగారావు, కామేశ్వరరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఇటీవల అమెరికా పెంచిన సుంకాలతో భారత ఆర్థిక వ్యవస్థకు రానున్న రోజుల్లో ప్రమాదం ఏర్పడనుందని ప్రముఖ అర్థశాస్త్ర ఆచార్యులు డాక్టర్ కె.పద్మ అన్నారు. 'ట్రంప్ వాణిజ్య యుద్ధం - భారత్‌పై ప్రభావం' అన్న అంశంపై అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం సదస్సు నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం నిర్వహణ కమిటీ సభ్యులు కామేశ్వరరావు అధ్యక్షతన ఈ సదస్సు సాగింది. ముఖ్య వక్తగా హాజరైన పద్మ మాట్లాడుతూ.. ప్రస్తుతం అమెరికా అనుసరిస్తున్న విధానాలకు కారణాలను తెలియజేశారు. ట్రంప్ తాజా నిర్ణయాలతో ఉద్యోగ భద్రతకు ప్రమాదం ఏర్పడనుందన్నారు.

ప్రస్తుతం దేశాల మధ్య ఉన్న అంతరాల కారణంగా సుంకాల విధింపు ప్రారంభమైందని తెలిపారు. ఇటీవల అమెరికా పెంచిన సుంకాల ద్వారా స్టాక్ మార్కెట్లు పతనమై అమెరికా ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందన్నారు. సుంకాల పెంపు ద్వారా వాటిల్లే నష్టాలను తెలియజేశారు. సుంకాలు ఇలానే కొనసాగితే భారతదేశంలోని ఒక్క ఆక్వా రంగంలోనే 50 లక్షల మంది ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని, ఎంఎస్‌ఎంఇ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి వెళుతుందని చెప్పారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా అమెరికాకు ఎగుమతి అవుతున్న వస్తువులపై సుంకాలను పెంచి ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలను విచ్ఛిన్నం చేసేందుకు ట్రంప్ పన్నాగం పన్నారన్నారు. ముఖ్యంగా భారతదేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యేటటువంటి వస్తువులపై 35 శాతం ఎగుమతి సుంకాన్ని పెంచారని, తద్వారా భారతీయ వస్తువులను అమెరికా మార్కెట్లోకి రాకుండా చూస్తున్నారని తెలిపారు. భారత ప్రభుత్వం అమెరికాకు లొంగిపోయి దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టిందని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేసే విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు.

జడ్జిల నియామకానికి చట్టం తేవాలి

- ఎబిఎపి జాతీయ కార్యవర్గం తీర్మానం

ప్రజాశక్తి, అమరావతి

న్యాయవ్యవస్థలో బాధ్యతను, పారదర్శకతను పెంపుదల ఉండాలంటూ అఖిల భారతీయ అధివక్త పరిషత్ (ఎబిఎపి) జాతీయ కార్యవర్గం తీర్మానాలు చేసింది. ఎబిఎపి అధ్యక్షులు, సీనియర్ అడ్వకేట్ కె శ్రీనివాసమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశానికి దేశవ్యాప్తంగా పలువులు న్యాయవాదులు హాజరయ్యారు. చివరి రోజు సోమవారం ఎబిఎపి పలు డిమాండ్లను కేంద్రం, సుప్రీంకోర్టు ముందుంచింది. 'న్యాయ నియామక ప్రక్రియ, న్యాయమూర్తుల ప్రవర్తన పర్యవేక్షణ మరింత పారదర్శకంగా ఉండేందుకు వీలుగా కొత్త చట్టం తీసుకురావాలి. న్యాయవ్యవస్థకు ప్రధాన పాత్ర కల్పించాలి. కొత్త చట్టం అమల్లోకి వచ్చేంత వరకు ప్రస్తుతం ఉన్న కొలీజియం వ్యవస్థను కొనసాగించాలి. అయితే నియామకాలు మరింత పారదర్శకంగా ఉండేలా ముందస్తు పరిశీలన జరగాలి. న్యాయమూర్తులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించేందుకు వీలుగా సుప్రీంకోర్టు రిటైర్డు చీఫ్ జస్టిస్‌లు, హైకోర్టు చీఫ్ జస్టిస్‌లు, విశిష్ట వ్యక్తులతో సుప్రీంకోర్టు ఒక కమిటీని ఏర్పాటు చేయాలి. సుప్రీంకోర్టు న్యాయమూర్తి కుటుంబ సభ్యులు సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ చేస్తుంటే, ఆ జడ్జి రిటైర్ అయ్యే వరకు వాళ్ల సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ చేయకుండా చూడాలి' అని ఎబిఎపి తీర్మానాల్లో పేర్కొంది.

కరుణాకర్‌రెడ్డి ఆరోపణలు నిరాధారం

- టిటిడి ఇఒ శ్యామలరావు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

టిటిడి గోశాలలో గోవులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని టిటిడి ఇఒ జె శ్యామలరావు వెల్లడించారు. గోశాలలో వంద ఆవులు అనుమానాస్పదంగా మరణించాయని, టిటిడి ప్రతిష్టను దెబ్బతీసే ఉద్దేశంతో మాజీ టిటిడి ట్రస్ట్ బోర్డు చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి చేసిన ఆరోపణలు నిరాధారమైనవని పేర్కొన్నారు. గత పాలనలో జరిగిన అవకతవకలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టిటిడిలో ఒక్కొక్కటి సరిదిద్దుకుంటూ వస్తున్నామని చెప్పారు. సోమవారం టిటిడి పరిపాలనా భవనంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2021 మార్చి నుంచి 2024 మార్చి వరకు టిటిడి గోశాలలో పలు అక్రమాలు, అవకతవకలు జరిగాయని అప్పటి విజిలెన్స్ నివేదికలలో తేటతెల్లమవుతోందన్నారు. గోవులకు కాలం చెల్లిన మందులు, ఇచ్చినట్లు, పురుగులు పడ్డ దాణా, పాచిపట్టిన నీరు అందించారని, చనిపోయిన గోవుల వివరాలను నమోదు చేయలేదని టిటిడి విజిలెన్స్ నివేదికలలో నమోదైనా ఎలాంటి చర్యలు తీసుకోకుండా దాచిపెట్టారని విమర్శించారు. తీవ్ర వ్యాధులతో ఉన్న గోవుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. అప్పట్లో అధికారుల నిర్లక్ష్యం మూలంగా రెండుసార్లు గోశాలలో అగ్నిప్రమాదాలు జరిగాయని, దాణా, మందుల సరఫరా కాంట్రాక్టులోనూ భారీగా అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకున్నా వీటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పుడు వీటిపై చర్యలు చేపట్టామని తెలిపారు. గతంలో విజిలెన్స్ అధికారులను అనుమతించలేదని, ఇప్పుడు ఎవరైనా గోశాలకు వెళ్లి చూడవచ్చని, చాలా పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. టిటిడి గోశాలలో పాల ఉత్పత్తిలో గతం కంటే అదనంగా గోవులు పాలు ఇస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, టిటిడి డిప్యూటీ ఫారెస్ట్ ఆఫీసర్, ఇన్-చార్జ్ డైరెక్టర్ ఎస్‌పి గోశాల శ్రీనివాసులు, విజిఒ విజిలెన్స్ రామ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

రూ.49 కోట్ల రైట్ ఇష్యూకు రెమిడియం

ముంబయి : ఫార్మాస్యూటికల్ ఇంటర్మీడియెట్స్, స్పెషాలిటీ కెమికల్స్ తయారీ సంస్థ రెమెడియం లైఫ్ కేర్ లిమిటెడ్ ప్రతిపాదిత రైట్ ఇష్యూకు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ ఆమోదం తెలిపింది. ప్రస్తుత వాటాదారుల నుంచి వృద్ధి మూలధనాన్ని సమీకరించడానికి, సంస్థ కార్యకలాపాల విస్తరణకు ఈ నిధులు మార్గం సుగమం చేయనున్నాయని ఆ సంస్థ పేర్కింది. రైట్ ఇష్యూ ద్వారా రూ.49.19 కోట్ల నిధులు సమీకరించినట్లు వెల్లడించింది. తమ సంస్థ కార్యకలాపాలను విస్తరించడంతో పాటుగా వాటాదారుల విలువను పెంచడానికి తాము కట్టుబడి ఉన్నామని రెమిడియం లైఫ్ కేర్ హోల్ టైమ్ డైరెక్టర్ ఆదర్శ్ ముంజాల్ పేర్కొన్నారు.

డాక్టర్ రెడ్డీస్‌లో భారీగా ఉద్వాసనలు..!

హైదరాబాద్ : దిగ్గజ ఔషధ ఉత్పత్తుల కంపెనీ డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీస్ తన 25 శాతం మంది ఉద్యోగులను ఇంటికి పంపించనుందని తెలుస్తోంది. వ్యయాలను తగ్గించుకునే చర్యల్లో భాగంగా సిబ్బందిపై వేటు వేయనుందని ఓ ఆంగ్ల పత్రిక కథనం ప్రచురించింది. ముఖ్యంగా సంస్థలోని రీసర్చ్ అండ్ డెవలప్మెంట్ విభాగాల్లో పనిచేస్తున్న 50 నుంచి 55 సంవత్సరాల వయసున్న ఉద్యోగులకు కంపెనీ స్వచ్ఛంద పదవీ విరమణ ఆఫర్ చేసింది. అదే విధంగా వివిధ విభాగాల్లో ఏడాదికి రూ.1 కోటి జీతం పొందుతున్న అనేకమంది ఉద్యోగులను రాజీనామా చేయాలని సంస్థ ఇప్పటికే కోరినట్లు సమాచారం. 2024 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ ఆదాయం రూ.8,359 కోట్లకు చేరగా.. రూ.1,413 కోట్ల లాభాలు నమోదు చేసింది. కాగా.. 25 శాతం ఉద్యోగులను తొలగించనున్నామనే రిపోర్టుల్లో వాస్తవం లేదని డాక్టర్ రెడ్డీస్ రెగ్యూలేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది.

హామీలు మరచిన తెలంగాణ సర్కార్

- అడవులపై బుల్డోజర్లు ప్రయోగిస్తోంది
- మోడీ విమర్శలు


ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, అడవులపై బుల్డోజర్‌ను ప్రయోగించడంలో నిమగ్నమైందని ప్రధాని మోడీ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ప్రకృతిని నాశనం చేయడం, జంతువులను ప్రమాదంలో పడేసేలా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కాంగ్రెస్ పార్టీ అసలైన కార్యశైలీ అని ఆరోపలు గుప్పించారు. హర్యానాలో చెత్త నుండి గోవర్థన్ గిరీ తయారు చేసేందుకు కృషి చేస్తుంటే, తెలంగాణలోని కాంగ్రెస్ సర్కార్ అడవిని నాశనం చేస్తోందన్నారు. సోమవారం హర్యానాలోని హిసార్ ఎయిర్ పోర్ట్, ఇతర ప్రాజెక్ట్ లను ప్రధాని మోడీ ప్రారంభించారు. అనంతరం యమునా నగర్ లో ఏర్పాటు చేసిన బహిరంగ ర్యాలీలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ లో అక్కడి ప్రభుత్వాలు ప్రజల విశ్వాస ఘాతుకానికి పాల్పడుతున్నాయన్నారు. కర్ణాటకలో ఏకంగా అవినీతిలో కర్ణాటకను దేశంలోనే నెంబర్ వన్ గా నిలిపారు' అని ఆరోపించారు. బిజెపి కేవలం సత్యం ఆధారంగానే పాలన చేస్తోందన్నారు. అంబేద్కర్ సూచించిన దిశలో పరిపాలిస్తున్నట్లు వెల్లడించారు. రాజ్యాంగ గౌరవాన్ని పెంపొందించేలా ముందుకు వెళ్తోందన్నారు. వికసిత్ భారత్ చేసే కలను సాకారం చేసేందుకు కృషి చేస్తోన్నట్లు చెప్పారు.

17న 'పాడింగ్టన్ ఇన్ పెరూ' విడుదల

హాలీవుడ్ మూవీ 'పాడింగ్టన్ ఇన్ పెరూ' భారతదేశంలో ఈనెల 17న విడుదల కానుంది. వివిధ భాషల్లో ఈ సినిమా తాజా ట్రైలర్ విడుదలై ఆకట్టుకుంటోంది. ఇందులో అందరికీ ఇష్టమైన ఎలుగుబంటి పెరూ అడవుల గుండా తన గొప్ప సాహసయాత్రకు బయలుదేరినట్లు కనిపిస్తుంది. ఈ సిరీస్‌లో ఇది మూడోభాగం. ఇందులో సాహసం, రహస్యాలతో నిండివుంది. ప్రేమగల ఎలుగుబంటి అత్త లూసీ, ఎల్ డొరాడోలను వెతుకుతూ ప్రమాదకరమైన అడవులు, నదులు, పురాతన శిథిలాల గుండా ప్రయాణిస్తుంది. డౌగల్ విల్సన్ దర్శకత్వం వహించారు. సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా ఈ సినిమాను విడుదల చేస్తోంది.





1న 'హిట్ 3' విడుదల

కథానాయకుడు నాని ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'హిట్ 3'. ఈ సినిమాలో అర్జున్ సర్కార్‌గా పోలీసు పాత్రలో నాని నటించాడు. మే 1న విడుదల కానున్న ఈ సినిమా నుంచి ట్రైలర్‌ను మేకర్లు విడుదల చేశారు. మలయాళంలో గతేడాది వచ్చిన 'మార్కో' సినిమాకు మించిన వయలెన్స్ హిట్-3 ఉంటుందని సమాచారం. ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు చెప్పిన వ్యాఖ్యలను నాని పాత్రకు కలుపుతూ ఎలివేషన్స్ ఇచ్చారు. ఈ సినిమాకు శైలేష్ కొలను దర్శకుడు. శ్రీనిధిశెట్టి కథానాయిక. ఇప్పటికే ఈ సినిమా సెన్సార్ పూర్తిచేసుకొని ఎ సర్టిఫికెట్ పొందింది.

'దైరా' ప్రాజెక్టులో పృథ్వీరాజ్



'లూసిఫర్ 2 : ఎంపురాన్' చిత్రం తర్వాత మరో కొత్త ప్రాజెక్టులోకి పృథ్వీరాజ్ సుకుమారన్ వెళ్లిపోయారు. మేఘనా గుల్జార్ తెరకెక్కిస్తున్నారు. పాన్ ఇండియా చిత్రంగా తెరకెక్కుతోంది. ఆయనకు జోడీగా కరీనా కపూర్ నటిస్తున్నారు. శక్తివంతమైన పోలీస్ ఆఫీసర్ పాత్రలో ఆమె నటించబోతున్నారు. వాస్తవ సంఘటనలు ఆధారంగా ఈ సినిమాను మేఘనా గుల్జార్ తెరకెక్కించనున్నారు. ఆమె ఇప్పటికే రాజీ, చపాక్, సామ్‌బహదూర్ వంటి సినిమాలను తెరకెక్కించి బాలీవుడ్‌లో మంచి విజయాలను అందుకున్నారు. కాల్‌షీట్స్ లేని కారణంగా ఆయుష్మాన్ ఖురానా, సిద్ధార్థ్ మల్హోత్రా ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారు. దీంతో పృథ్వీరాజ్, కరీనాకపూర్ ఎంట్రీ ఇచ్చారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని 24న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు

- బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహారావు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

భవన నిర్మాణ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 24న రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తామని ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అర్‌వి నర్సింహారావు తెలిపారు. సోమవారం ఆయన విజయనగరంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటామని, అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ బోర్డును పురుద్ధరిస్తామనిఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోవడం అన్యాయమన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్‌తో 35 మందికి అస్వస్థత

- అవంతి సిబ్బందికి గోప్యంగా వైద్యం

ప్రజాశక్తి- ఏలేశ్వరం (కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలోని అవంతి ఫ్రోజన్ ఫుడ్స్ ఫ్యాక్టరీలో ఆహారం కలుషితమై 35 మంది అస్వస్థతకు గురయ్యారు. ఫ్యాక్టరీ యాజమాన్యం సమీపంలోని ఏలేశ్వరం ఆస్పత్రికి కాక జగ్గంపేటలోని శ్రీరామచంద్ర హాస్పిటల్‌కు తరలించి గోప్యంగా వైద్యం చేయిస్తోంది. ఫ్యాక్టరీ ప్రొడక్షన్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న 30 మందితోపాటు ఐదుగురు క్యాంటీన్ సిబ్బంది గత శుక్రవారం రాత్రి విరోచనాలు, వాంతులతో అనారోగ్యం పాలయ్యారు. పెద్ద ఎత్తున కార్మికులు అస్వస్థత పాలయ్యారని తెలుసుకున్న విలేకరులు వివరాల కోసం సోమవారం ఫ్యాక్టరీ వద్దకు వెళ్లగా లోపలికి అనుమతించలేదు. ఈ నేపథ్యంలోనే జగ్గంపేటలో కార్మికులు చికిత్స పొందుతున్న ఆస్పత్రిలోనికి సైతం విలేకరులను అనుమతించలేదు. ఈ విషయాన్ని విలేకరులు జిల్లా వైద్యాధికారులకు తెలపడంతో జగ్గంపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను డిఎంహెచ్ఒ నరసింహనాయక్, జిల్లా ఫుడ్ కంట్రోల్ అధికారి జి.శ్రీనివాసరావు పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ కార్మికులు శుక్రవారం ఉదయం చట్నీతో ఇడ్లీ, మధ్యాహ్నం గుత్తి వంకాయ కూర, రాత్రి దోసకాయ కూరతో భోజనం చేశారని తెలిపారు. శుక్రవారం రాత్రి అస్వస్థత గురికావడంతో ఆస్పత్రిలో చేరగా చికిత్స పొంది కొంతమంది ఇంటికి డిశ్చార్జి కాగా, ఇంకా 12 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఫ్యాక్టరీ, కిచెన్ లైసెన్సులు పొంది ఉన్నందున శాంపిల్ సేకరించి ల్యాబ్‌కు పంపి పరీక్షలు నిర్వహించి తగు చర్యలు చేపడతామని తెలిపారు.

గోదావరిలో ఇద్దరు యువకులు గల్లంతు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నిడదవోలు చెంచుపేటకు చెందిన ప్రవీణ్ (15), హర్ష(18) విజ్జేశ్వరం సమీపంలోని సీతంపేట మద్దూరులంక బ్యారేజ్ దగ్గర గోదావరిలో ఈతకు దిగి గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. లోతు ఎక్కువగా ఉండటంతో వారి జాడ తెలియలేదు. గాలింపు కొనసాగుతోంది. ఈ ఘటనపై మంత్రి దుర్గేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రవీణ్ పదో తరగతి, హర్ష ఇంటర్ పరీక్షలు రాశారు. మరికొంతమంది యువకులతో కలిసి స్నానానికి దిగారు. ప్రమాదవశాత్తూ గల్లంతయ్యారు.

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్‌జెడి, కాంగ్రెస్ పొత్తు

న్యూఢిల్లీ : ఈ ఏడాది చివరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఇండియా బ్లాక్‌లో భాగస్వామ్య పార్టీలైన ఆర్‌జెడి, కాంగ్రెస్‌లు కలిసి పోటీ చేయనున్నాయి. ఈ విషయాన్ని ఆర్‌జెడి ఎంపి మనోజ్ ఝా సోమవారం వెల్లడించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై ఆర్‌జెడి నేత తేజస్వియాదవ్ ఢిల్లీకి వెళ్లి మంగళవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో చర్చించనున్నారని మనోజ్ ఝా తెలిపారు. కాగా, ఆర్‌జెడి, కాంగ్రెస్ పార్టీల పొత్తుల నేపథ్యంలోనే బహుశా ఏప్రిల్ 20న బీహార్‌లో బక్సర్ జిల్లాలో జరిగే బహిరంగ సభలో ఖర్గే పాల్గొనే అవకాశం ఉంది.

నాలుగు కోట్లు ఎందుకు తీసుకున్నానంటే.. : వినేశ్ ఫోగట్

చండీగఢ్ : మాజీ రెజ్లర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే వినేశ్ ఫోగట్‌కు హర్యానా ప్రభుత్వం గతేడాది ఒలింపిక్స్‌లో పాల్గొన్నందుకు నాలుగు కోట్ల రూపాయల ప్రైజ్‌మనీని ప్రకటించింది. ప్రభుత్వం ఇస్తున్న ఆ డబ్బును తీసుకుంటున్నందుకు సోషల్ మీడియాలో ట్రోల్స్ మొదలయ్యాయి. వీటిపై తాజాగా వినేశ్ స్పందించారు. 'ట్వీట్‌కు 2 రూపాయలకు ఆశపడిన కొందరు పనిగట్టుకుని మరీ నన్ను ట్రోల్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో నాపై విషం చిమ్ముతున్న వాళ్లకు నేను చెప్పేది ఒక్కటే. నేను ఎవరి వద్ద పైసా ఆశించను. సాఫ్ట్ డ్రింక్స్ నుంచి ఆన్‌లైన్ గేమింగ్ వంటి ప్రకటనల్లో నటిస్తే భారీగా డబ్బులు ఇస్తామని యాడ్స్ ఏజెన్సీలు నన్ను సంప్రదించాయి. కానీ నాకంటూ కొన్ని సిద్ధాంతాలు ఉన్నాయి. నేను కొన్ని విలువలకు కట్టుబడి ఉన్నాను. డబ్బులు వస్తున్నాయని చెప్పి.. ప్రజలకు, సమాజానికి హాని చేసే పనులు చేయను. ఇప్పటివరకూ నేను సాధించిన విజయాలు నా కష్టార్జితం. నిజాయితీగా ఉండడంతోపాటు నా ఆత్మీయుల ఆశీర్వాదం వల్లనే ఈస్థాయికి చేరుకున్నాను.' అని అన్నారు.

గ్రాసం కరువు...పోషణ బరువు

- గడ్డి కొరతతో రైతుల అవస్థలు
- ట్రాక్టర్ పశుగ్రాసం రూ.25 వేలు పైమాటే
- సబ్సిడీపై దాణా పంపిణీ చేయాలంటున్న పాడి రైతులు



ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పశుగ్రాసం కొరతతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఈసారి వంటలు సరిగా పండకపోగా కొండగుట్టల్లోనూ తరచూ అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోవడంతో గ్రాసం కొరత పట్టిపీడిస్తోంది. దీనికి తోడు పశుగ్రాసం ధర కొండెక్కి కూర్చోవడంతో అంత ధర పెట్టి కొనలేక చాలా మంది పాడి రైతులు జీవాలను అమ్ముకుంటున్నారు. కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలో గ్రాసం కొరత తీవ్రమైంది. దీంతో పశు పోషకులు, జీవాల పెంపక దారులు వాటి పోషణకు అవస్థలు పడుతున్నారు. వ్యవసాయం కంటే అధికంగా రైతులు, కూలీలు సన్న జీవాలు (గొర్రెలు, మేకలు), పాడి పశువుల పెంపకం పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అధిక ధరలకు గ్రాసం కొనలేక పలువురు పాడి రైతులు జీవాలను అమ్మేసుకుంటుండగా చాలా మంది అతికష్టంమీద పశు పోషణ చేస్తున్నారు. పులివెందుల నియోజకవర్గంలో 4390 పాడి రైతులు ఉన్నారు మండలాల వారీగా చూస్తే చక్రాయపేట 960, లింగాల 650, సింహాద్రిపురం 630, పులివెందుల 530, వేముల 520, తొండూరు 410, వేంపల్లి 660 మంది పాడి పై ఆధారపడి ఉన్నారు. గతంలో రైతులు పసుపు పోషణ కోసం వేరుశనగ, జొన్న, కొర్ర తదితర పంటలు సాగు చేసేవారు, కానీ ఈ పంటల సాగు చేయడానికి ఖర్చులు అధి కమవు తుండడంతో ఈ పంటలు వేయ డానికి రైతులు ఇష్టపడడం లేదు.

ప్రతి ఏటా ఇదే దుస్థితి

వేసవి రాగానే పొలం గట్లు, సమీప కొండగుట్టలు అగ్నికి ఆహుతి కావడం సర్వసాధరణమైపోయింది. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి నెలకొంది. ఎండు గడ్డిని కాల్చివేసే ఉద్దేశంతో పొలం గట్లకు నిప్పు పెట్టేవారు కొందరైతే.. మరికొందరు పశువుల కాపరులు బీడీ కాల్చి ఆర్పకుండా పడేస్తుండటంతో మంటలు వ్యాపించి పాలంగట్లు, గుట్టల్లో గ్రాసం పూర్తిగా కాలిపోయి పశువులకు మేత దొరకని పరిస్థితి నెలకొంది, ఇటీవలి కాలంలో పలుచోట్ల అగ్ని ప్రమాదాల్లో మామిడి, చింత చెట్లు, నిమ్మకాయ చెట్లు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు.

గ్రాసం ధరకు రెక్కలు

ఒక ట్రాక్టర్ వేరుశనగ కట్ట ధర రూ.25 వేలపైగా ధర పలుకుతున్నట్లు పశువుల యజమానులు చెబుతున్నారు. అదికూడా సుదూర ప్రాంతాల్లో ఎక్కడ లభ్యమైతే అక్కడికి వెళ్లి కొనుగోలు చేసి తీసుకురావాల్సి వస్తోందని వాపోతున్నారు. దీంతో అదనంగా రవాణా ఖర్చులతో పాటు వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. గ్రాసం కొరత తీవ్రస్థాయిలో నెలకొని పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నా పశుపోష కులను అదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోడం బాధాక రమని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్సిడీపై గ్రాసం పంపిణీ చేస్తే తమకు ఎంతో ఊరటగా ఉంటుందని రైతులు చెప్తున్నారు.సబ్సిడీపై దాణా పంపిణీ చేసే విషయం పై ప్రభుత్వం నుంచి ఇంతవరకూ మాకు ఎలాంటి సమాచారం లేదు. ప్రస్తుతం పశు బీమా కార్యక్రమం జరుగుతోంది. సబ్సిడీపై పశుగ్రాసం పంపిణీ పై ప్రభుత్వం నుంచి ఏదైనా సమాచారం అందితే వెంటనే పశువుల యజ మానులకు తెలియ పరుస్తామని అధికారులు చెప్తున్నారు.

గ్రాసం లేక ఇబ్బందులు

బీడు పొలంలో గొర్రెలను మేపుదామంటే ఎక్కడా గడ్డిపోచ కూడా లేదు. పొద్దన్నే కొద్దిసేపు జీవాలను అట్లా తిప్పుకొనిరావడం, ఎండ పడగానే చెట్ల కింద నీడన తోలుకోవడం చేస్తున్నా. మేత లేకపోవడంతో గొర్రెలు కాయడం చాలా కష్టమైపోయింది.

రాయితీపై దాణా ఇవ్వాలి

పశుగ్రాసం కొందమంటే ఒక ట్రాక్టర్ వేరుశనగ కట్టె రూ.25 వేలు పైగా ధర చెబుతున్నారు. గ్రాసం కొని జీవాలు మేపే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం స్పందించి పశుపోషకులకు రాయితీపై దాణా పంపిణీ చేయాలి.

- రామచంద్ర, పాడి రైతు, పులివెందుల

పసుపు పోషణ భారం అవుతుంది

పశుగ్రాసం పెరిగింది పశుపు పోషణ భారం అవుతుంది. వ్యవసాయంలో నష్టాలు వస్తుండడంతో ప్రత్యామ్నాయంగా పాడి పరిశ్రమ ఎంచుకున్నాను ఎనిమిది సంవత్సరాల నుంచి నాలుగు పాడి పశపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాను. పశువుల పోషణకు నెలకు ఒక ట్రాక్టర్ వరిగడ్డి రూ. 25 వేలు అవుతుంది పశుగ్రాసం విపరీతంగా దాణా, గ్రాసం ధరలు పెరగడం వల్ల పశువుల పోషణ భారం అయిందని అమ్మేశాం.

-రాచమల్లు నాగవేణి , బోనాల గ్రామం, లింగాల మండలం

గన్నెవారిపల్లిలో లోవోల్టేజీ సమస్య..!

- ఫ్యాన్ కూడా తిరగని పరిస్థితి
- ఏడాది నుంచి వేధిస్తున్న సమస్య
- అధికారులకు చెబుతున్నా పరష్కారం కాని వైనం

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

విద్యుత్ లైన్ లోవోల్టేజీ కారణంగా తాడిపత్రి సమీపంలోని కడప రోడ్డు గన్నెవారిపల్లి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని లైన్‌మెన్ నుంచి డిఈ స్థాయి అధికారి వరకు అందరికీ గత సంవత్సరం నుంచి విన్నవిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ కాలనీవాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లైన్ ఉన్నా లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు తప్పడం లేదు. 20 రోజుల కిందట ఇద్దరు విద్యుత్ అధికారులు వచ్చి అక్కడున్న ఇళ్లు, విద్యుత్ స్తంభాల మీదున్న లైన్లను పరిశీలించి వెళ్లారు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని కాలనీవాసులకు చెప్పారు. అలా చెప్పి వెళ్లిన అధికారులు మళ్లీ తిరిగిరాలేదు. జిల్లా అధికారులపై నమ్మకం లేక కాలనీవాసులు ఆన్‌లైన్ ద్వారానూ విద్యుత్ లోవోల్టేజ్ సమస్యను తిరుపతి విద్యుత్ ప్రధాన కార్యాలయానికి ఫోన్ ద్వారా తెలియజేశారు. అక్కడి నుంచి కూడా స్పందన రాలేదు. ఇంత మంది అధికారులకు చెబుతున్నా సమస్య పరిష్కారం కాకపోతే తమ మొర ఎవరికి చెప్పుకోవాలంటూ గన్నెవారిపల్లి కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోవోల్టేజ్‌తో ఇళ్లలో ఫ్యాన్ కూడా తిరగడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక విద్యుత్ ద్వారా ఉపయోగించే యంత్రాలు అసలుకే పనిచేయడం లేదు. ఇన్వర్టర్ వేస్తేనే ఇంట్లో ఫ్యాన్ తిరిగే పరిస్థితి ఉంది. కాలనీలో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన తీగలు కూడా కిందకు వేలాడుతూ చేతికందే ఎత్తులో ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి లోవోల్టేజీ సమస్యను తీర్చాలని గన్నెవారిపల్లి కాలనీవాసులు కోరుతున్నారు.

12న ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరిలో పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో మే 12న నిర్వహించే మిస్టర్ ఆంధ్ర క్లాసిక్ స్పోర్ట్స్, బాడీ బిల్డింగ్, మాస్టర్స్ ఛాంపియన్‌షిప్- 2025 పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ రాష్ట్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించే ఈ పోటీల్లో అన్ని జిల్లాలలో నుండి బాడీబిల్డర్లు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి డిస్టిక్ బాడీ బిల్డింగ్, ఫిట్నెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు, లోటస్ జిమ్ నిర్వాహకులు రమేష్, లోటస్ జిప్ సభ్యులు సురేష్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి,హనీస్, అతావుల్లా,అద్దూ, లక్కీ, అబ్దుల్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ వైద్య సేవలో భరోసా కరువు..!

- పథకం వర్తించినా అందని వైద్యం
- ప్రసవాలు, ఎముకలు, కిడ్నీ వ్యాధుల్లో పరిస్థితి మరింత దారుణం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పేదోడి ఆరోగ్యానికి ఎన్‌టిఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) పథకం భరోసా ఇవ్వని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఎన్‌టిఆర్ వైద్యసేవలో నిర్ధేశించిన రోగాలకు సైతం నెట్‌వర్క్ ఆసుపత్రులు పెద్దఎత్తున సొమ్ము వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. దీంతో సామాన్య ప్రజానీకానికి ఏం చేయాలో అర్థం కాక అప్పులు తెచ్చి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రాణాపాయ పరిస్థితుల్లో అదనంగా డబ్బులిస్తేనే చేర్చుకుంటామంటూ ఎన్‌టిఆర్ వైద్యసేవలోని నెట్‌వర్క్ ఆసుపత్రులు రోగుల బంధువులను బెదిరించి మరీ జేబులు గుల్ల చేస్తున్న పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లాలో 31, పశ్చిమగోదావరి జిల్లాలో 23 ప్రయివేటు ఆసుపత్రులు ఎన్‌టిఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రులుగా ఉన్నాయి. కంటి ఆపరేషన్లు, కిడ్నీ, ఎముకలు, కేన్సర్, గుండె ఇలా అనేక రోగాలకు 'ఎన్‌టిఆర్ వైద్యసేవ'లో చికిత్స అందించాల్సి ఉంది. ప్రతినెలా పెద్దఎత్తున సర్జరీలు జరుగుతున్నాయి. అయితే ఉచితంగా మాత్రం జరగడం లేదనేది మాత్రం వాస్తవం. సంబంధిత వ్యాధులకు ప్రభుత్వం నిర్ధేశించిన రుసుములకు అంగీకరించిన ఆసుపత్రులే ఎన్‌టిఆర్ వైద్యసేవ నెట్‌వర్క్



ఆసుపత్రుల జాబితాలో ఉంటాయి. అయినప్పటికీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్యసేవ పథకం సరిగ్గా అమలు కాని పరిస్థితి ఉంది. ఎన్‌టిఆర్ వైద్యసేవలో రోగిని చేర్చుకున్నా భారీగా సొమ్ము వసూలు చేస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా రోగులు, వారి బంధువులు ఫిర్యాదు చేయకుండా తామేమీ చేయలేమంటూ ఎన్‌టిఆర్ వైద్యసేవా విభాగం చేతులెత్తేసోంది. దీంతో నెట్‌వర్క్ ఆసుపత్రులు 'ఆడిందే ఆట.. పాడిందే పాట' అన్నట్లు పరిస్థితి తయారైంది. నిబంధనల ప్రకారం ఎన్‌టిఆర్ వైద్యసేవలో వర్తించే రోగానికి ఓపి నుంచి అన్ని టెస్టులూ ఉచితంగానే చేయాలి. ఒకవేళ ముందుగా ఏమైనా టెస్టులు చేసి డబ్బులు తీసుకుంటే ఎన్‌టిఆర్ వైద్యసేవ వర్తింపజేసిన తర్వాత ఆ సొమ్ము తిరిగిచ్చేయాలి. ఏఒక్క ఆసుపత్రిలోనూ ఇది జరగడం లేదు. అక్కడ పని చేసే ఆరోగ్యమిత్రలు సైతం ఆసుపత్రుల నిరకుంశ వైఖరిని ఎదిరించలేని పరిస్థితి కనిపిస్తోంది. రోగి బంధువులు డబ్బు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేసినప్పటికీ వారు తీసుకునే చర్యలు పెద్దగా కన్పించడం లేదు. ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి రోగి బంధువులను దారికి తెచ్చే ప్రయత్నాలు సాగుతున్నాయి.

నెట్‌వర్క్ ఆసుపత్రుల దోపిడీని నిరోధించే వ్యవస్థ కరువు

ఎన్‌టిఆర్ వైద్యసేవలోని అత్యధిక ఆసుపత్రుల్లో వసూళ్లప ర్వం నిర్విరామంగా సాగుతోంది. దీన్ని కఠినంగా నిరోధించే వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయడం లేదు. కొనఊపిరితో తీసుకొచ్చిన రోగి బంధువులను మానసికంగా ఇబ్బంది పెట్టి వసూళ్ల దందా సాగిస్తున్నారు. ప్రశ్నిస్తే రోగి ప్రాణానికి ముప్పు వాటిల్లుతుందనే భయం కుటుంబీకులను వెంటాడుతోంది. దీంతో అప్పు చేసి మరీ ఆసుపత్రులకు చెల్లిస్తున్నారు. అటువంట ప్పుడు ఎన్‌టిఆర్ వైద్యసేవ ట్రస్ట్ ఉండి ఏమిటి ప్రయోజనం అనే చర్చ జనంలో నెలకొంది. ఎన్‌టిఆర్ వైద్యసేవలో రోగి బంధువుల నుంచి డబ్బు వసూలు చేసినా, వైద్యం అందించబోమని నిరాకరించినా కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం సరికొత్త వ్యవస్థను తీసుకురావాల్సి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందో, లేదో వేచిచూడాలి.



సదస్సులో మాట్లాడుతున్న ధనలక్ష్మి

ఒప్పంద జిఒలను అమలు చేయాలి

- ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి ధనలక్ష్మి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

వైద్య, ఆరోగ్య సేవల్లో కీలకంగా పనిచేస్తోన్న ఆశా కార్యకర్తలకు పనికి తగిన వేతనంతోపాటు గతంలో ఇచ్చిన ఒప్పంద జిఒలను తక్షణమే అమలు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఏర్పడి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 'ఆశా వర్కర్లు సాధించిన విజయాలు - సవాళ్లు' అనే అంశంపై శ్రీకాకుళంలోని యుటిఎఫ్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించి వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు ఆరోగ్య సేవలందిస్తోన్న ఆశా వర్కర్లను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. జాతీయ ఆరోగ్య మిషన్ స్కీమ్ ఏర్పడి 20 ఏళ్లు పూర్తయినా ఆశాలకు కనీస వేతనాలు చెల్లించడం లేదని అన్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో చాలామంది ఆశా వర్కర్లు మృతి చెందినా, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఆశా వర్కర్లకు రూ.పది లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తోన్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని కోరారు. ఏడేళ్ల కాలంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆశాలకు రూ.వెయ్యి మాత్రమే వేతనం పెంచిందని, గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పెంచలేదని తెలిపారు. వైద్య, ఆరోగ్య రంగానికి నిధుల కేటాయింపులు నానాటికీ తగ్గుతున్నాయని, ప్రజారోగ్యానికి భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ వేధింపులతో ఆశాలను తొలగించేందుకు చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నట్లు గుర్తు చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి సమిష్టిగా పోరాడాలని కోరారు. మేడే దినోత్సవాన్ని పోరాట స్ఫూర్తితో నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లుగా మార్పు చేయడం వల్ల కార్మికుల మెడకు ఉరితాడులా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులను కట్టు బానిసలుగా మార్చే వీటికి వ్యతిరేకంగా మే 20న దేశవ్యాప్త సమ్మెలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సదస్సులో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, ప్రధాన కార్యదర్శి జి.అమరావతి, నాయకులు పి.జయలక్ష్మి, లావణ్య, రాకోటి.సుజాత, పార్వతి, సుధ తదితరులు పాల్గొన్నారు.

కల్లలవుతున్న అమెరికా కలలు

- తాజా ఇమ్మిగ్రేషన్ నిబంధనలతో భారతీయుల బేజారు

న్యూఢిల్లీ : ఇమ్మిగ్రేషన్‌పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు భారతీయులకు అశనిపాతంగా మారుతున్నాయి. వారి అమెరికా కలలు గాలిమేడలుగా కూలిపోతున్నాయి. మే నెలకు సంబంధించి అమెరికా విదేశాంగ శాఖ తాజాగా జారీ చేసిన వీసా బులెటిన్‌తో వారి ఆశలన్నీ ఆవిరై పోయాయి. ముఖ్యంగా హెచ్-1బీ వీసాలు, గ్రీన్‌కార్డులు కోరుకుంటున్న వారి నెత్తిన పిడుగు పడింది. ఉపాధి ఆధారిత ఐదో ప్రాధాన్యత (ఈబీ-5) కేటగిరీ కింద కటాఫ్ తేదీలో చేసిన మార్పులతో భారతీయులు ఖంగుతిన్నారు. ఈ బులెటిన్ ప్రకారం...భారతీయులకు ఈబీ-5 అన్ రిజర్వ్‌డ్ కేటగిరీ వీసా జారీ కటాఫ్ తేదీ ఆరు నెలల పాటు (2019 మే 1 వరకూ) వెనక్కి పోయింది. మరోవైపు చైనీయులకు ఇదే వీసా కటాఫ్ తేదీ 2014 జనవరి 22 వద్దే నిలిచిపోయింది.

'ఈబీ-5 అన్ రిజర్వ్‌డ్ వీసా కేటగిరీలలో భారతీయుల నుండి ఎక్కువ డిమాండ్ వస్తోంది. మిగిలిన ప్రపంచ దేశాల నుండి కూడా ఎక్కువ మంది ఈ కేటగిరీ కింద దరఖాస్తులు చేస్తున్నారు. దీంతో భారత్ కటాఫ్ తేదీని మరింత తగ్గించాల్సిన అవసరం ఏర్పడింది' అని ఆ బులెటిన్‌లో వివరించారు. కాగా ఉపాధి ఆధారిత తొలి ప్రాధాన్యత (ఈబీ-1), ద్వితీయ ప్రాధాన్యత (ఈబీ-2) కటాఫ్ తేదీలలో ఎలాంటి మార్పులు చేయలేదు. మూడో ప్రాధాన్యత (ఈబీ-3) కేటగిరీ కింద భారత కటాఫ్ తేదీని రెండు వారాలు ముందుకు జరిపి 2013 ఏప్రిల్ 15వ తేదీగా నిర్ణయించారు. '2025 ఆర్థిక సంవత్సరంలో కుటుంబ సభ్యులు స్పాన్సర్ చేసే వలసవాదుల సంఖ్యను 2,26,000గా నిర్ణయించడం జరిగింది. వార్షిక ఉపాధి ఆధారిత ఇమ్మిగ్రెంట్ల సంఖ్యను 1,40,000గా నిర్ణయించాం' అని విదేశీ మంత్రిత్వ శాఖ బులెటిన్ తెలిపింది.

కటాఫ్ తేదీ అంటే...

అమెరికా విదేశాంగ శాఖ ప్రతి నెలా వీసా బులెటిన్ విడుదల చేస్తుంది. వివిధ దేశాల వారికి వీసా లభ్యతకు సంబంధించిన కటాఫ్ తేదీలను అందులో తెలియజేస్తుంది. ఏ అభ్యర్థులు తమ వీసా స్టేటస్ సర్దుబాటుకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులో లేదా శాశ్వత నివాసానికి అర్హులో ఆ తేదీని బట్టే నిర్ణయిస్తారు. తాజాగా విడుదల చేసిన బులెటిన్‌లో పేర్కొన్న కటాఫ్ తేదీకి ముందున్న ప్రాధాన్యతా తేదీతో దరఖాస్తు చేసుకున్న వారికి శాశ్వత నివాసానికి అర్హులుగా గుర్తిస్తారు. నిర్దిష్ట నెలలో అందుబాటులో ఉన్న వీసాల కంటే ఏదైనా కేటగిరీ కింద ఎక్కువ దరఖాస్తులు వచ్చినా లేదా ఏదైనా దేశం నుండి ఎక్కువ దరఖాస్తులు వచ్చినా వీసా కటాఫ్ తేదీని తగ్గిస్తారు.

ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత...

డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆ దేశ రాజకీయాలలో ఇమ్మిగ్రేషన్ మరోసారి కీలక అంశంగా మారింది. 'అమెరికా ఫస్ట్' అనే రిపబ్లికన్ల అజెండా నేపథ్యంలో అమెరికాలో ఎవరు, ఏ పరిస్థితులలో ప్రవేశించవచ్చు, ఎంతకాలం ఉండవచ్చు అనే విషయాలపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. అక్రమ వలసదారులపై ట్రంప్ ప్రభుత్వం ఇప్పటికే ఉక్కుపాదం మోపి, వారిని స్వదేశాలకు సాగనంపుతోంది.

కొట్నూరు గ్రామ కంఠం భూమి కబ్జా.!

- ప్రధాన రహదారి పక్కన రూ.కోట్లు విలువైన భూమిలో నిర్మాణాలు
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

గ్రామ కంఠం భూమిని గ్రామానికి చెందిన ఉమ్మడి స్థలంగా కేటాయిస్తారు. ఇది గ్రామంలో నివసించడానికి, సామాజిక కార్యక్రమాలు నిర్వహిణకు వినియోగించుకుంటారు. ఇలా గతంలో కొట్నూరు గ్రామానికి కేటాయించిన గ్రామ కంఠం భూమి ఇప్పుడు కబ్జాకు గురైంది. ఈ భూమి ఎక్కడ అంటూ అధికారులే దాని గురించి సర్వే చేయించాల్సిన పరిస్థితి తలెత్తింది. గతంలో సర్వే నెంబర్ 259-1లో ఉన్న సుమారు 1.8 ఎకరాల భూమిని గ్రామ కంఠం కోసం కేటాయించారు. ఈ భూమిలో రహదారి విస్తీర్ణం కోసం, రస్తా కోసం సుమారు 32 సెంట్లు స్థలం పోయింది. మిగిలిన భూమిపై కొంతమంది కన్ను పడింది. కోట్లు విలువ చేసే భూమిని ఎలాగైనా సొంతం చేసుకోవాలని పక్కా ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు. అవినీతి రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ అండదండలతో విలువైన స్థలం కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. గ్రామ కంఠ భూమి అని తెలిసినప్పటికీ రెవెన్యూ అధికారులు ఎంజాయ్మెంట్ పట్టాలు సైతం మంజూరు చేసింది. ఇందులో కొంతమంది పక్కా భవనాలు సైతం నిర్మాణం చేసుకున్నారు. మరి కొంతమంది ఖాళీగానే పెట్టుకున్నారు. రెవెన్యూ అధికారులు చేసిన తప్పులే మున్సిపల్ అధికారులు చేయలేదు. మిగిలిన స్థలాన్ని ఎలాగైనా కాపాడుకోవాలని గతంలో ఇక్కడ పనిచేసిన మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు సర్వే నంబర్ 259-1సి లో ఉన్న



18 సెంట్లు స్థలం పురపాలక సంఘానికి చెందినదిగా గుర్తించి బోర్డుని ఏర్పాటు చేశారు. కమిషనర్ బదిలీ అయ్యేంత వరకు ఆ స్థలం జోలికి ఎవరూ వెళ్లలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి కన్ను ఆ స్థలంపై పడింది. దీంతో నాటిన బోర్డును గుట్టు చప్పుడు కాకుండా అక్కడ నుంచి తొలగించారు. ఎలాగైనా ఆ స్థలాన్ని కబ్జా చేసుకోవాలనుకున్న ఆ నాయకుడు గత నెల స్థలంలో షెడ్ల నిర్మాణాలను చేపట్టడానికి పనులను ప్రారంభించారు.

దీంతో కొంత మంది మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే స్పందించి మున్సిపల్ సిబ్బందికి అక్కడికి పంపించి పనులను ఆపించారు. నెల తిరిగే లోపు మళ్లీ అదే స్థలంలో అదే నాయకుడు షెడ్ల నిర్మాణాలు చేసుకోవడానికి పనులను ప్రారంభించారు. కోట్లు విలువజేసే పురపాలక సంఘానికి చెందిన స్థలంగా గుర్తించిన అధికారులు, వెంటనే స్థలానికి కంచె వేసి స్థలాన్ని తమ ఆధీనంలో తీసుకోవాల్సి ఉంది. ఇలాంటి వేమీ చేపట్టకుండా వదిలివేయడంతో ఆ స్థలం మళ్లీ కబ్జాకు గురైంది. ఈ స్థలంతో పాటు గ్రామ కంఠానికి సంబంధించిన కోట్లు విలువైన స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కొట్నూరు గ్రామ ప్రజలు కోరుతున్నారు.

మార్చిలో ఎగబాకిన చైనా ఎగుమతులు


- 12.4 శాతం పెరుగుదల
- 'రాయిటర్స్' అంచనాలను మించి నమోదు
- వాణిజ్య మిగులు 102 బిలియన్ డాలర్లకు పైనే

బీజింగ్ : ప్రపంచ దేశాలతో పోల్చుకుంటే ఎగుమతుల విషయంలో సాధారణంగా చైనా ఆధిపత్యం ఉంటుంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను కలిగి ఉన్న చైనాకు వెన్నుదన్నుగా నిలిచేది ఆ దేశ ఎగుమతులు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల రగడకు ముందు మార్చి నెలలో చైనా ఎగుమతులు పెరిగాయి. అంచనాలను మించి 12.4 శాతం పెరుగుదలను నమోదు చేసిందని 'రాయిటర్స్' వివరించింది.

ఈ సమాచారం ప్రకారం.. గతేడాదితో పోలిస్తే మార్చిలో చైనా ఎగుమతులు 12.4 శాతం పెరిగాయి. ఆర్థికవేత్తల రాయిటర్ పోల్‌లో అంచనా వేసిన 4.4 శాతం వృద్ధిని ఇది సులభంగా అధిగమించింది. జనవరి-ఫిబ్రవరిలో ఎగుమతులు 2.3 శాతం పెరిగాయి. మార్చి నెలలో చైనా వాణిజ్య మిగులు 102.64 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో రూ.8.83 లక్షల కోట్లకు పైనే)గా ఉన్నది. ఇక ఇన్‌బౌండ్ షిప్‌మెంట్లు 4.3 శాతం తగ్గాయి. అయితే, రాయిటర్ పోల్‌లో ఈ తగ్గుదలను అంచనా 2.0 శాతంగా అంచనా వేశారు. ప్రపంచ వాణిజ్య మార్కెట్‌లో చైనా ఆధిపత్యాన్ని తగ్గించి, ఆ దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలనే ప్రణాళికతో అమెరికాలోని ట్రంప్ యంత్రాంగం ప్రణాళికలు రచిస్తున్నది. ఇందులో భాగంగా ఈనెలలో చైనాపై పెద్ద మొత్తంలో సుంకాలను విధించిన విషయం విదితమే. దీంతో చైనా ఎగుమతులపై కొంత ప్రభావం పడినా.. అమెరికాకు దీటుగా సమాధానమిస్తూ మార్కెట్‌లో తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నది.

అమెరికా-చైనా మధ్య ఎగుమతులు తగ్గొచ్చు : డబ్ల్యూటీఓ

చైనాతో పాటు పలు దేశాలపై అమెరికా పరస్పర



సుంకాల ఎఫెక్ట్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, మార్కెట్లను కుదేలు చేస్తోందన్న భయాలను ఆయా దేశాల ఆర్థికవేత్తలు, నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ దుందుడుకు నిర్ణయం ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నదని చెప్తున్నారు. అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం ఈ రెండు దేశాల మధ్య వస్తువుల ఎగుమతులు 80 శాతం వరకు తగ్గించొచ్చని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) హెచ్చరించింది. ఇది ప్రపంచ వృద్ధిని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని వివరించింది.

అమెరికా సుంకాల ప్రభావం, భయాలు అనేక దేశాలపై ఉన్నాయి. 'గోల్డ్‌మ్యాన్ సాచ్స్' ఈ ఏడాది చైనా జీడీపీ వృద్ధి రేటు అంచనాలను గతవారం 4.5 శాతం నుంచి నాలుగు శాతానికి తగ్గించింది. ఇందుకు టారిఫ్ ప్రభావాలను కారణాలుగా చూపించింది. ఇక రెండ్రోజుల క్రితం 'సిటి'.. 4.7 శాతం నుంచి 4.2 శాతానికి తన అంచనాలను తగ్గించింది. ఈ సవరించిన అంచనాలు ప్రభుత్వ(చైనా) వృద్ధి లక్ష్యం 'దాదాపు ఐదు శాతం' కంటే తక్కువగా ఉన్నాయి. ఫిబ్రవరి నెలలో అంచనాలను మించి జర్మనీ ఎగుమతులు పెరిగాయి. దక్షిణ కొరియాలాగే ఈనెలలో యూఎస్‌కు జర్మనీ ఎగుమతులు 8.5 శాతం ఎగబాకాయి. మార్చిలో చైనాకు దక్షిణ కొరియా ఎగుమతులు 4.1 శాతం తగ్గాయి. కొరియన్ డేటా ఈ విషయాన్ని వెల్లడించింది.

అంబేద్కర్‌పై గౌరవం మాటలకే పరిమితం

- మోడీ ప్రభుత్వంపై ఖర్గే విమర్శలు

న్యూఢిల్లీ : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చే ఉద్దేశం మోడీ ప్రభుత్వానికి లేదని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్‌లు రాజ్యాంగ నిర్మాతకు శత్రువులని అన్నారు. 'మోడీ ప్రభుత్వానికి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై గౌరవం మాటలకే పరిమితం. ఆయన ఆశయాలను నెరవేర్చే ఉద్దేశం వారికి లేదు. ఆయన వారసత్వంపై పెదవి విరుస్తున్నారు. 1952 ఎన్నికల్లో అంబేద్కర్ ఓటమికి ఎస్ ఏ డాంగే, వీడీ సావర్కర్‌లు కారణం. ఈ విషయాన్ని అంబేద్కర్ ఒక లేఖలో పేర్కొన్నారు' అని ఖర్గే వ్యాఖ్యానించారు. అలాగే, దేశవ్యాప్తంగా కులగణన అవసరాన్ని ఖర్గే నొక్కి చెప్పారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి రిజర్వేషన్లు అమలుచేయాలని అన్నారు. "రాజ్యాంగం.. పౌరులకు అంబేద్కర్ ఇచ్చిన బహుమతి. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం పొందే హక్కును కల్పిస్తుంది. ఏఐసిసి సమావేశంలో సామాజిక న్యాయానికి సంబంధించిన అభిప్రాయాలను ముందుకు తీసుకెళుతున్నాం" అని అన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అత్యవసరం

- సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి
- అంబేద్కర్ జయంతి సందర్భంగా నివాళి



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యాంగాన్ని పరిరక్షణ అత్యవసరమని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి సోమవారం స్పష్టం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం పార్లమెంట్ స్ట్రీట్‌లో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. దళిత్ సోషన్ ముక్తి మంచ్ (డిఎస్‌ఎంఎం) నిర్వహించిన స్టాల్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సిపిఎం సీనియర్ నాయకులు బృంద కరత్, పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి రాఘవులు, ఆర్. అరుణ్ కుమార్, సీనియర్ నేత హన్నన్ మొల్లా తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎం.ఎ బేబి మాట్లాడుతూ కుల రహిత సమాజ స్థాపనే, అంబేద్కర్ కు మనమిచ్చే ఘన నివాళి తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల ఆర్థిక, రాజకీయ హక్కుల కోసం అంబేద్కర్ ఎల్లప్పుడూ పోరాడారని గుర్తు చేశారు. భారత సమాజం సామాజిక నిర్మాణాన్ని రూపొందించే వైవిధ్యాన్ని అంబేద్కర్ ఎల్లప్పుడూ విశ్వసించారన్నారు. ఈ వైవిధ్యానికి చెందిన వారందరి హక్కులను కాపాడటానికి భారత రాజ్యాంగాన్ని విశ్వసించారన్నారు. అయితే నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం ఎల్లప్పుడూ దేశంలోని కార్మిక వర్గంలో విభజన సృష్టించడానికి విభజన రాజకీయాల వ్యూహాన్ని అమలు చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడాలని, హిందూత్వాన్ని తిరస్కరించాలని పిలుపు ఇచ్చారు. వ్యవసాయ కార్మికుల హక్కులను కాపాడాలని, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాదని, రాజ్యాంగ విలువలు, సూత్రాల పట్ల కూడా గొప్ప విశ్వాసి అని అన్నారు. కానీ నేడు భారతీయ వైవిధ్యం, రాజ్యాంగానికి ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నుంచి ముప్పు పొంచి ఉందన్నారు. లింగం, కులం, మతం ఆధారంగా శ్రామిక ప్రజలను విభజించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. హిందుత్వ, మనువాదం, అన్ని రకాల సామాజిక వివక్షతలకు వ్యతిరేకంగా నిజమైన పోరాటాన్ని ఎల్లప్పుడూ గుర్తుచేసుకోవాలని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడటానికి పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. మత రాజకీయాలను ఎదుర్కోవడంతో పాటు, కార్పొరేట్‌లతో పాటు గ్రామీణ సంపన్నులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటాన్ని వారి నిర్దిష్ట ప్రాంతాలలో ముందుకు తీసుకెళ్లడానికి ఎఐఎడబ్ల్యుయు అన్ని యూనిట్లను సమీకరించాలని పిలుపునిచ్చారు. గ్రామీణ కార్మికులందరూ గ్రామీణ సంపన్నులకు వ్యతిరేకంగా పోరాడటానికి ఐక్యంగా ఉండాలని తెలిపారు.

బెంగాల్‌లో ఆగని అల్లర్లు



కోల్‌కతా : వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లో అల్లర్లు కొనసాగుతునే ఉన్నాయి. తాజాగా దక్షిణ 24 పరగణాల జిల్లాలోని భంగర్‌లో వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు జరిగాయి. ఈ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త చోటు చేసుకొంది. అనేక మంది గాయపడ్డారు. నిరసనకారులు పోలీసు వాహనాలను దగ్ధం చేశారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో జరిగిన అల్లర్లలో ఇప్పటికే ముగ్గురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. మాల్దా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఇప్పటికే 250 మందిని అరెస్టు చేశారు. అయినా అల్లర్లు అదుపులోకి రావడం లేదు.

కాగా, మరోవైపు బెంగాల్‌లో జరుగుతున్న అల్లర్లపై ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. సుప్రీంకోర్టు న్యాయవాది శశాంక్ శేఖర్ ఝా ఈ పిటిషన్ వేశారు. కోర్టు పర్యవేక్షణలో ఈ విచారణ కొనసాగాలని కోరారు. ప్రజల ప్రాణాల్ని కాపాడేందుకు, హింసను నివారించేలా కోర్టు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ ఇప్పటికే పదికి పైగా పిటిషన్లు దాఖలు కాగా.. ఈ నెల 16న సుప్రీంకోర్టు వీటిని విచారించనుంది.

గుజరాత్ తీరంలో భారీగా డ్రగ్స్

- 300 కేజీల మాదకపదార్థాలు స్వాధీనం
- దాదాపు రూ.1800 కోట్ల విలువ

గాంధీనగర్ : గుజరాత్ తీరంలో మరొకసారి డ్రగ్స్ కలకలం రేపింది. రూ.1800 కోట్ల విలువైన 300 కేజీల మాదక పదార్థాలను అధికారులు సీజ్ చేశారు. ఇండియన్ కోస్ట్‌గార్డ్ (ఐసిజి), గుజరాత్ యాంటీ-టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఎటిఎస్) అర్ధరాత్రి నిర్వహించిన జాయింట్ ఆపరేషన్‌లో ఈ డ్రగ్స్‌ను సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయమైన సమాచారంతో ఈ ఆపరేషన్‌ను చేపట్టాయి. అనుమానాస్పద బోట్ కనిపించటంతో అక్కడికి సిబ్బంది వెళ్లింది. దీంతో అందులో డ్రగ్స్ మూటలతో ఉన్న దుండగులు సిబ్బంది రాకను గమనించారు. వెంటనే ఆ సరకును సముద్రంలో పడేశారు. ఆ వెంటనే అంతర్జాతీయ సరిహద్దు వైపు పారిపోయారు. డ్రగ్స్ ముఠా ఆటకట్టించటానికి వెళ్లిన సిబ్బంది వెంటనే నీళ్లలో మునిగిన ఆ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నది. 300 కేజీలకు పైగా నిషేధిత మెథాంఫెటమైన్ ఉన్నట్టు అధికారులు గుర్తించారు. పట్టుబడిన ఈ డ్రగ్స్ విలువ రూ.1800 కోట్లను ప్రాథమికంగా అంచనా వేశారు.

సహకారం మరింత పటిష్టం

- పలు సహకార ఒప్పందాలపై చైనా, వియత్నాం సంతకాలు
- హనోయ్‌లో చైనా నేత జిన్‌పింగ్ పర్యటన

హనోయ్ : సహకార బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని చైనా, వియత్నాంలు నిర్ణయించాయి. ఉత్పత్తి, సరఫరాలకు సంబంధించి పలు సహకార ఒప్పందాలపై కూడా చైనా, వియత్నాంలు సోమవారం సంతకాలు చేశాయి. రైల్వే సహకారంపై కూడా ఇరు పక్షాలు ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. మొత్తంగా 45 ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి టో లామ్‌తో జిన్‌పింగ్ భేటీ అనంతరం ఈ సంతకాలు చోటు చేసుకున్నాయి.

వాణిజ్యం, సరఫరా వ్యవస్థలకు సంబంధించి వియత్నాంతో మరింత బలమైన సంబంధాలు నెలకొనాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆకాంక్షించారు. ఆగ్నేయాసియా దేశాల పర్యటనలో భాగంగా తొలుత వియత్నాంలో పర్యటిస్తున్న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మాట్లాడుతూ, రక్షణ వాదం పట్ల హెచ్చరించారు. వాణిజ్య యుద్ధాల వల్ల ఎలాంటి ప్రయోజనం వుండదని, ఈ యుద్ధంలో విజేతలంటూ ఎవరూ వుండరని పునరుద్ఘాటించారు. బహుళ వాణిజ్య వ్యవస్థను కచ్చితంగా పరిరక్షించాల్సి వుందని స్పష్టం చేశారు. పారదర్శకమైన, సహకారంతో కూడిన అంతర్జాతీయ వాతావరణాన్ని పరిరక్షించుకోవాల్సి వుందన్నారు. ట్రంప్‌తో టారిఫ్‌ల వివాదం కొనసాగుతున్న వేళ జిన్‌పింగ్, మలేసియా, కంబోడియా, వియత్నాంలో పర్యటించనున్నారు. ఈ నెల 18 వరకు ఈ పర్యటన కొనసాగనుంది. సుస్థిరమైన అంతర్జాతీయ పారిశ్రామిక వ్యవస్థను, సరఫరాల వ్యవస్థలను కాపాడుకోవాల్సి వుందన్నారు. సోమవారం వియత్నాంలో చైనా నేత పర్యటనను పురస్కరించుకుని వియత్నాం కమ్యూనిస్టు పార్టీ వార్తాపత్రిక నాన్‌దన్ ఒక వ్యాసాన్ని ప్రచురించింది. కృత్రిమ మేధ, హరిత ఆర్థిక వ్యవస్థలకు సంబంధించి కూడా హనోయ్‌తో మరింత బలమైన సం బంధాలు వుండాలని జిన్‌పింగ్ ఆకాంక్ష వ్యక్తం చేశారు.

ఈ వారంలో ఇరాన్ విదేశాంగ మంత్రి మాస్కో పర్యటన

- ఇరాన్‌పై సత్వరమే నిర్ణయం తీసుకుంటామన్న ట్రంప్

దుబాయ్ : ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చి ఈ వారంలో రష్యాలో పర్యటించనున్నారు. ఒమన్‌లో అమెరికాతో జరిగిన తాజా చర్చల వివరాలను మాస్కోకు తెలియచేసేందుకు మంత్రి పర్యటిస్తున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి సోమవారం తెలిపారు. పశ్చిమ దేశాలతో గల అణు వివాదాన్ని పరిష్కరించుకోవడానికి ఇరాన్ తన దౌత్య ప్రయత్నాలను ముమ్మరం చేస్తోందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘేరి చెప్పారు. అలాగే తమ దేశ ఆర్థిక వ్యవస్థపై ఆంక్షల వల్ల నెలకొన్న ఒత్తిళ్ళను తగ్గించుకోవాలని చూస్తున్నామన్నారు. ఈ వారంలో ఐక్యరాజ్య సమితి అణు పర్యవేక్షక సంస్థ చీఫ్ రాఫెల్ గ్రాసీ ఇరాన్‌లో పర్యటనకు వస్తున్నారని చెప్పారు. శనివారం రోమ్‌లో అమెరికాతో రెండో దశ చర్చలు జరుగుతాయని ఇరాన్ భావిస్తోంది. ఈ చర్చల్లో కేవలం అణు అంశంపై, ఆంక్షల ఎత్తివేతపై మాత్రమే దృష్టి కేంద్రీకరించనున్నట్లు తెలిపింది. ఉద్రిక్తతలు పెచ్చరిల్లేందుకు దారి తీసే చర్యలపై కన్నా దౌత్య సంబంధాల పటిష్టతపై దృష్టి పెట్టాలని రష్యా ఇప్పటికే కోరింది. గత వారంలో, ఇరాన్ అణు కార్యక్రమంపై నిపుణుల స్థాయిలో రష్యా, చైనా, ఇరాన్‌లు చర్చలు జరిపాయి.

త్వరలోనే నిర్ణయం

ఇరాన్‌పై త్వరగా ఒక నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదివారం చెప్పారు. విమానంలో విలేకర్లతో మాట్లాడుతూ ట్రంప్, ఇరాన్‌పై సలహాదారులతో సమావేశమయ్యానని, సత్వరమే నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. అంతకుమించి వివరాలు వెల్లడించలేదు. ఈ చర్చల్లో ఎలాంటి ఒప్పందం కుదరకపోతే మిలటరీ చర్య తీసుకుంటామని అంతకుముందు ట్రంప్ హెచ్చరించారు. అయితే తొలిసారి చర్చలు జరిగిన గత శనివారం దీనిపై స్పందిస్తూ, 'అంతా బాగానే జరుగుతుంది, ఇరాన్ పరిస్థితి కూడా బాగానే వుంది.' అని వ్యాఖ్యానించారు.

కేంద్రానికి ఆర్‌బిఐ మరో బొనంజా

- రూ.2.5 లక్షల కోట్ల డివిడెండ్..!
- రిజర్వు బ్యాంక్ సామర్థ్యానికి దెబ్బ



న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మరోమారు మోడీ ప్రభుత్వ ఖజానాను భారీగా నింపనుందనే అంచనాలు పెరుగుతున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) గాను ఆర్‌బిఐ రూ.2.5 లక్షల కోట్ల పైగా డివిడెండ్‌ను ప్రకటించే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఇది గతేడాది చెల్లించిన రూ. 2.1 లక్షల కోట్ల కంటే ఎక్కువ కానుంది. ప్రతీ సారి కేంద్ర ఒత్తిళ్లకు ఆర్‌బిఐ తన వద్ద ఉన్న మిగులు నిధులను ధారపోయడం ద్వారా సంక్షోభ సమయంలో రిజర్వ్ బ్యాంక్ చేతులెత్తేసే ప్రమాదం ఉంది. రూపాయి మారకం రేటును కాపాడటానికి రిజర్వు బ్యాంక్ డాలర్లను అమ్మడం, లిక్విడిటీ కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని కేంద్ర ఖజానకు డివిడెండ్ రూపంలో ఇవ్వనుందని ఆర్థిక నిపుణులు అంచన వేస్తున్నారు. కేంద్రం బడ్జెట్‌లో అంచనా వేసిన రూ.2.2 లక్షల కోట్ల కంటే ఎక్కువే డివిడెండ్ చెల్లించే అవకాశాలు ఉన్నాయన్నారు, రూపాయి మారకం రేటును కాపాడటానికి ఆర్‌బిఐ రికార్డు స్థాయిలో డాలర్ అమ్మకాలు చేపట్టడం, పెద్ద ఎత్తున లిక్విడిటీ కార్యకలాపాల ద్వారా ఆర్‌బిఐ వడ్డీ ఆదాయం భారీగా పెరిగిందన్నారు. ఒక విదేశీ బ్యాంకింగ్ గ్రూప్ ఏకంగా ఈ డివిడెండ్ రూ.3.5 లక్షల కోట్ల వరకు అంచనావేసింది. బ్యాకింగ్, పెట్టుబడుల రెగ్యూలేటరీ, ప్రభుత్వ రుణాలు నిర్వహించే ఆర్‌బిఐ 2024-25కు గాను తన వద్ద ఉన్న మిగులు నిధులను మే చివరలో ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో బదిలీ చేయనుంది. ఈ నిధులు కేంద్ర ప్రభుత్వానికి ఆర్థిక లోటును తగ్గించడానికి సహాయపడతాయి. ప్రభుత్వ వ్యయం బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు లభ్యతను పెంచనుంది. ఆర్థిక మందగమనం కారణంగా పన్ను వసూళ్లు తగ్గిన నేపథ్యంలో అధిక డివిడెండ్ కేంద్రానికి ఆర్థిక మద్దతు లభించనుందని ఎమ్‌కాయ్ గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ తెలిపింది.

ఆర్‌బిఐ స్వయంప్రత్తికి దెబ్బ

అధిక డివిడెండ్ వల్ల ప్రతికూల ప్రభావాలు లేకపోలేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మిగులు బదిలీ కోసం ఆర్‌బిఐ తన ఆకస్మిక నిల్వలను(కంటింజెన్సీ రిజర్వులు) వాడుకోవడం ద్వారా ఆర్థిక సంక్షోభాలకు సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యం దెబ్బతింటుంది. ప్రతిసారి పెద్ద మొత్తంలో ప్రభుత్వానికి మిగులు బదిలీ చేస్తుంటే కేంద్రం డిమాండ్‌కు ఆర్‌బిఐ తలొగ్గుతోందని స్పష్టమవుతోంది. ఇది ఆర్‌బిఐ స్వయంప్రతిపత్తి, విశ్వసనీయతను దెబ్బతీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మిగులు బదిలీలు కేంద్రానికి తక్షణ ఆర్థిక ఉపశమనాన్ని అందించినప్పటికీ దీర్ఘకాలిక ఆర్థిక సవాళ్లకు దారితీస్తుందని విశ్లేషిస్తున్నారు.

ప్రైవేటురంగంలో రిజర్వేషన్లతో సామాజిక న్యాయం

(మొదటి పేజీ తరువాయి)

గ్రామాల్లో భూస్వామ్య పెత్తందారీ పోకడలు, దళితులపై దాడులు, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. దళితవాడలకు సరైన రోడ్లు, సదుపాయాలు, శ్మశానవాటికలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. అంబేద్కర్ స్మృతివనం ప్రజల అభిప్రాయాలు స్వేచ్ఛగా చెప్పుకునేలా ఉండాలని, దానికి విరుద్ధంగా ఇక్కడ ఏమి మాట్లాడాలో, ఏమి మాట్లాడకూడదో ప్రభుత్వాలే నిర్దేశిస్తే ఎలాగని ప్రశ్నించారు. గత ప్రభుత్వం అంబేద్కర్ విగ్రహాన్ని రాజకీయంగా వాడుకునేందుకు ప్రయత్నించిందని, ఇప్పటి ప్రభుత్వం దీన్ని వ్యాపారకేంద్రంగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని సూచించారు. ప్రభుత్వమే అభివృద్ధి చేయడంతోపాటు ప్రజల హక్కుల సాధనకు వేదికగా మార్చాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంబేద్కర్ దేశ సంపదను జాతీయం చేయాలని కోరుకుంటే నేటిపాలకులు జాతీయ సంపదను ప్రైవేటుపరం చేస్తున్నారని అన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆంధ్ర మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కె.శ్రీదేవి, బి.రమణ మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కె.ప్రభాకరరెడ్డి, విజయవాడ కార్పొరేషన్ సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు, నాయకులు ఎం.హరిబాబు, గుండిమెడ క్రాంతికుమార్, జి.నటరాజు తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడొద్దు....పోలీసులు హెచ్చరిక

అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం నాయకులు నివాళి అర్పించేందుకు వెళుతుండగా అక్కడ డ్యూటీలో ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. జెండాలు పట్టుకెళ్లడానికి వీల్లేదని అన్నారు. . తాము నివాళి అర్పించి వస్తామని, రాజకీయాలు కాదని సిపిఎం నాయకులు తెలిపారు. అయినా పోలీసులు పార్టీ జెండాలు పట్టుకెళ్లడానికి వీల్లేదని అనడంతో, తాము అలాగే వెళతామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. తాము అసలు ఏమి చెబుతామో తెలియకుండా ఏమి మాట్లాడాలో మీరెలా నిర్ణయిస్తారని శ్రీనివాసరావు ప్రశ్నించారు. స్వల్ప వాగ్వివాదం అనంతరం నాయకులు ప్రదర్శనగా విగ్రహం వద్దకు వెళ్లి నివాళులర్పించారు.



చిన్నారి

గడుగ్గాయి



గదిలో నుంచి రుద్రా! రుద్రా! అని గట్టిగా అరుస్తూ కళ్లెర్ర చేసుకుంటూ గుమ్మంలో ఉన్న కొడుకు దగ్గరికి వెళ్ళింది వకుళ. తల్లిని చూడగానే బిక్క మొహం వేసుకుని రెండు చేతులూ వెనక్కి పెట్టుకుని నిలబడ్డాడు రుద్ర.

'ఇక్కడ బల్లమీద పెట్టిన సున్నుండ కనపడలేదు. నువ్వు తీసావా? చెప్పు?' అని గద్దించింది. 'ఊహు లేదు. చీమ ఎత్తుకు పోయింది' అని సమాధానమిచ్చాడు గడుగ్గాయి. 'నిజం చెప్పు? లేదంటే చురక పెడతాను?' అంది తల్లి కోపంగా. 'ఊహు! నేను తియ్యలేదు' అన్నాడు బేలగా.

'అబ్బా ఏంటి.. గోల! ఏమైంది? అంటూ పెరట్లోంచి వస్తూ అడిగాడు వకుళ భర్త రాజారావు. 'కాత్యాయని కోసమని మినపసున్ని ఇక్కడ బల్లమీద పెట్టాను. నేను వీధిలోకి వెళ్లి వచ్చేసరికి మాయమైపోయింది. ఏమయ్యిందని అడిగితే చీమ ఎత్తుకుపోయిందని చెప్తున్నాడు. ఇదీ వీడి వరస' అంది వకుళ.

భార్యను పక్కకు పిలిచి 'పిల్లలు మనల్ని అనుకరిస్తారు. జాగ్రత్తగా నచ్చచెప్పాలి. కోప్పడితే కుదరదు' అని కొడుకు దగ్గరికి వెళ్ళాడు రాజారావు.

'రుద్రా నీకు కాత్యాయని అంటే ఎంతో ఇష్టం కదా! ఆ మినపసున్ని ఉండ ఎక్కడ ఉందో వెతికి తెచ్చి దానికి ఇవ్వు. నువ్వు మంచి వాడివి కదూ!' అని అన్నాడు. 'ఇదిగో' అంటూ చేతిలో దాచిన మినప సున్ని ఉండని తండ్రికి ఇచ్చాడు రుద్ర. 'నా బంగారు కొండ, బుద్ధి. అమ్మ అడిగినప్పుడు అబద్ధం ఎందుకు చెప్పావు' అని అడిగాడు రాజారావు.


'నిన్న మినపసున్ని అడిగితే కాకి ఎత్తుకుపోయిందని అమ్మ చెప్పింది. అందుకే నేను ఇవ్వాళ చీమ ఎత్తుకుపోయింది అని చెప్పాను' అన్నాడు రుద్ర అమాయకంగా.

రుద్ర మాటలు విన్న వకుళ, గదిలో నుండి బయటికి వచ్చి. 'క్షమించు నాన్న. నిన్న కావాలనే అలా అబద్ధం చెప్పాను. ఇంకెప్పుడూ చెప్పను. నువ్వు కూడా అబద్ధం చెప్పకూడదు. సరేనా!' అని రుద్రని దగ్గరికి తీసుకుంది. 'అమ్మా ఇక మీదట నేను అబద్ధం చెప్పను. బుద్ధిగా ఉంటాను' అన్నాడు రుద్ర. తల్లీకొడుకులు ఒకరికొకరు వాగ్దానాలు చేసుకోవడం చూసి రాజారావు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ బయటికి వెళ్లాడు.

– కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

అంకెలు కలపండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మలో ఉన్న అంకెలను వరుసగా కలపండి. అందమైన జిరాఫీ బొమ్మ వస్తుంది చూడండి.



నేను గీసిన బొమ్మ





టి. సందీప్, 3వ తరగతి,
ప్రాథమికోన్నత పాఠశాల, తిప్పనగుల్ల,
నిజాంపేట, మెదక్ జిల్లా

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



మీకోసం

అల్లం, వెల్లుల్లి ముద్ద చేసేటప్పుడు కొద్దిగా నూనె వేస్తే పేస్టు మెత్తగా వస్తుంది. ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది.

జీవన సౌరభం

ఏమీ లేనప్పుడు ఓపిక, అన్నీ ఉన్నప్పుడు ప్రవర్తన.. మనిషి వ్యక్తిత్వాన్ని పెంచుతాయి.

JEEVANA జీవన the family

కలసి బతికిన చోట విద్వేషం గీసిన విభజన రేఖ

ఇది భారతీయ సమాజం. భిన్న సంస్కృతి, సాంప్రదాయాలు నెలవైన ఇక్కడ అన్ని జాతుల వారు సోదర భావంతో మెలుగుతారు. ఒకరి పండుగలకు ఇంకొకరు అతిథులవుతారు. విందులు, వినోదాలు కలిసి పంచుకుంటారు. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా నిలుస్తారు. ఇట్లాంటి వాతావరణం ఇప్పుడు మారిపోతోంది. మతం పేరుతో ఉన్మాద బీజాలు చాపకింద నీరులా దేశమంతా వ్యాపించేస్తున్నాయి. ఉత్తరాఖండ్‌లో జరిగిన ఓ సంఘటన అందుకు ఉదాహరణ.

ఉత్తరాఖండ్, నందానగర్ ప్రాంతం.. నందానదికి ఆనుకుని దేశ రాజధానికి సరిగ్గా 10 గంటల ప్రయాణ దూరంలో ఉంటుంది. చైనా, ఇండియా సరిహద్దు అది. అక్కడ నలిగిపోయిన, మురికిపట్టిన బట్టలను శుభ్రం చేసే డ్రైక్లీనింగ్ షాపును అహ్మద్ హసన్ నిర్వహిస్తున్నాడు. రోజూ ఉదయం 8 గంటలకు షాపు తెరిచి కస్టమర్ల కోసం ఎదురుచూస్తుంటాడు. అయితే ఇంతకుముందులా ఆ షాపుకి ఇప్పుడు ఎవరూ రావడం లేదు. 2024 సెప్టెంబరుకి ముందు, భోజన సమయానికి ఆ షాపులో 20 నుండి 30 మంది వ్యక్తులు వచ్చేవారు. వారిలో హిందువులే ఎక్కువ. వారంతా హసన్‌తో కలిసి కబుర్లు చెప్పేవారు. రాజకీయాలు మాట్లాడేవారు. జోకులు వేసుకునేవారు. కష్టసుఖాలు చర్చించేవారు. అందరూ కలిసి టీ తాగేవారు. కానీ, ఇప్పుడు పట్టుమని ఐదుగురు కూడా ఆ షాపులో లేరు.

ఒకే ఒక్క ముస్లిం


హసన్ ఇప్పుడు ఆ ప్రాంతంలో నివసిస్తున్న ఒకే ఒక్క ముస్లిం. అంతకుముందు అక్కడ 15 ముస్లిం కుటుంబాలు ఉండేవి. వారి ఇళ్ళు, జీవనోపాధి అక్కడే. హసన్ అక్కడే పుట్టి పెరిగాడు. ఉత్తరప్రదేశ్ నుండి వాళ్ల తాత ఇక్కడికి వలసవచ్చిన మొదటి ముస్లిం వ్యక్తి. ఆ తరువాత మరికొన్ని కుటుంబాలు ఇక్కడకి చేరాయి. హిందూ కుటుంబాలతో కలిసి ఈ ముస్లిం కుటుంబాలు పండుగలు జరుపుకునేవి. ఈద్, దీపావళికి ఒకరి ఇంటికి ఒకరు అతిథులుగా వెళ్లేవారు. హిందూ వ్యక్తులు మరణిస్తే అంతిమ సంస్కారాలకి అవసరమయ్యే సామగ్రిని ముస్లిములు సమకూర్చేవారు. తన స్నేహితుని కుటుంబ వ్యక్తి ఒకరు చనిపోయినప్పుడు అతని శవాన్ని మోసిన వ్యక్తుల్లో హసన్ కూడా ఉన్నాడు. ఇంత సామరస్య వాతావరణం గత ఏడాది సెప్టెంబరు నుంచి ఒక్కసారిగా మారిపోయింది. ముస్లిం వ్యతిరేకత విపరీతంగా పెరిగిపోయింది.

కోవిడ్ నుండే మొదలైంది!

అక్కడి పరిస్థితులకు ప్రత్యక్ష సాక్షి అయిన హసన్ వాటిని ఇలా వివరించాడు. 'ఓ హిందూ యువతిని, ముస్లిం వ్యక్తి వేధించాడని ఆరోపణ వచ్చింది. అయితే ఆ ఆరోపణ మొత్తం కమ్యూనిటీకి నెట్టివేశారు. ఈ ద్వేషం ఒక్కసారిగా వచ్చింది కాదు. కోవిడ్ సమయం నుంచి మెజార్టీ ప్రజలు మైనార్టీలపై కోపంగా ఉన్నారు. 'వందలాదిగా ముస్లిం వ్యక్తులు గుమికూడి సమావేశాలు నిర్వహించారని, అందువల్లనే కోవిడ్ వేగంగా పెరిగింద'ని అప్పట్లో కొంతమంది పనికట్టుకుని మరీ ప్రచారం చేశారు. అప్పటి నుంచి వారి మనసుల్లో నాటుకుపోయిన విషం ఈ ఘటనతో ఒక్కసారిగా పైకి వచ్చింది. వాస్తవానికి ఆరోపణలు వచ్చిన తరువాత రోజు ఆ యువతికి మద్దతుగా, ముస్లిం వ్యక్తికి వ్యతిరేకంగా కొంతమంది ర్యాలీ చేశారు. అందులో మేం కూడా పాల్గొన్నాం' అని హసన్ చెప్పాడు.

ఆ రోజు జరిగిన ర్యాలీలో ముందు వరుసలో కొంతమంది వ్యక్తులు అన్సర్ అనే ఓ ముస్లిం వ్యక్తిని చావబాదారు. వేధింపులు చేసిన యువకుడికి సహాయం చేశాడని అతడిని విచక్షణారహితంగా కొట్టారు. అలా చేస్తున్నప్పుడే వారిలో కొంతమంది హిందూ వ్యక్తులు బిగ్గరగా అరుస్తూ ముస్లిం వ్యతిరేక నినాదాలు చేశారు. 'వాళ్లని బూటు కాళ్లతో కొట్టండి.. ఎక్కడ కనిపిస్తే అక్కడ చావబాదండి' అని పిలుపునిచ్చారు. ఒకపక్క నినాదాలు చెబుతుండగానే రాబోయే ప్రమాదాన్ని గ్రహించిన గుంపులో ఉన్న ఇతర ముస్లింలు తలోదిక్కూ పారిపోయారు. వారిలో హసన్ కూడా ఉన్నాడు. తరువాత ఆ గుంపు ముస్లిం ఇళ్లపై దాడి చేసింది. వారి షాపులను ధ్వంసం చేసింది.

ఆ రోజును హసన్ ఇలా గుర్తు చేసుకున్నాడు.



'అందరూ మా ఇంటి పైభాగంలో తలదాచుకున్నారు. ఆ క్షణాలు ఇప్పుడు తలుచుకున్నా వణుకు పుడుతుంది. సహాయం కోసం పోలీసులకు, మా హిందూ స్నేహితులకు ఫోన్ చేశాం. ఎవరూ స్పందించలేదు. అర్ధరాత్రి దాటిన తరువాత నేను నా షాపుకి వెళ్లాను. షాపులో సామానంతా రోడ్డుపై పడేశారు. పిల్లల పెళ్లికని దాచుకున్న రూ.4 లక్షల సొమ్మును కూడా దోచుకెళ్లారు' అని హసన్ బాధగా చెప్పాడు.

రక్షించలేమని చెప్పారు

ర్యాలీ జరిగిన మరుసటి రోజు హిందూ గ్రూపులకు చెందిన కార్యకర్తలు వేలాదిగా నందనగర్ వచ్చారు. 60, 70 మంది పోలీసులు గస్తీ నిర్వహించారు. అయితే ఈ పోలీసులు ముస్లిం వ్యక్తులకు రక్షణ కల్పించలేమని చేతులెత్తేసారు. 'మీ ప్రాణాలను మీరే రక్షించుకోండి. వీలైనంత దూరం పారిపోండి సహాయం చేస్తాం' అన్నారని హసన్ గుర్తుచేసుకున్నాడు.



గ్రూపు సభ్యుడు చేసిన హింసాత్మక, మతోన్మాద ఉపన్యాసం తరువాత ఆ వ్యక్తులు చేసిన బీభత్సానికి ముస్లిం వ్యక్తులు ఊకుమ్మడిగా ఊరు వదిలి వెళ్లిపోయారు. అర్ధరాత్రి దాటిన తరువాత పోలీసులు దగ్గరుండి మరీ జీపుల్లో వారిని నగరం వెలుపల విడిచిపెట్టారు.

ఆ రోజుతో నందనగర్‌లో వాళ్ల జీవితాలు తెల్లారినట్లే అని ఆ ముస్లిం కుటుంబాలు భావించాయి. కానీ హసన్ అలా ఊరుకోలేకపోయాడు. అప్పుడు అతని మానసిక పరిస్థితి ఎలా ఉందో ఇలా చెప్పాడు. 'నా గుర్తింపు ఇక్కడే ఉంది. ఇదే నా నివాసం. ఉన్నట్లుండి ఈ ప్రాంతం, ఈ ఇల్లు నాది కావంటే నేను ఎక్కడికి వెళ్లాలి? నా కుటుంబం ఏమై పోవాలి? అని బాగా ఆలోచించాను. కొన్ని రోజుల తరువాత రక్షణ కల్పించమని అయ్యూమ్ అనే వ్యక్తితో కలిసి కోర్టులో పిటిషన్ వేశా. తీర్పు మాకు అనుకూలంగా వచ్చింది. కానీ..' అంటూ హసన్ బాధగా నిట్టూర్పు విడిచాడు.


నేను భూతంలా కనిపిస్తున్నాను

తీర్పు తరువాత హసన్ ఒక్కడే నందనగర్ చేరుకున్నాడు. భయంతో మిగిలిన వారు ఎవ్వరూ రాలేదు. భార్య నలుగురు పిల్లలతో ఇంటికి వెళ్లిన హసన్ ఇప్పుడు రోజూ బాధపడుతున్నాడు. అతని షాపుకి ఎవ్వరూ రావడం లేదు. అసలు ఎవ్వరూ అతనితో మాట్లాడడం లేదు. ఈ పరిస్థితి గురించి చెబుతూ.. 'నేను ఇప్పుడు ఇక్కడ అందరికీ భూతంలా కనిపిస్తున్నాను. నా కుటుంబంతో కలసి ఇంతకుముందులా స్వేచ్ఛగా బయటికి వెళ్లలేకపోతున్నా. మా అమ్మాయిని తన పక్కన కూర్చోవద్దని స్నేహితులు అంటున్నారు. స్కూలుకు వెళ్లడానికి ఆ పిల్ల ఇష్టపడడం లేదు. ఈ పరిస్థితులు ఎంత దూరం తీసుకెళతాయో అర్థం కావడం లేదు' అని వాపోతున్నాడు. హసన్ పడుతున్న ఈ బాధ ఎందరో ముస్లింలది!

కృష్ణా జలాల వివాదంలో

ముంచుకొస్తున్న ముప్పు !

- బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ వేగవంతం
- సుప్రీం కోర్టులోనూ కేసులు ఇప్పటికీ న్యాయవాదులను నియమించని ఎపి



ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

కృష్ణా జలాల పంపక వివాద విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం ఆందోళన కలిగిస్తోంది. మిగులు జలాల వాడకం విషయంలో ఉన్న హక్కుపై ప్రభుత్వం గట్టివాదనలు వినిపించిందన్న సంతృప్తి కలిగించలేకపోతోంది. మరోవైపు ఎపి చేపట్టే ప్రతి ప్రాజెక్టుపైనా ఎగువన ఉన్న తెలంగాణ ప్రభుత్వం కెఆర్‌ఎంబిలోనూ, బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ముందూ ఫిర్యాదులు చేస్తూనే ఉంది. ఇప్పటికే ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన ఎపి ప్రభుత్వం దానికి అనుగుణంగా లాయర్లను నియ మించడంలోనూ, గట్టివాదనలు వినిపించడంలోనూ శ్రద్ధ చూపించడం లేదన్న విమర్శలొస్తున్నాయి.

ఈ ఏడాది జులైతో బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ పదవీకాలం ముగుస్తుంది. రెండు రాష్ట్రాల వాదనలు విని పంపకాలు ఖరారు చేయాల్సి ఉండటంతో ట్రిబ్యునల్ విచారణ వేగవంతం చేసింది. మరోవైపు ట్రిబ్యునల్‌లో, సుప్రీం కోర్టులో వాదనలు వినిపించడానికి తెలంగాణ ప్రభుత్వం ఆరుగురు ప్రముఖ న్యాయవాదులతో బృందాన్ని ఏర్పాటు చేస్తూ 2024 నవంబర్లో జిఓ ఇచ్చింది. అదే సమయంలో ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘకాలం నీటిపారుదల అధికారిగా పనిచేసిన ఆదిత్యానాథ్ దాస్‌ను ఇరిగేషన్ సలహాదారుగా నియమించింది. దీంతో ఆయన ట్రిబ్యునల్ ముందు తెలంగాణ తరపున గట్టి వాదనలు వినిపిస్తున్నారు. కొత్తగా ముందుకు తెచ్చిన బకనచర్ల లింకుపైనా ఇటీవల ఫిర్యాదు చేశారు.

ఎపి పరిశీలన ఎలా

బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఇప్పటికే తెలంగాణ వినిపిస్తున్న వాదనలను గట్టిగా తిప్పికొడుతూ ఎపి తరపున వాదించేందుకు న్యాయవాదులు హాజరు కావాల్సి ఉంది. ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు జలాల విషయాలపై సంప్రదింపులు జరపాలి. తెలంగాణ వాదన ఏమిటి ? ఎపి తరపున ఏమి చెప్పాలనే అంశంపై నిరంతరం ప్రభుత్వం అభిప్రాయంపై అధికారులు న్యాయవాదులతో మాట్లాడాలి. జలాల వినియోగంలో ఎపికి ఉన్న హక్కులు, అధికారాలు వంటి అంశాలపై న్యాయవాదులకు వివరణ చెప్పాలి. ఇప్పటి వరకు అటువంటిది జరిగిన దాఖలా లేదు. ట్రిబ్యునల్‌లో వాదనలు సరిగ్గా వినిపించకపోతే మిగులు జలాల వినియోగ హక్కులు కోల్పోతామని, పైగా 2050 వరకూ కృష్ణా జలాలను నష్టపోయే ప్రమాదం ఉందని, తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయనీ చెబుతున్నారు.

వాదనలు వినిపిస్తాం : ఎపి అధికారులు

న్యాయవాదులను నియమించలేదన్న అంశంపై ఇరిగేషన్ అధికారులను ఫోన్లో వివరణ కోరగా ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపిస్తోందని, ఎపి ప్రభుత్వం చెప్పాల్సి వచ్చినప్పుడు న్యాయవాదులను నియమిస్తామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం చేసే వాదనలు వినకుండా న్యాయవాదులు ట్రిబ్యునల్ ముందు ఎటువంటి వాదనలు చేస్తారని ప్రశ్నించగా అది ప్రభుత్వ నిర్ణయమని వివరించారు.

న్యాయవాదుల బృందాన్ని ఏర్పాటు చేయాలి : టి లక్ష్మీనారాయణ

కృష్ణా జలాల అంశంలో కెఆర్‌ఎంబి, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపించేందుకు వెంటనే న్యాయవాదులతో కూడిన కౌన్సిల్ ఏర్పాటు చేయాలని నీటిపారుదల రంగ నిపుణులు తుంగా లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అన్యాయంగా ఉందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు కమిటీలు వేసి చర్చలు జరిపేవని, ఇప్పుడు కనీసం న్యాయవాదులను కూడా నియమించడం లేదని విమర్శించారు. ఇదే పద్ధతిలో ప్రభుత్వం ముందుకెళితే రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.

దూబే, ధోనీ.. ధనా ధన్

- **లక్నోపై ఐదు వికెట్ల తేడాతో చెన్నై గెలుపు**

లక్నో: ఈ సీజన్ ఐపిఎల్‌లో చెన్నై సూపర్ కింగ్(సిఎస్‌కె) రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. లక్నో సూపర్‌జెయింట్స్‌తో సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో చెన్నై జట్టు ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. లక్నో నిర్దేశించిన 167 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చెన్నై జట్టు చివరి 2ఓవర్లలో 24 పరుగులు చేయాల్సి వచ్చింది. లక్నో బౌలర్ శార్దూల్ ఠాకూర్ వేసిన ఓవర్లో ఏకంగా 19 పరుగులు రాబట్టి చెన్నై విజయాన్ని చేరువైంది. దీంతో చెన్నై మరో 3బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. ఓపెనర్లు రషీద్(27), రచిన్ రవీంద్ర(37)కి తోడు దూబే (43నాటౌట్), ధోనీ(26నాటౌట్) చెన్నై గెలుపులో కీలకపాత్ర పోషించారు. అంతకుముందు తొలిగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో జట్టు కెప్టెన్ రిషబ్ పంత్ రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 166పరుగులు చేసింది. లక్నో కెప్టెన్ పంత్ సూపర్ ఇన్నింగ్‌తో చెలరేగాడు. తొలుత ఓపెనర్ ఎడెన్ మర్క్‌రమ్(6) కొట్టిన బంతిని రాహుల్ త్రిపాఠి క్యాచ్ అందుకోవడంతో 6 పరుగులకే తొలి వికెట్ పడింది. ఆ తర్వాత డేంజరస్ నికోలస్ పూరన్(8)ను అన్షుల్ కంబోజ్ ఎల్బీగా వెనక్కి పంపాడు. అంపైర్ నాటౌట్ ఇవ్వడంతో రివ్యూ తీసుకొని మరీ వికెట్ సాధించింది చెన్నై. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ రిషభ్ పంత్(63).. జేమీ ఓవర్టన్ బౌలింగ్‌లో రివర్స్ స్కూప్‌తో సిక్సర్ సాధించాడు. దాంతో, లక్నో స్కోర్ 50 దాటింది. అయితే.. మార్ష్‌ను జడేజా బౌల్డ్ చేశాడు. ఆయుష్ బడోని ఉన్నంత సేపు ధాటిగా ఆడాడు. ఓవైపు నూర్ అహ్మద్.. డాట్ బాల్స్ వేస్తూ ఒత్తిడి పెంచారు. బౌండరీలు రావడం గగనమైన వేళ అతడు జడ్డూ బౌలింగ్‌లో ధోనీ స్టంపింగ్‌తో వెనుదిరిగాడు. ఒకదశలో లక్నో స్కోర్ 130 చేరడం కష్టమనిపించింది. 17వ ఓవర్ తర్వాత సీన్ మారిపోయింది. అబ్దుల్ సమద్(20) సిక్సర్ బాదాడు. దీంతో లక్నో నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది.



పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	6	4	2	8	+1.08
ఢిల్లీ	5	4	1	8	+0.89
బెంగళూరు	6	4	2	8	+0.67
లక్నో	7	4	3	8	+0.08
కోల్‌కతా	6	3	3	6	+0.80
పంజాబ్	5	3	2	6	+0.06
ముంబయి	6	2	4	4	+0.10
రాజస్తాన్	6	2	4	4	-0.83
సన్‌రైజర్స్	6	2	4	4	-1.24
చెన్నై	7	2	5	4	-1.55

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

స్కోర్‌బోర్డు...

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్: మార్క్రమ్ (సి)త్రిపాఠి (బి)ఖలీల్ అహ్మద్ 6, మిఛెల్ మార్ష్ (బి)జడేజా 30, పూరన్ (ఎల్‌బి)కంబోజ్ 8, పంత్ (సి)ధోనీ (బి)పథీరణ 63, ఆయుష్ బడోనీ (స్టంప్)జడేజా 22, అబ్దుల్ సమద్ (రనౌట్)ధోనీ 20, డేవిడ్ మిల్లర్ (నాటౌట్) 0, శార్దూల్ ఠాకూర్ (సి) షేక్ రషీద్ (బి)పథీరణ 6, అదనం 11. (20ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 166పరుగులు. **వికెట్ల పతనం:** 1/6, 2/23, 3/73, 4/105, 5/158, 6/158, 7/166 **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4-0-38-1, కంబోజ్ 3-0-20-1, ఓవర్టన్ 2-0-24-0, జడేజా 3-0-24-2, నూర్ అహ్మద్ 4-0-13-0, పథీరణ 4-0-45-2.

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రషీద్ (సి)పూరన్ (బి)ఆవేశ్ ఖాన్ 27, రచిన్ రవీంద్ర (ఎల్‌బి)మార్క్రమ్ 37, త్రిపాఠి (సి అండ్ బి)రవి బిష్ణోయ్ 9, జడేజా (సి)మార్క్రమ్ (బి)బిష్ణోయ్ 7, దూబే (నాటౌట్) 43, విజయ్ శంకర్ (సి)ఆవేశ్ ఖాన్ (బి)దిగ్వేష్ రాథి 9, ధోనీ (నాటౌట్) 26, అదనం 10. (19.3ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 168పరుగులు. **వికెట్ల పతనం:** 1/52, 2/74, 3/76, 4/96, 5/111 **బౌలింగ్:** శార్దూల్ ఠాకూర్ 4-0-56-0, ఆకాశ్ దీప్ 1-0-13-0, దిగ్వేష్ సింగ్ 4-0-23-1, ఆవేశ్ ఖాన్ 3.3-0-32-1, రవి బిష్ణోయ్ 3-0-18-2, మార్క్రమ్ 4-0-25-1.

ఐపిఎల్‌లో నేడు

పంజాబ్ కింగ్స్ × కోల్‌కతా నైట్‌రైడర్స్
వేదిక: ఛండీగఢ్; రాత్రి 7.30గం॥లకు

మలినేనికి బాలయ్య మరో ఛాన్స్



కథానాయకుడు నందమూరి బాలకృష్ణ మరో సినిమాలో నటించబోతున్నారు. 'వీర సింహారెడ్డి' సినిమాతో తనకు హిట్ ఇచ్చిన గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఈ సినిమా రానుంది. ఇప్పటికే వీరిద్దరి మధ్య కథ గురించి జరిగిన చర్చలు ఫలప్రదం కావటంతో త్వరలో అధికారిక ప్రకటన రానుంది. జాట్ సినిమాతో బాలీవుడ్ ప్రేక్షకులను మలినేని మెప్పించారు. తెలుగులో ఆయన నిర్మించిన క్రాక్ కూడా బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. వృద్ధి సంస్థ బ్యానర్‌పై సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మించబోతున్నారు. ఈ సంస్థ నుంచి ఇప్పటికే రామ్ చరణ్ 'పెద్ది' సినిమా తెరకెక్కుతోంది. బాలకృష్ణ–బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'అఖండ 2: తాండవం' దసరా సందర్భంగా సెప్టెంబర్ 25న థియేటర్లలోకి రానుంది.

'ఎఐ'తో కమల్ 237వ సినిమా



సినిమా జయాపజయాలతో పనిలేకుండా కథలో వైవిధ్యం ఉంటే ఓకే చెప్పే నటుడు కమల్‌హాసన్. ఇటీవల 'విక్రమ్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్‌ను ఆయన అందుకున్నారు. నిర్మాతగా 'అమరన్' చిత్రంతో మరో ఘన విజయాన్ని పొందారు. ప్రస్తుతం మణిరత్నం దర్శకత్వంలో 'థక్‌లైఫ్' చేశారు. నటుడు శింబు ముఖ్యపాత్రను పోషించిన ఈ చిత్రంలో త్రిష కథానాయిక. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సినిమా జూన్ 5న విడుదల కానుంది. నాయకన్ (నాయకుడు) తర్వాత మణిరత్నం– కమల్‌హాసన్ కాంబోలో రూపొందుతున్న ఈ చిత్రంపై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. కమల్‌హాసన్ తన 237వ చిత్రానికి కూడా సిద్ధమవుతున్నారు. ప్రముఖ ఫైట్‌మాస్టర్లు అన్ అన్బరివ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తున్నారు. ఇది పూర్తిగా యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని సమాచారం. ఈ సినిమా కోసం అమెరికా వెళ్లి అక్కడ ఎఐ టెక్నాలజీ నేర్చుకుని వచ్చారు. ఇప్పటికే పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. తన రాజ్‌కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తున్నారు. ఈనెలఖరు నుంచి ఈ సినిమా షూటింగ్ కూడా ప్రారంభం కానుంది. ఈ సినిమా తర్వాత లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో మరో సినిమాలో కమల్ నటించబోతున్నారు.

గాయపడ్డ ఫెర్గుసన్

ఈ సీజన్ ఐపిఎల్‌కు దూరం

ఛండీగఢ్: పంజాబ్ కింగ్స్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్ లాకీ ఫెర్గూసన్ మోకాలి గాయం కారణంగా ఈ సీజన్ ఐపిఎల్‌కు దూరమయ్యాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫెర్గూసన్ మోకాలికి గాయమైంది. అతడు గాయం నుంచి కోలుకోవడానికి దాదాపు నాలుగు వారాల సమయం పట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే సీజన్ మొత్తానికి ఫెర్గూసన్ దూరమయ్యాడు. ఈ విషయాన్ని జట్టు బౌలింగ్ కోచ్ జేమ్స్ హెూప్స్ కూడా ధృవీకరించాడు. ఫెర్గూసన్ పంజాబ్ తరపున నాలుగు మ్యాచ్‌ల్లో ఐదు వికెట్లు పడగొట్టాడు. అయితే అతడి స్థానంలో జేవియర్ బార్ట్‌లెట్ లేదా అజ్మతుల్లా ఒమర్జాయ్ తుది జట్టులోకి వచ్చే అవకాశముంది. ఇప్పటివరకు ఐదు మ్యాచ్‌లు పంజాబ్ మూడింట గెలుపొందింది.

సలీమాకు పగ్గాలు

ఆసీస్ పర్యటనకు జట్టును ప్రకటించిన హెచ్ఐ



భువనేశ్వర్: ఆస్ట్రేలియా పర్యటించిన మహిళల హాకీ జట్టును హాకీ ఇండియా(హెచ్ఐ) సోమవారం ప్రకటించింది. కెప్టెన్‌గా మిడ్‌ఫీల్డర్ సలీమా తేటె, వైస్ కెప్టెన్‌గా నవనీత్ కౌర్(ఫార్వర్డ్) ఎంపికవ్వగా.. ఐదుగురు క్రీడాకారిణులు సీనియర్ జట్టులో అరంగేట్రం చేయనున్నారు. జ్యోతి సింగ్, సుజాత కజూర్, అజ్మినా కుజుర్, పూజ యాదవ్, మహిమా తేతే అంతర్జాతీయ హాకీ మ్యాచుల్లో అరంగేట్రం చేయనున్నారు. గోల్‌కీపర్‌గా సవిత, బిచ్చుదేవి ఎంపికయ్యారు. ఈనెల 26నుంచి మే 4వరకు పెర్త్ హాకీ స్టేడియంలో ఆస్ట్రేలియాతో మూడు మ్యాచ్‌ల సిరీస్ జరగనుంది. ఈ సిరీస్ ప్రారంభానికి ముందు ఆస్ట్రేలియా–ఎతో 2మ్యాచ్‌ల సిరీస్‌లో భారత మహిళల హాకీ జట్టు ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది.

జట్టు: డిఫెండర్లు: జ్యోతి సింగ్, ఇషికా చౌదరి, సుశీలా ఛాను, సుజాత కుజుర్, సుమన్ దేవి, జ్యోతి, అజ్మినా కుజుర్, సాక్షి రాణా. **మిడ్‌ఫీల్డర్లు:** సలీమా టేటే, వైష్ణవి, నేహా, షర్మిలా దేవి, మనీషా చౌహాన్, సునీతా టోపో, మహిమా టేటే, పూజ యాదవ్, లాల్‌రిమిసిమి, **ఫార్వర్డ్స్:** నవనీత్ కౌర్, దీపిక, రుతుజ, ముంతాజ్ ఖాన్, బల్జీత్ కౌర్, దీపిక షొరెన్, బ్యూటీ డంగ్‌డున్. **స్టాండ్‌బై:** బన్సారి సోలంకి(గోల్‌కీపర్), అంజన, లాల్‌తుంగి(డిఫెండర్లు), సాక్షి శుక్లా, ఖైడమ్ షిలేమా(మిడ్‌ఫీల్డర్లు), డిపి మోనిక, సోనమ్(ఫార్వర్డ్)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68